అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

మంగళవారం 28-11-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 327 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 10 పేజీలు + టాబ్లాయిడ్ 12 పేజీలు వెల : 6.50

58 ఏళ్ల అధోగతి VS 9 ఏళ్ల ప్రగతి

తక్కువ కాలంలో ఎక్కువ అభివృద్ధి.
ఇదంతా మనం కలసికట్టుగా సాధించుకున్నాం.



11 పర్యాయాలు అధికారంలో ఉన్న మిగతా పార్టీల పాలన ఫలితాలు - 2014లో		2 పర్యాయాల బీఆర్ఎస్ పాలన ఫలితాలు - 2023లో
6 గం.	వ్యవసాయానికి విద్యుత్ సరఫరా	24 గం.
131 లక్షల ఎకరాలు	సాగు అవుతున్న భూమి	268 లక్షల ఎకరాలు
68 లక్షల టన్నులు	వరి ఉత్పత్తి	3.5 కోట్ల టన్నులు
150 లక్షల మెట్రిక్ టన్నులు	పంట ఉత్పత్తి	362 లక్షల మెట్రిక్ టన్నులు
₹1,24,104	తలసరి ఆదాయం	₹3,17,115
₹57,258 Cr.	ఐటి ఎగుమతులు	₹2,41,275 Cr.
3,23,396	ఐటి ఉద్యోగాలు	10,00,000
7,778 మెగా వాట్లు	విద్యుదుత్పత్తి	18,567 మెగా వాట్లు
41	రిజర్వాయర్ల సంఖ్య	157
6,762 కి.మీ.	రోడ్డు పొడవు (2 లేన్లు & 4 లేన్లు)	13,214 కి.మీ.
5	వైద్య కళాశాలల సంఖ్య	34
293	ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల సంఖ్య	1,022
18,400	ఆసుపత్రులలో పడకల సంఖ్య	68,000
92	ప్రసూతి మరణాల రేటు	43
39	శిశు మరణాల రేటు	21
13.18%	పేదరికంలో ఉన్న జనాభా	5.8%
967	ఫ్లోరోసిస్ ప్రభావానికి గురైన ఆవాసాల సంఖ్య	సున్నా

సాధించింది చాలా ఉంది
సాధించాల్సింది ఇంకా ఉంది

కారు గుర్తుకే ఓటేద్దాం
తెలంగాణని గెలిపిద్దాం



కేసీఆర్ భరోసా

రైతుబంధు
ఎకరాకు ఏటా రూ. 16,000 కు పెంచబడుతుంది

గ్యాస్ సిలిండర్
అర్హులైన పేద కుటుంబాలకు రూ. 400 కే

ఆసరా పింఛను
నెలకు రూ. 5,016 కు పెంచబడుతుంది

సౌభాగ్య లక్ష్మి
పేద మహిళలకు నెలకు రూ. 3,000

అన్నపూర్ణ పథకం
తెల్ల రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం

కేసీఆర్ ఆరోగ్య రక్ష
ఆరోగ్య భీమా కవరేజీ రూ. 15 లక్షలకు పెంచబడుతుంది

ఆరునూరైనా డిసెంబరు ఆరున ఖాతాల్లో డబ్బులేస్తాం..

రైతుబంధు నిలిపివేతపై మంత్రి హరీశ్‌రావు

- ఎన్ని కుట్రలు పన్నినా ఆ పథకం ఆగదని వ్యాఖ్య
- రైతు నోటికాడ ముద్దను కాంగ్రెస్ లాక్కుందని ఆగ్రహం
- ఓటుతో ప్రజలు బుద్ధి చెబుతారంటూ హెచ్చరిక
- బీఆర్ఎస్ 80 స్థానాల్లో గెలుస్తుందని ధీమా



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆరు నూరైనా డిసెంబరు ఆరున అన్నదాతల ఖాతాల్లో రైతు బంధు డబ్బులేస్తామని రాష్ట్ర మంత్రి తన్నీరు హరీశ్‌రావు స్పష్టం చేశారు. కాంగ్రెస్ నేతల ఫిర్యాదు వల్లే రైతు బంధును ఎన్నికల సంఘం ఆపిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆ రకంగా ఆ పార్టీ రైతు నోటి కాడి ముద్దను ఎత్త గొట్టిందని (లాక్కోవటం) వాపోయారు. ఈ నేపథ్యంలో ప్రజలు కాంగ్రెస్‌కు ఓట్లతో తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్లమెంటరీ పక్షనేత కె.కేశవరావుతో కలిసి ఆయన మీడియా సమావేశాన్ని నిర్వహించారు. రైతు బంధు పథకాన్ని ఆపాలంటూ రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌ఛార్జి మాణిక్‌రావు ఠాక్రే అక్టోబర్ 23న ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారని హరీశ్‌రావు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆ పథకం పాతదే కాబట్టి... బీఆర్ఎస్ అభ్యర్థన మేరకు తొలుత ఈసీ అనుమతించిందని అన్నారు. పీసీసీ ఉపాధ్యక్షులు నిరంజన్ మరోసారి ఫిర్యాదు చేయడంతోనే ఈసీ ఇప్పుడు రైతు బంధును ఆపిందని తెలిపారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా రైతు బంధు స్కీం ఆగబోదన్నారు. బీఆర్ఎస్ మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత డిసెంబర్ 6న రైతుల ఖాతాల్లో నిధులను జమ చేస్తామని హామీనిచ్చారు.

కాంగ్రెస్ మొదటి నుంచి రైతు వ్యతిరేక పార్టీ అని ఆయన ఈ సందర్భంగా విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడుగానీ, ప్రతి పక్షంలో ఉన్నప్పుడుగానీ అన్నదాతల పట్ల ఆ పార్టీ సానుకూలంగా వ్యవహరించలేదని దుయ్యబట్టారు. పీసీసీ మాజీ అధ్యక్షులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ప్రస్తుత అధ్యక్షులు రేవంత్‌రెడ్డి మీడియా సమావేశాల్లో రైతు బంధుపై విషం కక్కారని గుర్తు చేశారు. ఆ పథకం దుబారా ఖర్చని ఒకరంటే, రైతులకు బిచ్చమేస్తున్నారా? అంటూ మరొకరు విమర్శించారని తెలిపారు. మోసపూరిత వాగ్దానాలతో కర్ణాటకలో అధికారం చేపట్టిన కాంగ్రెస్... తెలంగాణ ప్రజలను మోసం చేసేందుకు అబద్ధపు ఆరు గ్యారంటీలను తీసుకొచ్చిందని ఎద్దేవా చేశారు. ఆ రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో అమల్లో ఉన్న రూ. 4 వేల రైతు సాయాన్ని రద్దు చేయడంతోపాటు కరెంట్ కోతలు, స్కాలర్‌షిప్పులపై ఆంక్షలు పెట్టిందని విమర్శించారు. నాలుగు గంటల కరెంటు చాలంటూ ఒకరంటే, మీటర్లు పెడుతామంటూ మరొకరు రైతులను భయపెడుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలైన రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్‌ల్లో కరెంట్ మోటార్లకు మీటర్లు పెట్టారని ఆరోపించారు. వంద రోజుల్లో 2.5 లక్షల ఉద్యోగాలు ఇస్తామంటూ రాహుల్ గాంధీ బెంగళూరు ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ, 180 రోజులు గడుస్తున్నా అమలు కాలేదని అన్నారు. ఇప్పటి వరకూ ఆ రాష్ట్రంలో ఒక్క నోటిఫికేషన్ కూడా రాలేదని చెప్పారు. ఎన్నికలప్పుడు ఎన్నో వాగ్దానాలను ఇస్తాం, అన్నీ అమలు జరుగుతాయా? అంటూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అనడం వారి మోసాన్ని బట్టబయలు చేస్తోందని అన్నారు. కర్ణాటకలో ఇచ్చిన హామీలను అమలు చేయని కాంగ్రెస్... తెలంగాణలో ఏ ముఖం పెట్టుకుని ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీలకు రైతులపై ప్రేమ లేదనీ, ఇప్పటి వరకు స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయలేదని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుబంధు సృష్టికర్త అనీ, దేశంలో ఏ రాష్ట్రం అమలు చేయని సంక్షేమ పథకాలను ఇక్కడి రైతాంగానికి అమలు చేస్తున్నామని చెప్పారు. ఎవరెన్ని అబద్ధపు ప్రచారాలు చేసినా తమ పార్టీ 80 సీట్లను గెలుచుకుని చరిత్ర సృష్టిస్తుందని హరీశ్‌రావు ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు.

నేటితో ప్రచారం సమాప్తం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

అసెంబ్లీ ఎన్నికల ప్రచారం మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు ముగియనుంది. ఇప్పటికే ప్రధాని మోడీ సహా జాతీయ స్థాయిలోని అతిరథ మహారథ నేతలంతా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. మంగళవారం రోడ్ షోల ద్వారా ఎక్కువ నియోజకవర్గాలను కవర్ చేసేలా రాజకీయపార్టీలు ప్రణాళికలు రూపొందించుకున్నాయి. కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే ఓటరు స్లిప్పుల పంపిణీని దాదాపు పూర్తి చేసింది. ఎక్కడన్నా మిగిలిపోయిన చోట్ల బుధవారంనాటికి అందచేస్తారు. బుధవారం ఎన్నికల సామాగ్రి జిల్లాల్లోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు చేరనుంది. అక్కడి నుంచి 29వ తేదీ పోలింగ్ స్టేషన్లకు తరలిస్తారు.

నేడు వికలాంగుల ప్రచారం : ముత్తినేని వీరయ్య

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ రాబోతోంది... వికలాంగుల భవిష్యత్తు బంగారం కాబోతుంది అనే నినాదంతో మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం నిర్వహించనున్నట్టు టీపీసీసీ వికలాంగుల విభాగం చైర్మెన్ ముత్తినేని వీరయ్య తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే వికలాంగుల పెన్షన్ రూ.6 వేలు, ఉచిత బస్సు ప్రయాణం, వికలాంగుల హక్కుల చట్టం అమలు, నిరుద్యోగ వికలాంగుల బ్యాక్ లాగ్ ఉద్యోగాల భర్తీ, ఉద్యోగ రిజర్వేషన్ పటిష్టంగా అమలు చేయనున్నట్టు తెలిపారు.

నిరుద్యోగులను మోసగించిన కేసీఆర్ : సచిన్ పైలట్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీఎం కేసీఆర్ నిరుద్యోగులను మోసం చేశారని కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు సచిన్ పైలట్ విమర్శించారు. సోమవారం గాంధీభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన నిరుద్యోగులతో ఇష్టాగోష్టిలో పాల్గొన్నారు. అనంతరం మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఆశలతో ఆవిర్భవించిన తెలంగాణలో నిరుద్యోగుల జీవితాలను బీఆర్ఎస్ చిదిమేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియామకాలు జరపలేదనీ, నోటిఫికేషన్లు ఇచ్చినా పరీక్షలను సరిగ్గా నిర్వహించలేదనీ, ఐదేండ్లు గడిచినా నిరుద్యోగ భృ తి హామీని నిలబెట్టుకోలేదని విమర్శించారు. పదేండ్ల తర్వాత సీఎం కేసీఆర్ మళ్లీ అవే సమస్యలను పరిష్కరిస్తానంటూ రావడం హాస్యాస్పదమన్నారు.

కర్ణాటక కార్మికశాఖ మంత్రి సంతోష్ ఎస్.లాడ్ మాట్లాడుతూ తాము గిగా వర్కర్ల (స్విగ్గీ తదితర ఆన్ లైన్ ప్లాట్ ఫాంలలో పని చేసే వారు) కోసం ఇచ్చిన గ్యారంటీని అమలు చేస్తున్నట్టు తెలిపారు. 50 లక్షల మంది దీంతో వైద్య, బీమా తదితర సౌకర్యాలు పొందుతున్నారని తెలిపారు.

కాంగ్రెస్‌ను గెలిపించండి

- క్రైస్తవులను మోసం చేసిన బీఆర్ఎస్
- ఇండియన్ క్రిస్టియన్ కౌన్సిల్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్ఎస్ పార్టీ అన్ని రకాలుగా క్రైస్తవులను మోసం చేసిందని ఇండియన్ క్రిస్టియన్ కౌన్సిల్ (ఐసీసీ) ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లోని సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఐసీసీ చైర్మెన్ శావల జోసఫ్ మీడియాతో మాట్లాడారు. క్రైస్తవేతరుడైన రాజేశ్వర్ రావుకు ఎమ్మెల్సీ పదవిని కట్టబెట్టడమే కాకుండా క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్ పదవిలో కూర్చబెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇతరులకు నామినేటెడ్ పోస్టులను అప్పజెప్పి క్రైస్తవులకు ఇచ్చినట్టు తప్పుడు ప్రచారంతో మోసం చేసిందని విమర్శించారు. క్రైస్తవుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిన బీఆర్ఎస్‌ను ఓడించాలనీ, క్రైస్తవుల సంక్షేమానికి స్పష్టమైన హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు.

మందకృష్ణ మోసం, బీజేపీ కుట్రలను భగ్నం చేస్తాం : క్రిస్టియన్ జేఏసీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మందకృష్ణ మాదిగ మోసాన్ని, బీజేపీ కుట్రలను భగ్నం చేస్తామని క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ తెలిపింది. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత క్రైస్తవులు వర్గీకరణకు వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. అయితే మాదిగ క్రైస్తవులను మతోన్మాద బీజేపీ చేతిలో బలి పశువులను చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఎన్నికల వేళ వర్గీకరణ డ్రామా ఆపాలనీ, ప్రధాని మోడీకి నిజంగా చిత్తశుద్ధి ఉంటే లోక్‌సభ ఎన్నికల్లోపు పార్లమెంటులో బిల్లు పెట్టించాలని డిమాండ్ చేశారు. గతంలో చంద్రబాబు, కాంగ్రెస్ ఎన్నికల్లో వాడుకున్నట్టుగానే బీజేపీ మందకృష్ణను ఈ ఎన్నికల్లో వాడుకోవాలని చూస్తున్నదన్నారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న మాదిగలకు, మాదిగ క్రైస్తవులకు పదవులివ్వకుండా కాంగ్రెస్ పార్టీ కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీని గెలిపించుకుంటామని తెలిపారు.

డిసెంబర్ 1న ప్రత్యేక సెలవు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రభుత్వ ఉద్యోగులకు డిసెంబర్ 1వ తేదీ ప్రత్యేక క్యాజువల్ లీవ్ ఇస్తున్నట్టు ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈనెల 29, 30 తేదీల్లో ఎన్నికల విధుల్లో పాల్గొన్న వారికి ఈ సెలవు వర్తిస్తుందని ఆయా జిల్లాల కలెక్టర్లు, రిటర్నింగ్ అధికారులు వేర్వేరుగా ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాల విద్యాశాఖ, ఇంటర్మీడియట్, కళాశాల, సాంకేతిక విద్యాశాఖలతో పాటు ఇతర శాఖలకూ వర్తిస్తుందనీ, ఆయా విభాగాధిపతులు దీనికి సంబంధించి ఎన్నికల సంఘం ఆదేశాలు ఫాలో కావాలని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాలు ఉన్న విద్యాసంస్థలకు ఈనెల 29, 30 తేదీల్లో సెలవులు ప్రకటించారు.

గిగ్ వర్కర్ల కోసం ప్రత్యేకంగా సంక్షేమ బోర్డు ఏర్పాటు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

లో గిగ్ వర్కర్ల సంక్షేమానికి ప్రత్యేకంగా సంక్షేమ బోర్డు ఏర్పాటు- కేటీఆర్ రాష్ట్రంలో స్విగ్గీ, జొమాటో, ఓలా, ఊబర్, ఇతర పార్ట్ టైం ఉద్యోగాలు చేసే యువకుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా బోర్డును ఏర్పాటు చేస్తామని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్, పురపాలక శాఖ మంత్రి కె తారక రామారావు చెప్పారు. వారు సేవలు అందిస్తున్న కంపెనీలతో మాట్లాడి ఈ ఉద్యోగులకు ఆరోగ్య బీమా, ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్), ఈఎస్ఐ వంటి సౌకర్యాలను అందించడంతోపాటు ఉద్యోగ భద్రతను కల్పించేలా చూస్తామన్నారు. రాష్ట్రంలో సుమారు మూడు లక్షలకుపైగా యువకులు ఈ పార్ట్ టైం ఉద్యోగాలు చేస్తున్నారని వివరించారు. సోమవారం హైదరాబాద్‌లో గిగ్ వర్కర్లతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రజలకు అనేక రకాల సేవలు అందిస్తున్న వారి సంక్షేమాన్ని చూసుకోవడం ప్రభుత్వాల బాధ్యత అని, ఈ దిశగా బీఆర్ఎస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కేటీఆర్ అన్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత అధికారంలోకి రాగానే ఈ గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం ప్రభుత్వ అధికారులు కంపెనీ ప్రతినిధులు గిగ్ వర్కర్ల ప్రతినిధులతో కలిపి సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ బోర్డులో ఒక లీగల్ సెల్ వ్యవస్థతోపాటు, ఈ యువకులకు కంపెనీల తరఫున ఎదురయ్యే న్యాయపరమైన ఇబ్బందులను ఎదుర్కొనేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం చేస్తున్న డెలివరీకి కొంత సొమ్ము అందుకుంటున్న పద్ధతితోపాటు వారికి కనీస జీతాలను అందించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. రాష్ట్రంలో భారీగా పెరిగిన ఐటీ ఉద్యోగాలు, ఇతర రంగాల్లో జరిగిన కంపెనీల విస్తరణ తర్వాత గిగ్ వర్కర్లకు భారీ డిమాండ్ ఏర్పడిందని వివరించారు. దీంతో ఎవరిపైనా ఆధారకుండా వారు సంపాదించుకోగలుగుతున్నారనీ, వారి సంక్షేమం కోసం కట్టుబడి ఉన్నామని చెప్పారు. ఈ చర్చల సందర్భంగా వారికి ఎదురవుతున్న పలు ఇబ్బందులను కేటీఆర్ దృష్టికి తెచ్చారు. పలు కంపెనీలు తమకు అందించే ఫీజులను ఏమాత్రం పెంచడం లేదనీ, పైగా ఇన్సెంటివ్‌లను తీసేశాయని వివరించారు. ఈ కంపెనీ ప్రతినిధులతో తాను స్వయంగా మాట్లాడి ఈ అంశంలో వారికి సానుకూలంగా నిర్ణయం తీసుకునేలా చర్యలు తీసుకుంటానని కేటీఆర్ హామీ ఇచ్చారు. ప్రభుత్వమే స్వయంగా ఫుడ్ డెలివరీ, క్యాబ్ బుకింగ్, ఇతర ఆన్‌లైన్ సేవలకు సంబంధించిన ఒక ప్రత్యేక యాప్‌ని ఏర్పాటు చేస్తే ఉపయుక్తంగా ఉంటుందని పలువురు తెలిపిన ప్రతిపాదనపై కేటీఆర్ సానుకూలంగా స్పందించారు. ఇప్పటికే ఇలాంటి ఒక వ్యవస్థ కేరళలో ప్రారంభమైందనీ, దానిపైన అధ్యయనం చేసి మరింత మెరుగులు దిద్ది తెలంగాణలో అమలు చేస్తామని హామీ ఇచ్చారు.

రేవంత్‌పై తప్పుడు ప్రచారం : కోదండరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రైతుబంధు పేరుతో ఎన్నికల్లో గెలవాలని బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రయత్నించిందని కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షులు కోదండరెడ్డి విమర్శించారు. సోమవారం గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడేండ్లుగా ఏనాడు నవంబర్‌లో రైతుబంధు వేయలేదని గుర్తుచేశారు. 2018లోనూ ఇదే విధంగా ఎన్నికల ముందు వేశారని తెలిపారు. రైతుబంధు రబీ సీజన్ ప్రారంభంలో వేయడంలో ప్రభుత్వం విఫలమై రేవంత్ రెడ్డి ఆపినట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

ఎన్నికల ప్రచారానికి వాడుకోవద్దనే షరతుతో రైతుబంధుకు ఎన్నికల కమిషన్ అనుమతించిందని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు నిరంజన్ తెలిపారు. అయితే హరీశ్ రావు ఎన్నికల ప్రచారానికి వాడుకోవాలని చూడటంతో అదే విషయాన్ని తాము ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లినట్టు పేర్కొన్నారు. అంతే గానీ తాము రైతు బంధు ఆపాలని కోరలేదని స్పష్టం చేశారు. రైతు బంధు ఎన్నికల ప్రచారానికి వాడుకుంటున్నారని ఎన్నికల కమిషన్ సుమోటోగా తీసుకొని ఆపుతున్నట్టు తెలిపిందని టీపీసీసీ అధికార ప్రతినిధి రామచంద్రారెడ్డి తెలిపారు.

కాంగ్రెస్ రాగానే ...10 రోజుల్లో రూ.15 వేల రైతు భరోసా ఖాతాల్లోకి.. : రేవంత్ ట్వీట్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రైతుబంధుతో ఓట్లు దండుకోవాలన్న దురాశ, ఆత్రుత, అహంకారం తప్ప, నిజంగా రైతులకు మేలు జరగాలన్న ఉద్దేశం మామా-అల్లుళ్లకు లేదని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి కేసీఆర్, హరీశ్ రావులను ఉద్దేశించి విమర్శించారు. ఈ మేరకు సోమవారం ట్వీట్ చేశారు. హరీశ్ రావు వ్యాఖ్యల కారణంగానే రైతుబంధుకు ఇచ్చిన అనుమతిని ఉపసంహరించుకుంటున్నట్టు ఈసీ ఆదేశాలు ఇవ్వడం దీనికి నిదర్శనమని తెలిపారు. ద్రోహులను ఇంటికి పంపితే తప్ప రైతులకు న్యాయం జరగదని పేర్కొన్నారు. రాష్ట్రంలో రైతులు ఆందోళన చెందవద్దని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పది రోజుల్లో రూ.15 వేల రైతు భరోసా మీ ఖాతాల్లో వేస్తామని హామీ ఇచ్చారు.

బీఆర్ఎస్‌పై చర్యలు తీసుకోండి

రైతు బంధుపై కేంద్ర ఎన్నికల సంఘానికి పీసీసీ అధ్యక్షుడి హోదాలో తాను రాసినట్టు ఫేక్ లేఖ సృష్టించి సోషల్ మీడియాలో బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తున్నదని రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓటమి భయంతో బీఆర్ఎస్ దిగజారి ఇలాంటి తప్పుడు ప్రచారాలకు పాల్పడుతున్నదని విమర్శించారు. దీనిపై చర్యలు తీసుకోవాల్సిందిగా కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ఎన్నికల ముఖ్య అధికారి వికాస్ రాజు, రాష్ట్ర డీజీపీని ఆయన కోరారు.

తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌ను ఆదరించండి

- దేశవ్యాప్తంగా ప్రజలు మార్పు కోరుకుంటున్నారు
- కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని ఆదరించి భారీ మెజార్టీతో గెలిపించాలని సీనియర్ ఐఎన్‌టీయూసీ నాయకులు మాజీ ఎంపీ సర్వే సత్యనారాయణ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, తెలంగాణతో పాటు దేశంలో కాంగ్రెస్ పార్టీ డబుల్ ఇంజిన్ సర్కార్ అధికారంలోకి రానుందని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల వల్ల దేశంలో పబ్లిక్ రంగ సంస్థలు మూతపడుతున్నాయని ఆరోపించారు. లాభాల్లో ఉన్న అనేక ఫ్యాక్టరీలను గంపగుత్తన తన కార్పొరేట్ మిత్రులకు కట్టబెట్టేదుంకు మోడీ కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. కేసీఆర్ పాలనలో కార్మికుల హక్కులు, సంక్షేమం, భద్రత లేకుండా పోయాయని అయన ఆందోళన వ్యక్తం చేశారు. .

గత కాంగ్రెస్ పాలనలో వేతనాలు పెరగడంతోపాటు ఉద్యోగభద్రత ఉండేదని, పెన్షన్ విధానం కూడా సక్రమంగా అమలు చేసేదని అయన గుర్తు చేసారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించి, కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని కార్మికవర్గానికి సర్వే సత్యనారాయణ పిలుపునిచ్చారు. సమావేశంలో ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షులు అంబటి కష్ణమూర్తి, ఏఐసీసీ మాజీ సభ్యులు, డాక్టర్ సి.యాదగిరి, ఐఎన్‌టీయూసీ నాయకులు గుంజి శ్రీనివాస్, ,గూడా ఐలయ్య గౌడ్, సి. నాగరాజు, బి. అమర్ బాబు, పన్ని యాదవ్, చాంద్ పాషా, భాస్కర్, ప్రకాశ్, ఎన్. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓటేయండి

ఆర్టీసీ కార్మికులకు అశ్వత్థామరెడ్డి పిలుపు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ) కార్మికులు కాంగ్రెస్‌పార్టీకి ఓటు వేయాలని తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టీఎమ్‌యూ) గౌరవాధ్యక్షులు ఈ అశ్వత్థామరెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం ఆర్టీసీ కార్మికులు చేసిన పోరాటం అద్వితీయమనీ, కానీ సీఎం కేసీఆర్ నేతృత్వంలోని ప్రభుత్వం ఆ త్యాగాలను గుర్తించకపోగా, అరిగోస పెట్టిందని విమర్శించారు. 52 రోజుల సమ్మెలో 32 మంది కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారనీ, నాలుగేండ్లుగా ఆర్టీసీలో కార్మిక సంఘాలను అనుమతించకుండా నియంత పాలన నడిపిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆర్టీసీ కార్మికుల సమస్యల్ని ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టి, పరిష్కరిస్తామని హామీ ఇచ్చినందుకు ఆపార్టీకి ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

మరోసారి వంచన

టీఎమ్‌యూ ప్రధాన కార్యదర్శి థామస్‌రెడ్డి

తెలంగాణా మజ్దూర్ యూనియన్ పేరుతో మరోసారి అశ్వత్థామరెడ్డి ఆర్టీసీ కార్మికులను వంచించేందుకు వీధినాటకం ఆడుతున్నారని టీఎమ్‌యూ ప్రధాన కార్యదర్శి థామస్‌రెడ్డి విమర్శించారు. ఈ మేరకు సోమవారంనాడొక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఆర్టీసీ తెలంగాణా మజ్దూర్ యూనియన్‌కు, అశ్వత్థామరెడ్డి కి ఎలాంటి సంబంధం లేదనీ, కేవలం కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయ లబ్ది పొందాలనేదే ఆయన తాపత్రయమని విమర్శించారు.

అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
మంగళవారం 28-11-2023
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 9 సంచిక : 327
Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar
10 పేజీలు + టాబ్లాయిడ్ 12 పేజీలు వెల : 6.50

రైతుబంధుకు ఈసీ బ్రేక్

మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యలతోనే..



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రైతుబంధు పంపిణీని నిలిపివేస్తున్నట్టు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) ప్రకటించింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి టీ హరీశ్‌రావు రైతు బంధు పంపిణీపై ప్రకటన చేయడంతో ఈనెల 24వ తేదీ ఇచ్చిన అనుమతిని రద్దు చేస్తున్నట్టు సోమవారంనాటి రాతపూర్వక ఉత్తర్వుల్లో ఈసీ పేర్కొంది. ఈనెల 24వ తేదీ ...9లో



ప్రజలే గెలవాలి...

తెలంగాణ ఎన్నికలు దేశ రాజకీయాలను మార్చాలి

- దేశంలో దుర్మార్గ పాలన సాగుతోంది
- బీజేపీకి బుద్ధి చెప్పాలి
- బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే..
- ఇబ్రహీంపట్నం సీపీఐ(ఎం) అభ్యర్థి పి.యాదయ్యను గెలిపించాలి: త్రిపుర మాజీ సీఎం మాణిక్ సర్కార్

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

ప్రజా సమస్యలపై పోరాడేది ఎర్రజెండానే అని, భవిష్యత్ కూడా ఎర్రజెండాకే ఉందని.. చట్టసభల్లో ప్రజల గొంతు వినిపించేందుకు సీపీఐ(ఎం) అభ్యర్థులను గెలిపించాలని త్రిపుర మాజీ ముఖ్యమంత్రి, సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు మాణిక్ సర్కార్ పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ సీపీఐ(ఎం) అభ్యర్థి పగడాల యాదయ్య విజయాన్ని కాంక్షిస్తూ పోల్కంపల్లి, దండుమైలారం, ఆరుట్ల గ్రామాల్లో నిర్వహించిన రోడ్ షోల్లో ఆయన మాట్లాడారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం పెట్టుబడిదారుల కొమ్ముకాస్తూ, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందని విమర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల కొనుగోలు శక్తిని పెంచేందుకు గ్రామీణ ఉపాధిహామీని ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వంతో పోరాడిసీపీఐ(ఎం) సాధించిందని గుర్తు చేశారు. దాన్ని నిర్వీర్యం చేసేందుకు మోడీ ప్రభుత్వం కుట్రలు చేస్తుందన్నారు. ప్రజల కొనుగోలు శక్తి పెంచలేని ఎన్ని పథకాలు ఉన్నా ప్రయోజనం లేదని తెలిపారు. ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా ఉపాధిహామీ కూలి రూ.600లకు పెంచాలని, ఏడాదికి 200 పని దినాలు కల్పించాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాల్సి ప్రభుత్వం ప్రయివేటు పెట్టుబడిదారులకు తెగనమ్ముతుందన్నారు. ఈ విషయంపై బీజేపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన కాంగ్రెస్, బీఆర్ఎస్ మౌనంగా ఉన్నాయని, వారికి అధికారం తప్ప ప్రజా సమస్యలు, దేశ భవిష్యత్తు పట్టదని చెప్పారు. ఇలాంటి నాయకులను చట్టసభల్లోకి పంపిస్తే ప్రజా సమస్యలపై ఏం మాట్లాడతారని నిలదీశారు. బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసి పేద, దళిత, గిరిజన, మహిళల హక్కులను కాలరాసే కుట్రలు కేంద్రంలో ...9లో

చరిత్రను తిరగరాద్దాం

కమ్యూనిస్టుల్ని చట్టసభలకు పంపిద్దాం

రంగన్నను గెలిపించండి

- మోడీని దించితేనే భవిష్యత్తు
- పొత్తులు కుదరకపోవడానికి కాంగ్రెస్సే కారణం
- వ్యాపారంగా మారిన ఎన్నికలు : మిర్యాలగూడ రోడ్ షోలో సీతారాం ఏచూరి
- వేములపల్లి నుంచి వాడపల్లి వరకు భారీ ర్యాలీ

వివరాలు 9లో






నేను బతికుండగా రైతుబంధు ఆగుద్దా..!

30న ఓట్లు పడుదే... 3న కారు గెలిచుడే...6న డబ్బులు పడుడే

- బీజేపీకి ఓటు వేస్తే మోరీలో వేసినట్టే..
- అసైన్డ్ భూముల పట్టాలపై తొలి సంతకం : షాద్‌నగర్, చేవెళ్ల, ఆందోల్, సంగారెడ్డి ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్



నవతెలంగాణ- మెదక్ ప్రాంతీయ ప్రతినిధి/ షాద్‌నగర్, చేవెళ్ల

కేసీఆర్ బతికుండగా రైతుబంధు ఆగుద్దా..? రైతుబంధు డబ్బులివ్వొద్దని కాంగ్రెసోళ్లు కుట్రలు చేసి ఆపింద్రు. న్యాయ పోరాటం చేస్తే 28న ఇచ్చేందుకు ఈసీ అనుమతిచ్చింది. ఇంతలో మరో కాంగ్రెసోడు మళ్లీ ఫిర్యాదు చేసి ఆపిండు. ఇట్ల ఎన్ని రోజులు ...5లో



బీఆర్ఎస్, బీజేపీల ఛోటాభాయ్ ఎంఐఎం

దోస్తానాతోనే కేవలం 9 సీట్లలో పోటీ

- ఫామ్‌హౌస్ పాలన వద్దు.. ప్రజా పాలన రావాలి
- కాంగ్రెస్‌ను గెలిపించాలి : ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ





నవతెలంగాణ - భువనగిరి/ మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

"బీఆర్ఎస్, బీజేపీల చిన్నతమ్ముడు ఎంఐఎం.. ఆ దోస్తానితోనే ఎంఐఎం 9 సీట్లలోనే పోటీ చేసింది.. ఫామ్‌హౌస్ పాలన మనకొద్దు.. ప్రజా పాలన కావాలి.. భూములను కబ్జా చేసే బీఆర్ఎస్‌ను ఓడించాలి.. లౌకిక దారుల్లో నడిచే కాంగ్రెస్‌ను గెలిపించండి" అని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ అన్నారు. సోమవారం యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి, ఉమ్మడి ...9లో

అంతా మోడీనే...

ప్రచారాలన్నీ ప్రధాని కేంద్రంగానే..

ఈ ఏడాది ముగింపు నాటికి ఐదు రాష్ట్రాలలో కొత్త ప్రభుత్వాలు కొలువుదీరనున్నాయి. ఈశాన్య రాష్ట్రం మిజోరం మినహా మిగిలిన అన్ని రాష్ట్రాల్లో బీజేపీ ప్రచారానికి మోడీ విస్తృతంగా పర్యటించారు. 'మోడీ గ్యారంటీ' అంటూ ప్రచారం చేశారు. ఎన్నికలు జరిగిన(జరగబోయే) రాష్ట్రాల్లో అక్కడి స్థానిక నేతలతో సంబంధం లేకుండా మోడీ కేంద్రంగానే అంతా తానే అన్న విధంగా ఆయన ప్రచారం సాగింది. అయినప్పటికీ.. ఆ పార్టీకి ఆశించిన ఫలితాలు వచ్చేలా కనిపించటం లేదు. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణల్లో బీజేపీకి అవకాశాలు అంతగా లేవనీ, రాజస్థాన్‌లో గట్టి పోటీ ఉంటుందని రాజకీయ పరిశీలకుల అంచనాలు, పలు సంస్థల సర్వేలు వెల్లడిస్తున్నాయి.

- ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇదే తీరు
- అయినా బీజేపీకి ఎదురుగాలే : రాజకీయ విశ్లేషకులు

న్యూఢిల్లీ : ఎన్నికల ప్రచార సరళి మోడీ వర్సెస్ ఆల్ అన్నట్టుగా చూపించాలన్నది బీజేపీ తాపత్రయమని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఈ ఏడాది ప్రారంభంలో బీజేపీ ఘోరంగా ఓడిపోయిన కర్నాటక నుంచి ఎలాంటి పాఠాలూ నేర్చుకోలేదని చెప్తున్నారు. అక్కడ కూడా మోడీ.. బీజేపీ ప్రచారానికి నాయకత్వం వహించి ఎన్నికలను తనవైపు తిప్పుకున్నారు. అయినప్పటికీ ఆ ఎన్నికల్లో బీజేపీ ఘోర పరాభవాన్ని మూటగట్టుకున్నది. ఆ నష్టాన్ని మరచిపోకముందే మరోసారి ప్రస్తుత ఐదు రాష్ట్రాల ఎన్నికల్లోనూ తానే కేంద్ర బిందువుగా బీజేపీ తరఫున మోడీ ప్రచారానికి దిగారు. ప్రధాని హోదాలో మోడీ ప్రజల్లో అంతా తానే అన్నవిధంగా రాజరికాన్ని ప్రదర్శించే ప్రయత్నాలు చేస్తున్నారని రాజకీయవిశ్లేషకులు అంటున్నారు. అందుకు ఆయన ఎన్నికల ప్రచార శైలినే వారు ఉదహరిస్తున్నారు. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలనే కాదు.. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఆయన ప్రధాని హోదాల్లో ప్రచారాలకు వెళ్లారని గుర్తు చేస్తున్నారు.

బీజేపీకి డబుల్ ప్రచారం

బహిరంగ సమావేశాల్లోనూ, ర్యాలీల్లోనూ.. చర్చ అనేది తాను కేంద్రంగా జరగాలన్నది బీజేపీ, మోడీల తాపత్రయమని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. మోడీ తనపై ఎన్నికల దృష్టిని కేంద్రీకరించడానికి ...9లో



గ్రేటర్‌లో మోడీ రోడ్‌షో

- ఆర్టీసీక్రాస్ రోడ్ నుంచి కాచిగూడ క్రాస్‌రోడ్ వరకు
- ప్రధాని పక్కన కిషన్‌రెడ్డి, లక్ష్మణ్

వివరాలు 9లో

సంపాదకీయం

ఒట్లు



ఓట్ల కాలంలో ఒట్ల జోరు పెరిగింది. బడికెళ్ళే పిల్లలు పక్కవాడి పెన్సిల్‌లో, బలపమో దొంగిలించ లేదన డానికి నెత్తిన చేయి పెట్టుకుని 'సత్యప్రమాణకం'గా అనో, దేవుడి మీద ఒట్టేసో తోటి వారిని నమ్మించే ప్రయత్నం చేస్తూంటారు. తనని తాను బళ్ళోకెళ్ళే పిలగాడిగా లెక్కేసుకునో లేదా ఓటర్లందర్నీ ఆవిధంగా లెక్కేసుకునో తెలియదుగానీ, మోడీ ఒక 'గాడ్ ప్రామిస్' చేశారు. యాదాద్రి 'నర్సన్న'ను సాక్ష్యం పెట్టాడు.

140కోట్ల మంది భారతీయుల్లో విదేశాల్లో పెండ్లిళ్ల చేసుకునేవారెవరో తెలియని అమాయకుడు కాదు మోడీ. ఆయన చెప్పిన ఐదు లక్షల కోట్ల రూపాయల వ్యాపారంలో వజ్రాలు సానబట్టి మార్కెట్ చేయడం, బంగారు ఆభరణాలు రూపుదిద్దుకునేది దేశంలో ఏకైక ప్రాంతం సూరత్. అది ఏమూలన ఉందో తెలియనివారా మన ఓటర్లు? తన జనం కోసం ఆమాత్రం తపన పడకూడదా అని కాషాయ దళాలు ఎదురు ప్రశ్నిస్తూంటాయి. ఇది కేవలం తాజా సందర్భమే.

లిక్కర్ స్కామ్‌లోని వారెవరినీ శిక్షించకుండా వదలరట! మోడీ గ్యారంటీకి తిరుగుండదని శిష్యఅణువులో, పరమాణువులో, లేదా సొంత బాకాలో ఊదిన ప్రశస్తమైన నాదమది. ఈ కొత్త పల్లవి విని తెలంగాణ జనం బీజేపీని మరో సంజాయిషీ అడుగుతారని వీరికి తెలియదనుకోవాలా? అసలు అడగరనే అతి విశ్వసమా? ఎందుకంటే ఇంతకాలం ఆపని చేయకుండా అడ్డుకున్నదెవరో మోడీ బృందమే సమాధానం చెప్పాలి. దేశంలోని ప్రతిపక్ష పార్టీలన్నింటిపై ఇడీనో, సిబిఐనో, ఐటీనో ఎగదోలిన ఘటనలు చూస్తున్నాం. ఏకేసులూ లేని పార్టీ బహుశా బీఆరెస్సే. బీజేపీ రూటెందుకు మార్చిందోగానీ, సామాన్య జనంతో పాటూ బీజేపీ కార్యకర్తలూ చాలాగరం మీదున్నారు. ప్రస్తుతం ఎన్నికల చివరి అంకంలో యాదాద్రి నర్సన్నను 'సాక్షం' పెట్టి బీఆర్ఎస్‌ను డొక్కచించి, డోలు కట్టకపోతే తనపేరు మార్చు కుంటానన్నట్లు మోడీ శపథం చూసి తెలంగాణ జనం నవ్వు కుంటున్నారు. ఏమైనా కేసులు పెట్టడం, పెట్టకపోవడం బీఆర్ఎస్ భవిష్యత్‌లో తీసుకునే రాజకీయ వైఖరిని బట్టి ఉంటుందనేది నిర్వివాదాంశం.

ఫలానా పార్టీకే ఓట్లేస్తామని ప్రజల్తో, ముఖ్యంగా కుటుంబాల్తో, కుల సంఘాల్తో 'ఒట్లు' వేయించుకోవడం చాలాకాలం నుండి అమల్లో ఉన్న 'ఆచారం'. దీపం ముందు ఒట్టేయించుకుంటారు, దేవుడి ఫొటోలు పెట్టి ఒట్లు వేయించుకుంటారు. తెలంగాణలో నేడు కొత్త ట్రెండు ప్రారంభమైంది. గ్రామాలకు గ్రామాలు గంపగుత్తగా కొని, హోల్‌సేల్‌గా ఒట్లు వేయించుకుంటున్నారు. ఆ గ్రామంలోని అందరి కందరూ ఓటేస్తే, అంటే ఎవరూ ఒట్టు తీసి గట్టు మీద పెట్టకుండా ఉంటే ఒక నిర్దిష్ట భారీ మొత్తం ఆ గ్రామానికి సదరు అభ్యర్థి ముట్టజెప్తాడు. బహుశా ఎన్నికలైన తర్వాత తప్పక ఇస్తానని ఆయన ఒట్టేస్తాడు కాబోలు.

ఆడిన మాట తప్పని ఇంతమంది సత్యహరిశ్చంద్రులు మనమధ్యే తిరుగుతుండటం ఆశ్చర్యమే మరి! ఒట్టేసినట్టు ఈ జనమంతా ఆ నేతకే ఓటెయ్యాలి. అంత భారీ మొత్తం ఉంచిన పెద్దమనిషి అనుకున్నట్టు గ్రామానికి డబ్బివ్వాలి. దీనికి అదనం ఎవరికి వారికి ఒక 'ఎక్స్' మొత్తం! దానికి అదనం దేవతలు రోజూ 'సేవించే'ది! ఇంట్లోని ఓట్ల సంఖ్యని బట్టి క్వార్టరా, హాఫా, ఫుల్లా అనేది నిర్ణయిస్తున్నారు. తలనీలాల నుండి నిలువు దోపిడీ వరకు వడ్డికాసుల వాడికి ఇవ్వడానికి అలవాటు పడ్డ జనం నమ్మిన నాయకుని కోసం, నమ్ముకున్న జనం కోసం సదరు నాయకుడు ఆయింత 'ఒట్టు'ని సార్థకం చేయరా!

ఒట్లు 'జస్ట్' ఎన్నికల్లో వేయించుకునేవి, వేసేవే అనుకుంటే పొరబాటే! 2013, 2014లో మోడీ ఈ దేశం పెట్టుబడిదారుల చేతిలో చెయ్యేసి ఒట్టేసినవెన్నో ఉన్నాయి. 2014 మే 26 నుండి అవన్నీ ఒక్కొక్కటీ అమలు చేసుకుంటూ వస్తున్నారు. నెలనెలా ఇచ్చే 'మన్ కీ బాత్' దీనిపై ఒక ప్రోగ్రెస్ కార్డ్ వంటిది. మొన్ననే 107వది జరిగింది. తాజాగా విదేశాలకెళ్ళి పెండ్లిళ్ళు చేసుకోవడమేంటి? సుమారు ఐదు లక్షల కోట్ల వ్యాపారం ఇతర దేశాలకు పోతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

140కోట్ల మంది భారతీయుల్లో విదేశాల్లో పెండ్లిళ్ళు చేసుకునేవారెవరో తెలియని అమాయకుడు కాదు మోడీ. ఆయన చెప్పిన ఐదు లక్షల కోట్ల రూపాయల వ్యాపారంలో వజ్రాలు సానబట్టి మార్కెట్ చేయడం, బంగారు ఆభరణాలు రూపుదిద్దుకునేది దేశంలో ఏకైక ప్రాంతం సూరత్. అది ఏమూలన ఉందో తెలియనివారా మన ఓటర్లు? తన జనం కోసం ఆమాత్రం తపన పడకూడదా అని కాషాయ దళాలు ఎదురు ప్రశ్నిస్తూంటాయి. ఇది కేవలం తాజా సందర్భమే.

ఈ తొమ్మిదిన్నరేండ్లలో దేశంలో పేద, ధనిక అంతరాలు పెరిగిన తీరు గురించి వరల్డ్ ఇనీక్వాలిటీ రిపోర్టు (2023) చెప్పిన అంశాలు చూస్తే పై ఒక శాతం జనాభా చేతులో 33శాతం జాతీయ సంపద ఉంది. రెండో వైపు గ్లోబల్ హంగర్ ఇండెక్స్‌లో తాజాగా మన స్థానం 125 దేశాల్లోనూ 111కి దిగజారింది. ఆ సూచీ తప్పని ఆనాడు విమర్శించిన మోడీ సర్కార్ నేడు ఐదు రాష్ట్రాల ఎన్నికల సందర్భంగా మనదేశంలో 81కోట్ల మంది పేదలున్నారని, అందుకే వారికోసం మరో ఐదు సంవత్సరాలు ఉచిత రేషన్‌లను ఇస్తామని దేశ ప్రజల చేతిలో చెయ్యేసి ఒట్టేశాడు కదా.

ఎన్నికలంటే ఒట్లు వేయించుకోవడమే అనుకుంటున్నారేమో

చట్టసభల్లో కమ్యూనిస్టుల ఆవశ్యకత

రాష్ట్రంలో అధికారం కోసం పోటీ పడుతున్న కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు గానీ, హంగ్ ఏర్పడాలని తహతహలాడుతున్న బీజేపీ గానీ, ప్రణాళికల పేరుతో ప్రధానంగా ఓట్ల పథకాలే ప్రకటించాయి. బీజేపీ కులాన్ని, మతాన్ని కూడా ప్రయోగించింది. సాధారణ ప్రజల దైవభక్తిని కూడా ఓట్ల కోసం వాడుకుంటున్నది. అంతిమంగా ఈ మూడు పార్టీలు ప్రజల జీవితాల మీద దీర్ఘకాలిక ప్రభావం చూపే కీలక విషయాలను వదిలేసాయి. తిండి, బట్ట, ఇల్లు, విద్యా, వైద్యం లాంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడం వీరికి ఇష్టం లేదు. కమ్యూనిస్టులు మాత్రమే పేద ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారాలపై దృష్టి సారించాయి.



ఎస్. వీరయ్య

వ్యవసాయ కార్మికులకు అత్యంత కీలకమైంది భూమి సమస్య. భూసంస్కరణల ఊసే ఈ మూడు పార్టీల మ్యానిఫెస్టోల్లో కనిపించదు. పైగా రైతుబంధు పేరుతో ప్రభుత్వ నిధులను పెద్ద ఎత్తున భూస్వాములకు కూడా కట్టబెడుతున్నారు. కౌలురైతులకు గుర్తింపు కార్డుల విషయం విస్మరించాయి. దశబ్దాలుగా దున్నుకుంటున్న భూములు ఖాస్తుకాలం తొలగింపుతో నష్టపోయిన రైతుల ప్రస్తావన లేదు. ధరణి పేరు మారుస్తామంటున్నారు. సమస్య పేరుతో కాదు. రైతుల సమస్యలు పరిష్కారం కావాలి. వీటన్నింటి మధ్య మద్దతు ధరను గాలికి వదిలేసారు. స్వామినాధన్ కమిషన్ సిఫార్సులను అమలు జరపడం కీలకం. రాష్ట్రంలో కోటి మంది కార్మికుల కనీస వేతనాలు కూడా లేవు. సమాన పనికి సమానవేతనం అమలు కావడం లేదు. వలస కార్మిక చట్టం చెత్తబుట్టలో వేసారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చట్టాలు రద్దు చేసింది. ఇప్పటికే అనేక చోట్ల కార్మికులు రోజుకు 12 నుండి 15 గంటలు పనిచేయాల్సి వస్తున్నది. ఇవేవీ బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మ్యానిఫెస్టోలలో వెతికినా దొరకవు. విద్యా, వైద్యం అందని ద్రాక్షపండ్లయినాయి. నిర్బంధ ఉచిత విద్య వీరి వాగ్దానాల్లో దొరకదు. కేరళలో లాగా తెలంగాణలో కూడా వందశాతం అక్షరాస్యత సాధిస్తామంటున్నారు రాష్ట్ర ముఖ్యమంత్రి. కేవలం కొన్ని గురుకుల పాఠశాలలు పెట్టి ప్రభుత్వ పాఠశాలలన్నీ గాలికి వదిలేస్తే ఇది సాధ్యమా? కేంద్రంలో బీజేపీ సర్కార్ నూతన విద్యా విధానం ప్రకటించింది. దీనితో డబ్బున్నవారు తప్ప చదువుకునే అవకాశం దొరకదు. బడుగు, బలహీనవర్గాలు విద్యకు దూరమవుతాయి. ఇప్పటికే యూనివర్సిటీల్లో సాధారణ కోర్సుల స్థానంలో సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులు చేరుతున్నాయి. అంటే, వేలల్లో ఫీజులు చెల్లిస్తూ, హాస్టల్స్ సౌకర్యం లేకున్నా చదవగలిగే వారికి మాత్రమే యూనివర్సిటీ విద్య అందుబాటులో ఉంటుంది. ఈ మూడు పార్టీల మ్యానిఫెస్టోలు ఆరోగ్యశ్రీ లాంటి పథకాల గురించే చెప్పాయి. అంటే, మరిన్ని ప్రభుత్వ నిధులు కార్పొరేట్ సంస్థల బొజ్జల్లో చేరుతాయి. అదే డబ్బుతో ప్రభుత్వ వైద్యశాలలను అభివృద్ధి చేయాలనే సోయి లేదు. ఈ మూడు పార్టీలు ఇండ్ల పట్టాల గురించి, ఇంటి సౌకర్యం గురించి చెబుతున్నాయి. ఇప్పటికే వాగ్దానం చేసి మాట తప్పిన పార్టీలివి. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామి నిధులు కోతబెట్టింది. ఈ పథకాన్ని పట్టణాలకు విస్తరించడం గురించి ఈ మూడు పార్టీలు నోరు విప్పలేదు. పోస్టుల భర్తీ గురించి ఆడిటన మాట తప్పింది బీఆర్ఎస్. ఈ సమస్యను సృష్టించింది కాంగ్రెస్. తన పరిధిలో 16లక్షల పోస్టులు భర్తీ చేయని కేంద్ర బీజేపీ నాయకులు రాష్ట్రంలో పోస్టుల భర్తీ గురించి మాట్లాడుతున్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజ్ గురించి వీరెవ్వరూ మాట్లాడడానికి సిద్ధంగా లేరు. అసలు ఈ సమస్యలకు మూలం ప్రయివేటీకరణ కదా! ఈ మూడు పార్టీలు ప్రయివేటీకరణ విధానాలనే అమలు చేస్తున్నాయి. ఇక నిరుద్యోగ సమస్య పరిష్కారం ఎట్లా అవుతుంది? సమస్య సృష్టిస్తున్నదీ వీరే, పరిష్కరిస్తామంటున్నదీ వీరే. కనీసం పైసా ఖర్చులేని ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు కూడా వీరు ఒప్పుకోవడం లేదు. ఎస్సీ, ఎస్టీలకు నిధుల గురించి, మహిళా, శిశు సంక్షేమం గురించి, వృద్ధుల సంక్షేమం గురించి వాగ్దానం చేస్తున్నారు. ఇది అలవాటైన పని. ఈ నిధులు డైవర్ట్ చేయకుండా, వీరికే ఖర్చుపెడతామన్న గ్యారంటీ మాత్రం వీరెవ్వరూ ఇవ్వటం లేదు. కాంట్రిబ్యూటరీ పెన్షన్స్ స్కీమ్‌ను రద్దు చేసి, పాత పద్ధతిని అందరికీ అమలు జరుపుతామని చెప్పడానికి వీరు సిద్ధంగా లేరు. సార్వత్రిక ప్రజా పంపిణీ వ్యవస్థ గురించి కూడా ఈ మూడు పార్టీలు మాట్లాడవు. కుల వివక్ష, పురుషాధిక్యత ఊసే వీరెత్తరు. ఇలాంటి సమస్యలు పరిష్కరిస్తే ప్రజల జీవితాలు మెరుగుపడతాయి.



రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య పోటాపోటీ వాతావరణం నెలకొన్నది. కాంగ్రెస్‌వాదులు మార్పు కావాలంటున్నారు. కాంగ్రెస్ కాలంనాటి పరిస్థితులు మళ్ళీ రావొద్దంటున్నారు బీఆర్ఎస్ నాయకులు. ఇంతకూ రావాల్సిన మార్పు ఏమిటి? ప్రభుత్వం మారితే చాలా? లేక విధానాలలో మార్పు రావాలా? 'మార్పు' అవసరాన్నే బీఆర్ఎస్ నాయకత్వం గుర్తించడం లేదు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే విధానాలు మారుతాయా? మౌలికంగా ఈ రెండు పార్టీల విధానాల్లో తేడాలేదు. కొన్ని కనీస మార్పులైనా ఇప్పుడు కావాలి. శాసనసభలో పుచ్చలపల్లి సుందరయ్య నెలకొల్పిన సంప్రదాయాలు నేటి తక్షణ అవసరం. వ్యక్తిగత, వ్యాపార ప్రయోజనాలు, పదవులు, స్వార్థ రాజకీయ ప్రయోజనాలు పక్కనపెట్టి ప్రజా సమస్యలపై గళమెత్తేవారు కావాలి. శాసనసభను ప్రజా సమస్యలపై చర్చావేదికగా మార్చగలిగేవారు కావాలి. ప్రజాస్వామ్య విలువల కోసం పోరాడేవారు కావాలి. కమ్యూనిస్టులు శాసనసభలో అడుగుపెడితేనే కదా ఇది సాధ్యమయ్యేది? అందుకే తెలంగాణ ప్రజలు కమ్యూనిస్టులను గెలిపించుకోవడం అవసరం.

వీటి కోసం పోరాడుతున్నది కేవలం కమ్యూనిస్టులే కదా! సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించే ప్రజలకు అండగా నిలబడుతున్నదీ ఎర్రజెండానే కదా! అందుకే ఇప్పుడు శాసనసభలోకి కమ్యూనిస్టులను పంపడం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నది.

రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య పోటాపోటీ వాతావరణం నెలకొన్నది. కాంగ్రెస్‌వాదులు మార్పు కావాలంటున్నారు. కాంగ్రెస్ కాలంనాటి పరిస్థితులు మళ్ళీ రావొద్దంటున్నారు బీఆర్ఎస్ నాయకులు. ఇంతకూ రావాల్సిన మార్పు ఏమిటి? ప్రభుత్వం మారితే చాలా? లేక విధానాలలో మార్పు రావాలా? 'మార్పు' అవసరాన్నే బీఆర్ఎస్ నాయకత్వం గుర్తించడం లేదు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే విధానాలు మారుతాయా? మౌలికంగా ఈ రెండు పార్టీల విధానాల్లో తేడాలేదు. కొన్ని కనీస మార్పులైనా ఇప్పుడు కావాలి. శాసనసభలో పుచ్చలపల్లి సుందరయ్య నెలకొల్పిన సంప్రదాయాలు నేటి తక్షణ అవసరం. వ్యక్తిగత, వ్యాపార ప్రయోజనాలు, పదవులు, స్వార్థ రాజకీయ ప్రయోజనాలు పక్కనపెట్టి ప్రజా సమస్యలపై గళమెత్తేవారు కావాలి. శాసనసభను ప్రజా సమస్యలపై చర్చావేదికగా మార్చగలిగేవారు కావాలి. ప్రజాస్వామ్య విలువల కోసం పోరాడేవారు కావాలి. కమ్యూనిస్టులు శాసనసభలో అడుగుపెడితేనే కదా ఇది సాధ్యమయ్యేది? అందుకే తెలంగాణ ప్రజలు కమ్యూనిస్టులను గెలిపించుకోవడం అవసరం.

సీపీఐ(ఎం) స్వతంత్రంగా పోటీచేయడం పైన కొంతమంది సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్‌ను గెలిపించడానికేనా అంటున్నారు. కాంగ్రెస్ బలంగా ఉన్న సీట్లలోనే ఎందుకు పోటీ చేయాలంటున్నారు. ఈ ప్రశ్నలు వేస్తున్నవారి చిత్తశుద్ధిని శంకించాలి. ఒకప్పుడు బీఆర్ఎస్‌ను భుజాన ఎత్తుకుని ఊరేగినవారే ఇప్పుడు సీపీఐ(ఎం) ఒంటరి పోటీని వక్రదృష్టితో చూస్తున్నారు. సీపీఐ(ఎం) చరిత్రలో ఇప్పుడు పోటీ చేస్తున్న సీట్లు కాకుండా, సిరిసిల్ల, గద్వాల లాంటి స్థానాలకు ఎప్పుడైనా పోటీ చేసిందా? తనకు బలమున్న చోటనే ఎప్పుడైనా పోటీ చేస్తున్నది. ఏ పార్టీయైనా తనకు బలమున్నచోటనే కదా పోటీ చేయవలసింది? ఇప్పుడు కాంగ్రెస్ కోసమో, బీఆర్ఎస్ కోసమో సీపీఐ(ఎం) పోటీ చేయకుండా ఎందుకుండాలి? తనను తాను ఫణంగా పెట్టుకుని వారినెందుకు గెలిపించాలి? ప్రజాస్వామ్య విలువల విషయంలో కూడా ఈ రెండు పార్టీలకు తేడాలేదు. బీఆర్ఎస్ నాయకత్వం పోరాటాల పట్ల అసహనం, అహంభావం ప్రదర్శిస్తున్నది. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ముదిగొండ కాల్పుల్లో ఏడుగురిని బలితీసుకున్నది. ప్రజా ఉద్యమాల పట్ల ఇద్దరిదీ ఒకే ధోరణి. ఇక ఒకట్రెండు సీట్ల కోసం కాంగ్రెస్‌తో సర్దుబాట్లు ఎందుకు తెంచుకున్నారని ప్రశ్నిస్తున్నారు. ఈ ప్రశ్న అడగవలసింది కాంగ్రెస్‌ను కదా? వామపక్షాలకు వస్తే ఒకట్రెండు సీట్లు మాత్రమే. ఈ సర్దుబాటుకు అంగీకరిస్తే వారికి అధికారం కదా వచ్చేది? ఒక రాజకీయ పార్టీ కోసం మరొక పార్టీ తన మనుగడనే కోల్పోవాలని చెప్పేవారి విజ్ఞతకు సంబంధించిన సమస్య ఇది. అయినా సీపీఐ(ఎం) ఒక సూత్రబద్ధ వైఖరి తీసుకున్నది. బీజేపీ బలంగా ఉన్న స్థానాల్లో దానిని ఓడించగలవారికి మద్దతునివ్వాలని నిర్ణయించింది. కొత్తగూడెంలో సీపీఐ, పినపాకలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, శేరిలింగంపల్లిలో ఎంసీపీఐ అభ్యర్థులకు మద్దతు ప్రకటించింది. మిగిలిన స్థానాల్లో స్థానిక పరిస్థితులను బట్టి ప్రజాతంత్ర, సామాజిక, లౌకిక శక్తులను ఎంపిక చేసి ఎవరికి మద్దతునివ్వాలో జిల్లా కమిటీలు నిర్ణయించాయి.

ఉన్నట్టుండి చివరి మూడు రోజుల్లో బీజేపీ హదావుడి పెంచింది. నువ్వానేనా అన్న తరహాలో సాగుతున్న ఎన్నికల బరిలో మూడో, నాలుగో మళ్ళీ గెలిచి కింగ్‌మేకర్ కావాలని కలలు కంటున్నది. కానీ తెలంగాణ ప్రజలు ఎవరికో ఒకరికి పూర్తి మెజారిటీ ఇచ్చే అవకాశాలే ఎక్కువ. బీజేపీ కలలు కల్లలు కాక తప్పదు. ఎస్సీ వర్గీకరణ కోసం తాను కూడా పోరాడుతానని ప్రధానమంత్రి అన్నారు. ఎవరితో పోరాడుతారు? తామే కదా ఈ సమస్యను పరిష్కరించాల్సింది? మూడేండ్లుగా సుప్రీంకోర్టులో ఏడుగురు న్యాయమూర్తులతో కూడిన బెంచ్‌కోసం మోడీ ప్రభుత్వం ప్రయత్నించలేదు. పైగా అలాంటి బెంచ్ ఏర్పడినా ఇవ్వబోయే తీర్పు ఎట్లా ఉంటుందో కూడా చెప్పలేము. తమకు కేంద్రంలో పూర్తి మెజారిటీ ఉన్నది. వర్గీకరణ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి అధికారమిస్తూ చట్టసవరణ చేయవచ్చు. ఆ పని చేస్తానని మాత్రం ఆయన చెప్పలేదు. మరో కమిటీ వేస్తానని చెప్పి చేతులు దులుపుకున్నారు. ఇంతకంటే మోసపూరితమైన వాగ్దానం ఇంకేముంటుంది?

ఉన్నట్టుండి చివరి మూడు రోజుల్లో బీజేపీ హడావుడి పెంచింది. నువ్వానేనా అన్న తరహాలో సాగుతున్న ఎన్నికల బరిలో మూడో, నాలుగో మళ్ళీ గెలిచి కింగ్‌మేకర్ కావాలని కలలు కంటున్నది. కానీ తెలంగాణ ప్రజలు ఎవరికో ఒకరికి పూర్తి మెజారిటీ ఇచ్చే అవకాశాలే ఎక్కువ. బీజేపీ కలలు కల్లలు కాక తప్పదు. ఎస్సీ వర్గీకరణ కోసం తాను కూడా పోరాడుతానని ప్రధానమంత్రి అన్నారు. ఎవరితో పోరాడుతారు? తామే కదా ఈ సమస్యను పరిష్కరించాల్సింది? మూడేండ్లుగా సుప్రీంకోర్టులో ఏడుగురు న్యాయమూర్తులతో కూడిన బెంచ్‌కోసం మోడీ ప్రభుత్వం ప్రయత్నించలేదు. పైగా అలాంటి బెంచ్ ఏర్పడినా ఇవ్వబోయే తీర్పు ఎట్లా ఉంటుందో కూడా చెప్పలేము. తమకు కేంద్రంలో పూర్తి మెజారిటీ ఉన్నది. వర్గీకరణ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి అధికారమిస్తూ చట్టసవరణ చేయవచ్చు. ఆ పని చేస్తానని మాత్రం ఆయన చెప్పలేదు. మరో కమిటీ వేస్తానని చెప్పి చేతులు దులుపుకున్నారు. ఇంతకంటే మోసపూరితమైన వాగ్దానం ఇంకేముంటుంది? ఎన్నికల కమిషన్ వైఖరి కూడా అనుమానాస్పదం. బీజేపీ నాయకులు మతపరమైన విభజన సృష్టించేందుకు బాధ్యతారహితంగా మాట్లాడుతున్నప్పటికీ, వీరు జోక్యం చేసుకోలేదు. కానీ, మహబూబాబాద్‌లో గుడిసెవాసుల జీవితాలతో చెలగాటమాడుతున్న శాసనసభ్యుడు శంకర్‌నాయక్ దౌర్జన్యాలను ఖండించాలని సీపీఐ(ఎం) కరపత్రం వేయాలని ప్రయత్నిస్తే అడ్డుకున్నారు. ఆ కరపత్రంలో ఎన్నికల ప్రస్థావన కూడా లేదు. అయినా ఆయనపేరు పెట్టొద్దట! పేదలమీద ఆయన పెట్టించిన కేసుల గురించి రాయవద్దట! ఇదెక్కడి న్యాయం? ఎన్నికల్లో కూడా పలనా పార్టీ అనే కాదు, పలనా అభ్యర్థిని ఓడించండని కూడా చెబుతాము కదా! పేరు ప్రస్తావించవద్దనడంలో అర్థమేమిటి? ఇది అధికారుల నిజాయితీపైనే అనుమానం కలిగిస్తున్నది. అభ్యంతరకరమైన భాష వాడొద్దంటే అర్థం చేసుకోవచ్చు. ఏమైనా మిగిలింది రెండు రోజులే. ప్రజలు విజ్ఞత ప్రదర్శించాలి. కమ్యూనిస్టులను గెలిపించాలి. శాసనసభకు పంపాలి. ఇదే నేటి తక్షణ అవసరం.

విద్య తటస్థంగా ఉండాలి : హంటర్ కమిషన్‌కు చెప్పిన పూలే




ఎస్. వినయ కుమార్
9989718311

నేడు మహాత్మా జ్యోతి రావు పూలే 133వ వర్థంతి, శూద్ర అతిశూద్ర కులాలకు విద్యనందించడంలో దేశంలో మొదటి అడుగేసిన వారు పూలే దంపతులు. పూనా నగరంలో అనేక స్కూళ్లను వారు నెలకొల్పి నడిపారు. శూద్రులకు, అతిశూద్రులకు చదువు చెప్పి మత సాంప్రదాయాలను మట్టిపాలు చేస్తూన్నారంటు ఛాందసులు చేసిన, చేయించిన దాడులకు వారు గురయ్యారు.ఆయినప్పటికీ వెరపు లేకుండా తాము ఎంచుకొన్న లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లారు. పాఠశాలలు నెలకొల్పడమే కాదు. ఎలాంటి విద్యనందించాలి అన్న విషయం పై పూలేకు నిశ్చితమైన అభిప్రాయాలున్నాయి. చరిత్ర పాఠ్యాంశాల్లోకి పురాణాలను చేర్చాలని మోడీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నం నేపథ్యంలో మహాత్మా జోతిరావు పూలే (సాధారణ జనం జ్యోతి అని పిలవరు కనుక తన పేరును జ్యోతిరావు గానే ఆయన రాసుకొన్నారు) ఏమి చెప్పారో చూద్దాం.

భారత దేశంలో ఎలాంటి విద్యను అందించాలో నిర్ధారించుకోవడానికి బ్రిటిష్ ప్రభుత్వం 1881లో సర్ విలియం హంటర్ అధ్యక్షతన ఒక కమిషన్‌ను నియమించింది. ఆ కమిషన్‌కు పూలే వివరమైన నోట్‌ను రాత పూర్వకంగా సమర్పించారు. అందులో అనేక అంశాలతో పాటు విద్యను తటస్థంగా ఉంచాల్సిన ఆవశ్యకతను కూడా ఆయన నొక్కి చెప్పారు. భారతదేశం వివిధ జాతులు, మతాలు ఉన్న దేశం కనుక విద్యారంగంలో మతపరమైన తటస్థత ఎంతో అవసరమని అన్నారు.

దానికి ముందు ఆయన తన ప్రఖ్యాత పుస్తకంలో ఏ ప్రమాదం గురించి హెచ్చరించారో ఆ ప్రమాదం ఈరోజు దేశ ప్రజల తలలపై కత్తిలా వేలాడుతోంది. పూలే దశావతారాలు, పురాణాలు కట్టుకథలని తేల్చిచెప్పారు. ఆ కట్టుకథలే ఇప్పుడు చరిత్ర పాఠాల్లోకి ఎక్కి, రాబోయే తరానికి చారిత్రక వాస్తవాలుగా పరిచయం కానున్నాయి. దశావతారాల్లో భాగంగానే రామాయణ భారతాలను చూపెడ్తారు. ఆ దశావతారాలు అర్థం పర్థం లేనివని పూలె చీల్చి చెండాడారు. కాగా ఆ పురాణాలను పాఠశాలల పిల్లలకు అది కూడా చరిత్ర పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని జాతీయ విద్యా పరిశోధన, శిక్షణా మండలి(ఎన్‌సిఇఆర్‌టి), సిఫారసు చేసింది. ప్రభుత్వ సూచనపైనే ఆ సిఫారసు చేసి ఉంటుంది. కనుక అది తప్పక అమల్లోకి వస్తుంది!

రామాయణ, మహాభారతాలను కావ్యాలుగా చదువుకోవడం, వాటిలోని పనికొచ్చే నీతిని అనుసరించడం పట్ల ఎవరికీ అభ్యంతరం ఉండనవసరంలేదు. కాని వాటిని చరిత్రలో భాగాలని చెప్పడమంటే శాపాలు, మాయలు మంత్రాలు, అస్త్రాలు, రాక్షసులు, కామరూపాలు, పది తలలు, స్వర్గానికి నిచ్చెన వేయడం, చెవుల ద్వారా పిల్లలు కనడం, ఒకేసారి నూటొక్క సంతానానికి జన్మనివ్వడం వగైరా వగైరాలన్నీ చరిత్రలో ఏదో ఒక దశలో జరిగినట్లు అనుకోవాల్సి వస్తుంది. అందుకు అనుగుణంగా యుగవిభజనను మార్చాలని కూడా చెప్పడం మరో దారుణం. రామాయణ, మహాభారత కాలాలను క్లాసికల్ యుగాలుగా పేర్కొనాలని ఎన్‌సిఈఆర్‌టి చెప్పింది. ముందుముందు యుగ విభజనను కూడా మార్చేసి ప్రపంచానికి నాలుగు యుగాలున్నాయని, అవే కృత యుగం, త్రేతా యుగం, ద్వాపర యుగం కలియుగమంటూ చరిత్ర క్లాసులు చెప్పాలంటూ శాసించవచ్చు.



మొఘల్ పాలనను చరిత్ర నుండి తొలగించినట్లుగానే హరప్పా మోహంజదారో తవ్వకాలను, సింధూ నాగరికతను చరిత్ర పాఠాల్లో వివిధ చారిత్రక పరిశోధనలు ఇక కన్పించకపోవచ్చు. వేల ఏళ్లక్రితమే మనకు విమానాలున్నాయని, ప్లాస్టిక్ సర్జన్లు ఉన్నారని, మాట్లాడే పక్షులు, సముద్రాన్ని ఒక ఉదుటన లంఘించే జలశాలులు ఉన్నారని చెప్పే విశ్వగురువుల కాలంలో ఏదైనా జరగొచ్చు. గుర్రం ఎగరనూ వచ్చన్నమాట. అవతారాల కల్పనను పూలేకు ముందు కూడా తప్పుబట్టిన వారున్నారు. పూలే దాన్ని తప్పుబట్టడానికి ప్రధాన కారణం సింపుల్ దేవుడి చేత మనుషులు అసమానులుగానే సృష్టించబడ్డారన్న మనువాద సిద్ధాంతాన్ని ధ్వంసం చేసి మానవులందరూ సమానులేనన్న చెప్పడమే పూలే లక్ష్యం. పురాణాలన్నీ చాతుర్వర్ణ వ్యవస్థను సమర్థిస్తాయి. రామాయణంలోని శంబూక వథ చెప్పే నీతి ఏమిటి? ఒక వర్ణానికి దేవుడు నిర్దేశించిన పనిని మరొక వర్ణం వాడు చేయదల్చితే వారిని శిక్షించడం రాజధర్మం అది ధర్మమే అనుకొంటే మన చట్టాలను, రాజ్యాంగాన్ని మార్చుకోవలసి వస్తుంది.

కర్మ ఫలాన్ని బట్టి పేద, ధనిక తారతమ్యం ఉంటుందని పురాణాలు చెప్తాయి. ఆ కర్మఫలాన్ని మార్చే అధికారం మనిషికి లేదు కనుక అన్ని సంక్షేమ పథకాలకు మోడీ తరహా ప్రభుత్వాలు సెలవుచీటి కూడా ఫ్రెంచి విప్లవానికి ముందు ఫ్రాన్స్‌లో ఇవ్వొచ్చు. పన్నులు చెల్లించేవారు కాదు. రైతులు, వ్యాపారులు మాత్రమే పన్నులు కట్టే వారు. రాజ వంశీకులు మనదేశంలో కూడా మనుషులు సత్కర్మల వల్ల ధనికులుగా పుడతారని పురాణాలు చెప్తున్నాయి గనుక ధనికులను పన్నుల నుండి ప్రభుత్వాలు మినహాయించవచ్చు. మోతెబరు కంపెనీలకు అప్పుల రద్దుతో ఇప్పుడు జరుతోంది. పూర్వజన్మలో సత్కర్మలు చేయనందు వల్ల శూద్రులుగా పుట్టిన వారు మాత్రమే ప్రభుత్వ నిర్వహణకు,పెద్దల భోగవిలాసాలకు పన్నులు చెల్లించాలని పన్ను చట్టాల్లో మార్పులు చేయవచ్చు. శూద్రులకు అతిశూద్రులకు ఇస్తున్న రిజర్వేషన్లకు ఎప్పుడెప్పుడు మంగళం పాడవచ్చు.

కర్మ ఫలాన్ని బట్టి పేద, ధనిక తారతమ్యం ఉంటుందని పురాణాలు చెప్తాయి.ఆ కర్మఫలాన్ని మార్చే అధికారం మనిషికి లేదు కనుక అన్ని సంక్షేమ పథకాలకు మోడీ తరహా ప్రభుత్వాలు సెలవుచీటి కూడా ఫ్రెంచి విప్లవానికి ముందు ఫ్రాన్స్‌లో ఇవ్వొచ్చు. పన్నులు చెల్లించేవారు కాదు. రైతులు, వ్యాపారులు మాత్రమే పన్నులు కట్టే వారు. రాజ వంశీకులు మనదేశంలో కూడా మనుషులు సత్కర్మల వల్ల ధనికులుగా పుడతారని పురాణాలు చెప్తున్నాయి గనుక ధనికులను పన్నుల నుండి ప్రభుత్వాలు మినహాయించవచ్చు. మోతెబరు కంపెనీలకు అప్పుల రద్దుతో ఇప్పుడు జరుతోంది. పూర్వజన్మలో సత్కర్మలు చేయనందు వల్ల శూద్రులుగా పుట్టిన వారు మాత్రమే ప్రభుత్వ నిర్వహణకు,పెద్దల భోగవిలాసాలకు పన్నులు చెల్లించాలని పన్ను చట్టాల్లో మార్పులు చేయవచ్చు. శూద్రులకు అతిశూద్రులకు ఇస్తున్న రిజర్వేషన్లకు ఎప్పుడెప్పుడు మంగళం పాడవచ్చు.

దశరథునికి ఒక కూతురు ఉన్నా పుత్రకామేష్టి యాగం చేసి పుత్రసంతానం పొందాడు. స్త్రీలు రెండవ తరగతి పౌరులట కనుక వారు తమ తండ్రులకు సద్గతిని కల్పించలేరట. రామాయణం ఎలాంటి దాపరికం లేకుండా ఈ విషయం చెప్తుంది. పూలే రాసిన చివరి పుస్తకం 'సార్వజనిక్ సత్యధర్మ పుస్తక్'ను తన జీవితపు చివరి దశలో పక్షవాతంతో కుడికాలు, కుడిచెయ్యి పడిపోగా ఎడమ చేతితో రాసి పూర్తి చేశారు. పుస్తకం ముద్రణకు వెళ్లకముందే ఆయన మరణించారు. 1890 నవంబర్ 28న చనిపోయారు. పురాణాలు పురుషాధిక్యతకు పెద్దపీట వేస్తాయి. దానికి పూర్తి విరుద్ధం పూలే. సృష్టిలో ఆడ, మగల్లో ఏది ఉన్నతం అన్న ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ స్త్రీయే ఉన్నతమని 'సత్యధర్మ' లో సమాధానమిచ్చారు.

స్వర్గం అన్న భావనను కూడా పూలే వదలిపెట్టలేదు. పురాతన సమాజంలో కొందరు తెలివిమంతులు స్వర్గాన్ని సృష్టించుకొన్నారు. పొలంలో దిష్టిబొమ్మను పెట్టి కాకులను పారదోలినట్లు స్వర్గాన్ని సృష్టించారు. తదనంతర కాలంలో చాలా మార్పులు జరిగాయి. అయినా స్వర్గం ఏమిటో ఎవరికీ తెలియదు. ఎందుకంటే స్వర్గం, నరకం నిస్సందేహంగా లేవు. అని పూలే ధృడంగా చెప్పారు. మరి మన పురాణాల నిండా ఉన్నవి సర్గనరకాలే కాదా? అలాంటి పురాణాలకు మోడీ ప్రభుత్వం చరిత్ర పేరుతో శాస్త్రీయతను అద్ది మత ఛాందసాన్ని తన రాజకీయ లాభం కోసం మార్కెట్ చేయాలని అనుకొంటోంది. పార్లమెంట్ ఎన్నికలు జరుగనున్న వేళ పనిగట్టుకొనే ఎన్‌సిఈఆర్‌టి చేత ఆ సిఫారసు చేయించింది.

దేవుడి ఉనికిపై ఆయనకు సమాధానం లభించని ప్రశ్నలు ఎన్నో సత్యధర్మలో ఉన్నాయి. వాటిని సత్యధర్మలో కూడా ప్రస్తావించాయి. 'గులాంగిరి' ముగింపులోని ప్రధాన ప్రశ్నను కూడా లేవనెత్తారు. సమస్త విశ్వాన్ని సృష్టించిన దేవుడే మనిషినీ సృష్టించాడు. దేవుడు దయామయుడు కనుక ఆయన సృష్టిలోని అన్ని హక్కులనూ, సంతోషాలనూ మనుషులందరూ అనుభవించాలి. కాని అలాలేదు ఎందుచేత? అని పూలే తనను ప్రంపచం తాను ప్రశ్నించుకొన్నారు. ఏ మతగ్రంథమూ సార్వజనీన సత్యాన్ని చెప్పలేదని ఆయన సత్యధర్మ పుస్తకం ఆరంభలోనే చెప్పారు.

వివిధ దేశాల్లో ప్రజలు ఒకరినొకరు ద్వేషించుకొంటూ ఎందుకు బతుకుతున్నారు? మతి మాలిన మత విద్వేషాలు ఎందుకు? భూమ్మీద ఉన్న నదులన్నీ సముద్రంలోనే కలుస్తాయి. అలాంటప్పుడు ఒక్కనదినే పవిత్ర నదిగా ఎలా భావిస్తారు? ఆ పవిత్రనది తన వెంట కుక్కమలాన్ని తీసుకువెళ్లడానికి నిరాకరిస్తుందా? అంటూ హేతుబద్ధ ప్రశ్నలను పూలే లేవనెత్తారు. అలాగే ఈ భూమి మీద పుట్టిన మనుషులందరికీ ఒకే రకమైన భౌతిక, మేధోపరమైన లక్షణాలుంటాయి. అలాంటప్పుడు కొందరు మాత్రమే తరతరాలుగా పవిత్రులు ఎలా అవుతారు. వారూ ఇతరుల్లాగే మరణించడం లేదా? వారిలోనూ మంచీ చెడు లక్షణాలు లేవా? అని ప్రశ్నించారు.

స్వర్గం అన్న భావనను కూడా పూలే వదలిపెట్టలేదు. పురాతన సమాజంలో కొందరు తెలివిమంతులు స్వర్గాన్ని సృష్టించుకొన్నారు. పొలంలో దిష్టిబొమ్మను పెట్టి కాకులను పారదోలినట్లు స్వర్గాన్ని సృష్టించారు. తదనంతర కాలంలో చాలా మార్పులు జరిగాయి. అయినా స్వర్గం ఏమిటో ఎవరికీ తెలియదు. ఎందుకంటే స్వర్గం, నరకం నిస్సందేహంగా లేవు. అని పూలే ధృడంగా చెప్పారు. మరి మన పురాణాల నిండా ఉన్నవి సర్గనరకాలే కాదా? అలాంటి పురాణాలకు మోడీ ప్రభుత్వం చరిత్ర పేరుతో శాస్త్రీయతను అద్ది మత ఛాందసాన్ని తన రాజకీయ లాభం కోసం మార్కెట్ చేయాలని అనుకొంటోంది. పార్లమెంట్ ఎన్నికలు జరుగనున్న వేళ పనిగట్టుకొనే ఎన్‌సిఈఆర్‌టి చేత ఆ సిఫారసు చేయించింది.

వర్ణాశ్రమ ధర్మంపై పూలే దాడి సునిశితంగా ఉంటుంది. దేవుడు- మనుషుల్ని నాలుగు వర్ణాలుగా సృష్టించి ఉంటే ఆ పని మిగతా జీవజాలంలో ఎందుకు చేయలేదు? గాడిదలు, కాకులు వంటి జీవరాసుల్లో ఫలానా అవి బ్రాహ్మణ గాడిదలని, అవి బ్రాహ్మణ కాకులని ఎవరైనా చెప్పగలరా? అని సత్యధర్మలో అని ప్రశ్నించారు. అపరిశుభ్ర పని చేసేవాడు తక్కువ కులం వాడన్న వాదనను కూడా ఆయన కొట్టేశారు. అలా అయితే చిన్న తనంలో తన పిల్లల మల, మూత్రాలను శుభ్రం చేసే తల్లి కూడా తక్కువ కులం కావాలి గదా? అని అడిగారు. బాల బాలికందరికీ పన్నెండేళ్ల వయసు వరకు నిర్బంద ఉచిత విద్యనందించాలని కోరారు.

"అనేక జాతులు, మతాలు కలిగిన ఈ దేశంలో విద్య తటస్థంగా ఉండడమే కాదు విద్య ప్రభుత్వ రంగంలోనే ఉండాలని పూలే సూచించారు. ప్రభుత్వ విద్యారంగం నుండి ఉపసంహరించుకుంటే విద్యను తటస్థంగా ఉంచాలన్న ప్రభుత్వ (బ్రిటిష్) లక్ష్యం దెబ్బతింటుంది" అని చెప్పారు. ఇప్పుడు దేశంలో ప్రయివేటు స్కూళ్లదే రాజ్యమైనా పాఠశాల విద్యా బోర్డులు, ఎన్‌సిఈఆర్‌టి లాంటివి తటస్థ విధానాన్ని అనుసరిస్తున్నాయి. ఆ తటస్థ విధానం స్థానంలో మత ఛాందసాలను ప్రవేశపెడితే గంగోత్రి దగ్గరే గంగను కలుషితం చేసినట్లు అవుతుంది. భారతదేశన్ని మళ్లీ మధ్య యుగాల్లోకి తీసుకెళ్లడానికే మోడీ కృతనిశ్చయంతో ఉన్నట్లు విస్పష్టంగానే కన్పిస్తుంది.

కనిపించని కనికట్టు

ఓటు వేసే నీకే తెలియాలి
 ఓటు విలువ
అది పిచ్చోని చేతిలో
 రాయి కాకూడదు
నీ బతుకును ఆహుతి
చేయటానికి మాయాజాలపు బాసలు చేసే
మాయల పకీర్లు వీధి వీధిలో
 గల్లీ గల్లీలో తారాసపడతారు
పథకాల క్రీనీడలో
మద్యం మహమ్మారిని వదిలెళ్ళిపోతారు
పచ్చనోట్ల పడగనీడలో
స్వార్థమైన భరోసాలు ఇస్తారు
మందు విందు తాయిలాలిచ్చి మనసు
మార్చుతారు
 కాసింత కనిపెట్టుకో
 మంచినేతను మన్నికగా
 ఎన్నుకునే
 సమయం ఆసన్నమైంది
 మర్మమెరిగి మసులుకుంటేనే జరంత భద్రం
 ఆ బూటకపు మాటల బుజ్జగింపులకు
తలొగ్గి
 బతుకును బానిసను
 చేయకుజీ
వేటి కోసమే అర్రులు
 చాచితే పంజరం చెరలో
ఐదేండ్లు
బందీగానే ఉండిపోతావ్
 ఓటరన్న
ఒక్కసారి ఆలోచించు
నిజం బోధపడుతుంది
ఇది కనిపించని కనికట్టు
కాస్త కనిపెట్టుకొని
 ఓటు అస్త్రాన్ని గురి చూసి సంధించు
నీ స్థితి మారుతుంది
దేశగతి మారుతుంది

- నెల్లుట్ల సునీత, 7989460657

తక్షణమే శాశ్వత కాల్పుల విరమణ

- అంతర్జాతీయ సమాజం నుంచి పెరుగుతున్న ఒత్తిడి
- మరింత మందిని విడుదల చేస్తే పొడిగిస్తాం : ఇజ్రాయిల్
- కొనసాగుతున్న చర్చలు
- ఇజ్రాయిల్ అదుపులో మరో 60మంది పాలస్తీనియన్లు



గాజా, జెరూసలెం : గాజాలో కాల్పుల విరమణకు చివరి రోజైన సోమవారం శాశ్వత కాల్పుల విరమణ కోసం అంతర్జాతీయ సమాజం నుంచి ఒత్తిడి పెరిగింది. ప్రస్తుత ఒప్పందానికి మధ్యవర్తిగా వ్యవహరించిన ఈజిప్ట్, ఖతార్, అమెరికా శాశ్వత కాల్పుల విరమణకు అంగీకరించాలని ఇజ్రాయిల్‌ను కోరుతున్నాయి. గాజాలోని ఇజ్రాయిల్ బలగాలనుద్దేశించి ప్రధాని నెతన్యాహు మాట్లాడుతూ, "ఏదీ మనల్ని అడ్డుకోలేదు" అని వ్యాఖ్యానించారు. ప్రతి పదిమంది బందీల విడుదలకు ఒక్కో రోజును పొడిగిస్తామని అమెరికా అధ్యక్షుడు బైడెన్‌కు నెతన్యాహు తెలియజేశారు. గాజాలో ఏడు వారాలుగా ఇజ్రాయిల్ సాగిస్తున్న దాడుల్లో 14,854మంది పాలస్తీనియన్లు మరణించారు. 37వేల మంది దాకా గాయపడ్డారు. మరో 6,800 మంది అతీగతి తెలీదు. వారు చనిపోవడమో, కూలిపోయిన భవన శిథిలాల కింద సమాధి కావడమో జరిగి ఉంటుందని భావిస్తున్నారు. ఇళ్లు, స్కూళ్లు, ఆసుపత్రులు, మసీదులు, శరణార్థి శిబిరాలు, బేకరీలు, ఇతర మౌలిక సదుపాయాలు ఇజ్రాయిల్ బాంబుదాడుల్లో నాశనమయ్యాయి.

కాల్పుల విరమణను పొడిగించేందుకు కతార్, ఈజిప్ట్, అమెరికా, ఇయు, స్పెయిన్ కృషి చేస్తున్నాయని పాలస్తీనా అథారిటీ తెలిపింది. మరో మూడు రోజులు వరకూ పొడిగించే అవకాశం వుందని, అయితే ఇది ఎంతకాలమనేది కచ్చితంగా చెప్పలేమని పాలస్తీనా అథారిటీ విదేశాంగ మంత్రి రియాద్ అల్ మాలిక్ తెలిపారు. కాల్పుల విరమణ సుదీర్ఘకాలం అమల్లో వుంటే తప్ప గాజాలో పరిస్థితులు అదుపులోకి రావని పాలస్తీనా శరణార్థుల కోసం పనిచేసే ఐక్యరాజ్య సమితి సంస్థ వ్యాఖ్యానించింది. శాశ్వత కాల్పుల విరమణ జరగాలని ఇరాన్ కూడా కోరింది. పాలస్తీనియన్లపై యూదుల నేరాలు పూర్తిగా ఆగిపోవాలని విదేశాంగ శాఖ ప్రతినిధి నాజర్ కానాని పేర్కొన్నారు.

గాజాలో ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధంపై చర్చించేందుకు యురోపియన్, అరబ్ దేశాల ప్రతినిధులు బార్సిలోనాలో సమావేశమయ్యారు. 42 ప్రతినిధి బృందాలు ఈ సమావేశంలో పాల్గొన్నాయి.

మరో 60మంది అదుపులోకి

కాల్పుల విరమణ నాల్గవ రోజైన సోమవారం విడుదలవ్వాల్సిన బందీలు, ఖైదీల జాబితాను ఇరు పక్షాలు మార్పిడి చేసుకున్నాయి. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో గత రాత్రి మరో 60మంది పాలస్తీనియన్లను ఇజ్రాయిల్ బలగాలు అరెస్టు చేశాయని పాలస్తీనియన్ ప్రిజనర్స్ క్లబ్ వెల్లడించింది. వీరిలో కొంతమంది మాజీ ఖైదీలు కూడా వున్నారని తెలిపింది. అక్టోబరు 7 నుండి ఇప్పటివరకు ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో మూడు వేల మందికి పైగా పాలస్తీనియన్లను ఇజ్రాయిల్ బలగాలు నిర్బంధించాయి. ఎక్స్ వ్యవస్థాపకుడు ఎలాన్ మస్క్ ఇజ్రాయిల్‌లోని హమాస్ దాడి చేసిన ప్రాంతాల్లో ప్రధాని నెతన్యాహుతో కలిసి పర్యటించారు. హత్యాకాండకు దారితీసే ప్రచారాన్ని ఆపాలని ఆయన నెతన్యాహుకు సలహా ఇచ్చారు. హమాస్‌ను నాశనం చేయాలని నెతన్యాహు చేసిన ప్రకటనను దృష్టిలో ఉంచుకుని ఆయన ఈ సలహా ఇచ్చారు.

పాలస్తీనాకు సంఘీభావంగా
బ్రిటన్‌లో ర్యాలీల హోరు

లండన్: గాజాలో శాశ్వత కాల్పుల విరమణ ప్రకటించాలంటూ బ్రిటన్ అంతటా వేలాది మంది వీధుల్లోకి వచ్చి నినదించారు. గత ఏడు వారాలుగా క్రమం తప్పకుండా వారాంతంలో రెండు రోజుల పాటు పాలస్తీనా సంఘీభావ ర్యాలీలతో బ్రిటన్ హోరెత్తుతోంది. శని, ఆదివారాల్లో లండన్, గ్లాస్గో, మాంచెస్టర్, లీడ్స్ ఎడిన్‌బర్గ్, ఇతర ముఖ్య పట్టణాల్లో వేలాది మందితో ర్యాలీలు జరిగాయి. అమెరికా, బ్రిటన్, ఇతర సామ్రాజ్యవాదుల పూర్తి మద్దతుతో నెతన్యాహు ప్రభుత్వం సాగిస్తున్న యుద్ధ నేరాలను ఖండిస్తూ ప్లకార్డులు, పోస్టర్లు ప్రదర్శించారు. గాజాలో ఇజ్రాయిల్ నరమేధంపై ప్రజల్లో నెలకొన్న ఆగ్రహం ఈ ర్యాలీల్లో ప్రతిబింబించింది. బ్యాంకులన్నీ మూతపడ్డాయి. పాలస్తీనాకు సంఘీభావంగా యూనివర్సిటీల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు వచ్చి ఈ ప్రదర్శనల్లో పాల్గొన్నారు. ఇందుకు అభినందించాల్సింది పోయి, యూనివర్సిటీల పాలకవర్గాలు అణచివేత చర్యలకు పాల్పడ్డాయి. సంఘీభావ ప్రదర్శనల్లో పాల్గొన్న విద్యార్థి గ్రూపులను సస్పెండ్ చేశాయి. పాలకవర్గాల చర్యను నిరసిస్తూ అన్ని యూనివర్సిటీల్లో విద్యార్థులు క్యాంపస్‌లలో ఆందోళనకు దిగారు. వారు ఏం చేశారన్నదాంతో నిమిత్తం లేకుండా ఎవరినైనా అరెస్టు చేసే నిరంకుశ అధికారాన్ని ప్రభుత్వం పోలీసులకు ఇచ్చింది. దీంతో సెక్షన్12 కింద లండన్‌లో 18 మందిని పోలీసులు అరెస్టు చేశారు. బ్రిటిష్ ప్రభుత్వం, ఇజ్రాయిల్ అనుకూలవాదులు నిరసనకారులపై జాతి విద్వేషకులన్న ముద్ర వేస్తున్నాయి. సిరియాలోని డమాస్కస్ అంతర్జాతీయ విమానాశ్రయంపై ఇజ్రాయిల్ దాడిని రష్యా ఖండించింది. ఇది రెచ్చగొట్టే చర్య అని రష్యన్ విదేశాంగ మంత్రి మేరియా జఖరోవ్ పేర్కొన్నారు.

జర్నలిస్టులపై ఊచకోతను ఆపండి
అంతర్జాతీయ జర్నలిస్టుల పరిరక్షణ కమిటీ డిమాండ్

పాలస్తీనా జర్నలిస్టులపై ఇజ్రాయిల్ సాగిస్తున్న ఊచకోతను వెంటనే ఆపాలని అంతర్జాతీయ జర్నలిస్టుల పరిరక్షణ కమిటీ డిమాండ్ చేసింది. అక్టోబరు 7 నుంచి ఇజ్రాయిల్ సాగిస్తున్న దాడుల్లో 63 మంది పాలస్తీనా జర్నలిస్టులు గాజా, వెస్ట్‌బ్యాంక్‌ల్లో చనిపోయారు. ఈ ఊచకోతలో అమెరికా పాత్ర కూడా ఉందని కమిటీ పేర్కొంది. జర్నలిస్టులపై నెతన్యాహు ప్రభుత్వం సాగిస్తున్న ఈ దాడులు పత్రికా స్వేచ్ఛ, అంతర్జాతీయ చట్టాలు, మానవ హక్కులకు పూర్తి విరుద్ధమని కమిటీ పేర్కొంది.


పోరాడారు..సాధించారు..

30 నెలల పాటు ఫీల్డ్ అసిస్టెంట్ల అలుపెరుగని పోరు

- ప్రతిపక్షాలు, ట్రేడ్ యూనియన్ల మద్దతుతో ముందుకు
- బిచ్చమెత్తి సర్కారు కండ్లు తెరిపించిన వైనం
- పంచాయతీరాజ్ కమిషనరేట్ వద్ద మెరుపు ధర్నా



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



రాష్ట్రంలో ఉపాధి హామీ ఫీల్డు అసిస్టెంట్లు రెండున్నరేండ్ల పాటు అలుపెరుగని పోరాటం సాగించారు. ఆ పార్టీ..ఈపార్టీ అనే తేడా లేకుండా చట్టసభల్లో అనివార్యంగా సభ్యులందరి నోటా 'అయ్యో పాపం..ఫీల్డ్ అసిస్టెంట్లకు అన్యాయం జరిగింది..' అనిపించేలా సర్కారుపై ఒత్తిడి పెంచారు. అంతిమంగా ఉద్యోగంలో నుంచి తీసేసిన సర్కారే విధిలేక విధుల్లోకి తీసుకునేదాకా తమ పోరాట పటిమను ప్రదర్శించారు. అంతిమంగా విజయం సాధించారు. 'పోరాడితే పోయేదేమీ లేదు..బానిస సంకెళ్లు తప్ప' అన్న కారల్ మార్క్స్ పిలుపునకు సాకారతను చేకూర్చారు.

రాష్ట్రంలో 7,500 మందికిపైగా ఫీల్డు అసిస్టెంట్లున్నారు. వారంతా రెక్కాడితేగానీ డొక్కాడని కుటుంబాల నుంచి వచ్చినవారే. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక తరగతులకు చెందినవారే నూటికి 95 శాతానికిపైగా ఉన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని క్షేత్రస్థాయిలో క్రమపద్ధతిలో అమలు చేయించడంలో కీలకపాత్ర వారిదే. అలాంటి వారిపై సర్కారు కన్నుపడింది. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కోతలు విధించడం, సకాలంలో కూలీలకు వేతనాలు చెల్లించకుండా ఇబ్బందిపెట్టడం, మరోవైపు కనీస సౌకర్యాలు కల్పించకపోవడం, కూలీరేట్లను పెంచకపోవడం లాంటి అనేక కారణాలతో కొంత మేర ఉపాధి పనులకు కూలీలు క్రమంగా దూరమవుతున్న పరిస్థితి గ్రామాల్లో నెలకొంది. దీంతో రాష్ట్రానికి మెటీరియల్ కాంపోనెంట్ కింద వచ్చే నిధులు తగ్గడం మొదలైంది. కూలీలు వెనుకపట్టు పట్టడానికి కారణం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలే అని స్పష్టమవుతున్నది. క్షేత్రస్థాయిలోనేమో ఫీల్డు అసిస్టెంట్లు సరిగా పనిచేయకపోవడం వల్లనే కూలీల సంఖ్య తగ్గుతుందనే ప్రచారాన్ని సర్కారు మొదలుపెట్టింది. ఓ సర్క్యులర్ తీసుకొచ్చి కూలీల హాజరును బట్టి ఫీల్డు అసిస్టెంట్లను గ్రేడ్ల వారీగా విభజించి జీతాలిస్తామని మెలికపెట్టి కూర్చున్నది. దీంతో ఫీల్డు అసిస్టెంట్లు ఆగ్రహానికి గురయ్యారు. దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలనీ, సర్క్యులర్‌ను ఎత్తేయాలని డిమాండ్ చేస్తూ 2020లో సమ్మెలోకి వెళ్లారు. అదే ఏడాది కరోనా నేపథ్యంలో వారు సమ్మె నుంచి వెనక్కి తగ్గారు. కానీ, రాష్ట్ర సర్కారు మాత్రం తనకు వ్యతిరేకంగా సమ్మె చేశారనే నెపంతో వారిని పీకిపారేసింది. దీంతో 30 నెలల పాటు ఫీల్డు అసిస్టెంట్లు తీవ్ర మానసిక ఆందోళనకు గురయ్యారు. 90మందికిపైగా తనువు చాలించారు. దీంతో పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్లు అన్నట్టుగా ఎఫ్ఏలు పెద్ద ఎత్తున పోరాటబాటపట్టారు. దాన్ని తొక్కిపెట్టేందుకు టీఆర్ఎస్‌కేవీ నాయకత్వం న్యాయం జరిగేలా చూస్తామని దగ్గరకు తీసుకుని కాలంవెళ్లబుచ్చింది. దీన్ని గమనించిన మెజార్టీ ఫీల్డు అసిస్టెంట్లు సీఐటీయూ వద్దకు చేరారు. ఆ తర్వాత సీఐటీయూ, జేఏసీ ఆధ్వర్యంలో తమ ఉద్యమాన్ని దశలవారీగా చేపట్టారు. సర్పంచి, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎమ్మెల్యే, మంత్రులు, సీఎంలకు వినతిపత్రాల ద్వారా మొరపెట్టుకున్నారు. ఖమ్మం జిల్లాలో ఓ మహిళా ఫీల్డు అసిస్టెంట్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి దగ్గర చీర చాపి అడుక్కోవడం అప్పట్లో పెద్ద చర్చనీయాంశం అయింది. హుజురాబాద్ ఉప ఎన్నికలో నామినేషన్లు సైతం వేశారు. ప్రతిపక్ష పార్టీలు కూడా వారి డిమాండ్‌లో న్యాయాన్ని గుర్తించి వారి పోరాటానికి మద్దతు తెలిపారు. సీఐటీయూ, జేఏసీ ఆధ్వర్యంలో ఫీల్డు అసిస్టెంట్లు హైదరాబాద్‌లో రెండు,మూడుసార్లు మెరుపు ధర్నాలు చేశారు. వారి సమస్యలను శాసనసభ, మండలిలో సీతక్క, అలుగుబెల్లి నర్సిరెడ్డి, జీవన్‌రెడ్డిలు లేవనెత్తారు. క్వశ్చన్ అవర్‌లోనూ అధికార, ప్రతిపక్ష పార్టీల సభ్యులు వారి సమస్యను పరిష్కరించాలని గళమెత్తారు. ఓవైపు రాష్ట్రంలో ఎన్నికలు దగ్గర పడుతుండటం, మరోవైపు రోజురోజుకీ వారి పోరాటం మరింత బలపడుతుండటంతో రాష్ట్ర ప్రభుత్వం అనివార్యంగా దిగివచ్చింది. సమ్మెలు చేస్తే ఉద్యోగాలను తొలిస్తానని బెదిరించిన సీఎం కేసీఆరే దగ్గరకు తీసి ఉద్యోగాల్లోకి తీసుకుంటున్నామని ప్రకటించారు. దీంతో 30 నెలల పాటు నిర్విరామంగా మొక్కవోని దీక్షతో ఫీల్డు అసిస్టెంట్లు సాధించిన పోరాటం విజయం సాధించింది.

'ఢిల్లీ' మిడతల దండు పని పట్టాలి

- రైతుబంధు ఆపిన కాంగ్రెస్ మనకు అవసరమా..?
- శాంతిసామరస్యాలను చెడగొడుతున్న బీజేపీ
- బుల్డోజర్లు కాదు.. పొలాల్లో ట్రాక్టర్లు, హార్వెస్టర్లు నడవాలి : ఎమ్మెల్సీ కవిత



నవతెలంగాణ-కంఠేశ్వర్

"పంటలు చేతికొచ్చే సమయంలో మిడతల దండు వచ్చినట్టు.. ఐదారు రోజులుగా ఢిల్లీ నుంచి బీజేపీ, కాంగ్రెస్ అగ్రనేతలు తెలంగాణపై పడుతున్నారు.. ఓట్లతో ఆ మిడతల దండు పని పట్టాలి" అని ఎమ్మెల్సీ కవిత అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ కోసం పోరాటం చేసిన నాడు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ ఎక్కడున్నారని ప్రశ్నించారు. రాష్ట్రం వచ్చిన తర్వాత పార్లమెంటులో కాంగ్రెస్ నాయకులు ఆంధ్రా హక్కుల గురించి మాట్లాడారు కానీ తెలంగాణ హక్కు గురించి మాట్లాడలేదని తెలిపారు. తెలంగాణలోని 7 మండలాలను అప్రజాస్వామికంగా ఆంధ్రలో కలిపినప్పుడు, కేంద్రం విభజన హామీలను అమలు చేయకపోతే కాంగ్రెస్ నాయకులకు మాట్లాడటానికి నోరు రాలేదని విమర్శించారు. తెలంగాణ ఏర్పాటును అవహేళన చేస్తూ పార్లమెంటులో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మాట్లాడినప్పుడు సోనియా గాంధీ అక్కడే ఉన్నా అభ్యంతరం చెప్పలేదని గుర్తు చేశారు.

బీజేపీ అబద్దాలు చెప్పడం తప్ప ఒక్కసారి కూడా నిజం చెప్పలేదని విమర్శించారు. తెలంగాణలో శాంతిసామరస్యాలను పాడుచేయడానికి ఆ పార్టీ నాయకులు రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకరు భాగ్యలక్ష్మీ దేవాలయం అంటారు.. మరొకరు భైంసాకు వెళ్లి ఏదో చేస్తామంటారు.. కానీ మనకు భరోసా, భద్రత ఇచ్చేలా, అస్థిత్వాన్ని కాపాడటానికి ఏనాడూ బీజేపీ ప్రయత్నం చేయలేదని అన్నారు. మనం కష్టాల్లో ఉన్నప్పుడు పట్టించుకోని నాయకులు, పార్లమెంటులో పెదవి విప్పని నాయకులు, అవసరమున్నప్పుడు తెలంగాణకు నయాపైసా ఇవ్వని వాళ్లు మనకు అవసరమా అన్నది ఆలోచించాలని ఓటర్లను కోరారు. మతం పేరు చెప్పి మంటలు పెట్టాలని ఒక పార్టీ చూస్తోందని, మరొక పార్టీ కులం పేరు చెప్పి కుతంత్రం చేసే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు.

తెలంగాణలో శాంతి భద్రతలకు విఘాతం కలిగితే.. ముస్లింలకు ఎంత నష్టం జరుగుతుందో.. హిందువులకూ అందే నష్టం జరుగుతుందని చెప్పారు. ఈ ఆలోచన లేక కొన్ని పార్టీలు ప్రజల మధ్య చిచ్చుపెట్టాలని చూస్తున్నాయని విమర్శించారు. మంచోళ్లు కావాలా ముంచేటోళ్లు కావాలా అన్నది తేల్చుకునే సందర్భం వచ్చిందన్నారు. రైతుబంధు నిధులను కాంగ్రెస్ పార్టీ వెంటబడి మరీ నిలిపివేయించిందని, రైతుల నోటి కాడి బుక్కను లాక్కొని ఆ పార్టీ రైతు వ్యతిరేకతను చాటుకుందని అన్నారు.

ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్.. తెలంగాణలో బుల్డోజర్ నడపాల్సిన సమయం వచ్చిందని అంటున్నారని, వెయ్యి బుల్డోజర్లు నడిపినా వాటిపై దాడి చేయడానికి కారు సిద్ధంగా ఉందని హెచ్చరించారు. "బుల్డోజర్లు నడపడం మా ఆలోచన కాదు. పొలాల్లో ట్రాక్టర్లు, హార్వెస్టర్లు నడవాలన్నదే మా ఆలోచన. సాగు, తాగు నీళ్లు అందించాలన్నది, పిల్లలకు ఉద్యోగాలు కల్పించాలన్నది మా ఆలోచన. మీ లాగా ఇండ్లను కూల్చేయడం కాదు.. ఇండ్లు నిర్మించడం మా ఆలోచన" అని చెప్పారు.

సీట్లు ఇవ్వరట.. సీఎంను చేస్తరట..

మోడీ, కేసీఆర్‌వి కుల రాజకీయాలు

- 'అయ్యా.. బాంచన్' బతుకులు పోవాలి : కాంగ్రెస్ రోడ్ షోల్లో విజయశాంతి



నవతెలంగాణ-రంగారెడ్డి ప్రతినిధి/మోర్తాడ్/ఆర్మూర్

బీసీలకు సీట్లు ఇవ్వని బీజేపీ.. సీఎంను చేస్తామంటున్నదని కాంగ్రెస్ పార్టీ క్యాంపియన్ కమిటీ చీఫ్ కోఆర్డినేటర్ విజయశాంతి విమర్శించారు. కేసీఆర్, మోడీ ఇద్దరూ కుల రాజకీయాలు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ప్రజలు అయ్యా బాంచన్ అనే విధంగా బతకాల్సి వచ్చిందని, అలాంటి పార్టీని గద్దెదించే అవకాశం వచ్చిందని అన్నారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం, నిజామాబాద్ జిల్లా బాల్కొండ, ఆర్మూర్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ నిర్వహించిన రోడ్‌షోల్లో ఆమె మాట్లాడారు.


ఇబ్రహీంపట్నంలోని మహంకాళి అమ్మ ఆలయం నుంచి రోడ్ షోలో పాల్గొన్న ఆమె అంబేద్కర్ చౌరస్తాలో మాట్లాడారు. పేదల బతుకులు మార్చేది కాంగ్రెస్ మాత్రమేనని చెప్పారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామని హామీ ఇచ్చారు. కేసీఆర్‌ను రెండుసార్లు గెలిపిస్తే రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని ఆరోపించారు. కేసీఆర్, మోడీ మధ్య రహస్య ఒప్పందముందన్నారు. అందుకే కేసీఆర్ కూతురు కవిత లిక్కర్ స్కామ్‌లో కేంద్రం అరెస్టు చేయకుండా వెనకడుగు వేసిందని విమర్శించారు. వీరిద్దరిని ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని తాను గ్యారంటీ అని బాండ్ పేపర్‌పై మల్‌రెడ్డి రంగారెడ్డి సంతకం చేశారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్ పర్సన్ స్రవంతి, మల్‌రెడ్డి రంగారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్ రెడ్డి, నాయకులు గౌస్‌పాషా తదితరులు ఉన్నారు.

'అయ్యా.. బాంచన్' బతుకులు పోవాలి.

నిజామాబాద్ జిల్లా బాల్కొండ, ఆర్మూర్‌ల్లో జరిగిన రోడ్‌షోల్లో విజయశాంతి మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌ను గద్దె దించి కాంగ్రెస్‌ను గద్దెనెక్కించాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. వేల కోట్ల రూపాయలను సంపాదించుకుంటూ బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను బిచ్చగాళ్లగా మార్చిందని, తెలంగాణ సంపదలను పందికొక్కులుగా దోచుకుంటున్నారని అన్నారు. ప్రజలు కోరుకున్న విధంగా పాలనను అందించే కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ వైఫల్యంపై ప్రశ్నిస్తున్న వారిపై దాడులకు దిగుతూ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీపై ఈడీ దాడులు జరుగుతున్నారని, బీఆర్ఎస్ నేతలపై ఎందుకు దాడులు చేయడం లేదని ప్రశ్నించారు. సంక్రాంతికి 500 రూపాయల సిలిండర్‌తో ప్రతి ఒక్కరూ తమ అప్పాలు చేసుకోవాలని అన్నారు. తెలంగాణలో యువతను గంజాయి వైపు మార్చిన ఘనత అధికార పార్టీది అని, బాల్కొండ నియోజకవర్గంలో యువత గంజాయి వైపు మారేలా చేసిన మంత్రిని ఓడిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని అన్నారు.

ఇంజినీరింగ్ సీట్లపై పరిమితి ఎత్తివేత

- అదీ ప్రముఖ కళాశాలల్లోనే...
- ఏఐసీటీఈ యోచన



చెన్నయ్ : దేశంలో పేరెన్నికగన్న ఇంజినీరింగ్ కళాశాలల్లో కీలక బ్రాంచీల్లో సీట్ల సంఖ్యపై ప్రస్తుతం అమలులో ఉన్న పరిమితిని వచ్చే సంవత్సరం నుండి తొలగించాలని అఖిలభారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) యోచిస్తోంది. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా, స్థూల నమోదు నిష్పత్తిని (గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో) పెంచేందుకు ఈ ప్రతిపాదనను ముందుకు తెచ్చింది. మౌలిక సదుపాయాలు, బోధనా సిబ్బంది లభ్యత ఆధారంగా సీట్ల సంఖ్యను పెంచుతారు. సీట్ల సంఖ్యను పెంచుకునేందుకు అనుమతి మంజూరు చేయడానికి ముందు నిపుణుల కమిటీ ఆయా కళాశాలల్లో తనిఖీలు నిర్వహిస్తుంది. ఏఐసీటీఈ ప్రతిపాదనను ప్రముఖ ఇంజినీరింగ్ కాలేజీలు స్వాగతించగా మధ్య శ్రేణి కాలేజీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ప్రవేశాలు తగ్గిపోతే నాణ్యమైన విద్యను అందించడం కష్టమవుతుందని చెబుతున్నాయి. మధ్య శ్రేణి కాలేజీల ప్రయోజనాలను ఫణంగా పెట్టి ప్రముఖ కళాశాలలకు లబ్ది చేకూర్చడమే దీని వెనుక ఉన్న ఉద్దేశమని విమర్శిస్తున్నాయి. ప్రస్తుతం కాలేజీల్లో ఒక్కో బ్రాంచిలో గరిష్ఠంగా 240 సీట్లు మాత్రమే ఉన్నాయి. డిమాండ్, అందుబాటులో ఉన్న సీట్ల మధ్య వ్యత్యాసం ఉన్న నేపథ్యంలో గతంలో గరిష్ఠ పరిమితిని ప్రవేశపెట్టారు. ఇప్పుడు దానిని తొలగించాలని యోచిస్తున్నారు. కోర్ బ్రాంచీల్లో కనీసం మూడు కోర్సులు ఉన్న కాలేజీలకే సీట్ల సంఖ్యను పెంచుకునేందుకు అనుమతి లభిస్తుంది. నాణ్యమైన విద్యను అందిస్తున్న కాలేజీలకు మాత్రమే సీట్లను పెంచుకొని, క్యాంపస్‌లను విస్తరించుకునేందుకు అవకాశం ఉంటుందని ఓ ఇంజినీరింగ్ కళాశాల యజమాని తెలిపారు. అమెరికాలో సగటు విద్యార్థుల సంఖ్య 30 వేల నుండి 40 వేల వరకూ ఉంటుందని గుర్తు చేశారు. దీనితో పోలిస్తే మన దేశంలో విద్యార్థుల సంఖ్య చాలా తక్కువగా ఉన్నదని చెప్పారు. అయితే ఈ ప్రతిపాదన కార్యరూపం దాలిస్తే నాణ్యమైన విద్యను అందిస్తున్న మధ్య శ్రేణి కళాశాలల్లో ప్రవేశాలు తగ్గుతాయని కొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 'తుది అనుమతికి సంబంధించిన ప్రాసెస్ హ్యాండ్‌బుక్ కోసం ఎదురు చూస్తున్నాం. అయితే ఈ ప్రతిపాదిత చర్య ప్రముఖ కళాశాలలు, మధ్య శ్రేణి కళాశాలల మధ్య దూరం పెంచుతుంది. ప్రవేశాలు తగ్గితే నాణ్యమైన విద్యను అందించడం కష్టమవుతుంది' అని ఓ కాలేజీ ఉపాధ్యక్షుడు ఆవేదన వ్యక్తం చేశారు.

వనరుల కేటాయింపులో అన్యాయం

- దక్షిణాది రాష్ట్రాల ఆందోళన
- యూపీకే అగ్ర తాంబూలమని పలు రాష్ట్రాల ఫిర్యాదు



న్యూఢిల్లీ : మన దేశం ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్య ఏమంటే ఫెడరల్ వ్యవస్థపై ఒత్తిడులు పెరుగుతున్నాయి. తమకు వనరుల కేటాయింపులో అన్యాయం జరుగుతోందని దక్షిణాది రాష్ట్రాలు గత కొంతకాలంగా ఫిర్యాదు చేస్తున్నాయి. పన్నుల ద్వారా కేంద్రం పొందుతున్న రాబడిని రాష్ట్రాలకు కేటాయించే సమయంలో గత 30 సంవత్సరాలుగా దక్షిణాదిపై కేంద్రం చిన్నచూపు చూస్తూనే ఉంది. దక్షిణాది రాష్ట్రాలకు వనరుల కేటాయింపు రానురానూ తగ్గిపోతోంది. 12వ ఆర్థిక సంఘం దగ్గర నుండి కేరళ, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలు తమ కేటాయింపులను గణనీయంగా కోల్పోతున్నాయి. 14వ, 15వ ఆర్థిక సంఘాల కాలం నుండి ఆయా రాష్ట్రాలు తమ నిరసన ధ్వనులను గట్టిగా వినిపిస్తున్నాయి. ఆర్థిక సంఘాలు జనాభాకు సంబంధించి 2011 లెక్కలనే ప్రాతిపదికగా తీసుకుంటున్నాయి. దీనిని దక్షిణాది రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నాయి. ఎందుకంటే ఉత్తర భారతంలోని రాష్ట్రాల్లో జనాభా అధికంగా ఉంది. సంతానోత్పత్తి రేటు ఎక్కువగా ఉండడమే దీనికి కారణం. మరోవైపు విధానపరమైన డిమాండ్ల కారణంగా దక్షిణాదిన జనాభా స్థిరంగా ఉంది.

వనరుల కేటాయింపు విషయంలో రాజస్థాన్, బీహార్, మధ్యప్రదేశ్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల డిమాండ్లు న్యాయ సమ్మతంగానే ఉన్నాయి. ఎందుకంటే అది దక్షిణాది రాష్ట్రాల కంటే చాలా పేదవి. ఆర్థికంగా వెనుకబడినవి. కాబట్టి వాటికి సహజంగానే అధిక సాయం అవసరమవుతుంది. ఆరోగ్యం, విద్య రంగాల్లో వెనుకబడిన ప్రాంతాల్లో మరిన్ని ఆస్పత్రులు, పాఠశాలలు నిర్మించాల్సిన అవసరం ఉంది. దక్షిణాదిలో ఎవరో కొందరికి తప్ప మిగిలిన వారందరికీ ఈ రాష్ట్రాల పట్ల విముఖత లేదు. ఈ రాష్ట్రాల్లో ప్రాథమిక సౌకర్యాలు కల్పించేందుకు తమ సొమ్మును వాడుతున్నారని ఎవరూ ఫిర్యాదు చేయడం లేదు. తమ డబ్బును వేరే ఇతర ప్రయోజనాల కోసం వినియోగించినప్పుడే సమస్య ఉత్పన్నమవుతుంది. ఇక్కడ వనరుల కేటాయింపు సరిగా లేదన్నదే ప్రధాన ఫిర్యాదు. జనాభా రీత్యా ఉత్తరప్రదేశ్ అతి పెద్ద రాష్ట్రం. పరిమాణాన్ని బట్టి అధిక వనరులు ఆ రాష్ట్రానికే దక్కుతున్నాయి. ఇది ఇతర రాష్ట్రాలకు అసమంజసంగా ఉంటుంది. వాస్తవానికి దామాషాకు విరుద్ధంగా ఉత్తరప్రదేశ్‌కు వనరుల కేటాయింపు జరుగుతోంది. అనేక అంశాల్లో మధ్యప్రదేశ్, రాజస్థాన్, బీహార్ రాష్ట్రాలతో ఉత్తరప్రదేశ్‌కు పోలికలు ఉన్నాయి. అయినప్పటికీ యూపీకే వనరుల కేటాయింపు అధికంగా జరుగుతోంది. ఆర్థిక పరిమాణం కంటే దాని బడ్జెట్ చాలా ఎక్కువ. బీహార్ కంటే యూపీ ఆర్థికంగా బలంగా ఉంది. అయినా యూపీకే కేటాయింపులు ఎక్కువ. వనరుల కేటాయింపులో అనుసరించే విధానాలే ఈ వ్యత్యాసాలకు కారణమని నిపుణులు తెలిపారు. రాష్ట్రాలకు కేటాయింపులు జరిపేటప్పుడు జనాభా, విస్తీర్ణం, అడవులు-జీవావరణం, ఆదాయం, పన్నులు-ద్రవ్య ప్రయత్నాలు, జనాభా పనితీరు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. ఏదేమైనా జనాభా నియంత్రణతోనే సమస్యలు పరిష్కారమవుతాయి.

నేను బతికుండగా రైతుబంధు ఆగుద్దా..!

(మొదటిపేజీ తరువాయి)

ఆపుతరు. 30న ఓట్లు పడుడేనాయే.. 3న కారు గెలుచుడేనాయే.. 6న రైతుబంధు డబ్బులిచ్చుడేనాయే.. దాంతోపాటు అసైన్డ్ భూములకు పట్టాల కోసం తొలి సతకం చేస్తా..' అని సీఎం కేసీఆర్ అన్నారు. సోమవారం సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లాల్లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల్లో ముఖ్యమంత్రి ప్రసంగించారు. ఓటు మన తలరాతను మార్చుతుందని, వచ్చే ఐదేండ్లు మనందరి భవిష్యత్‌ను నిర్ణయించేది ఓటేనని అందోల్, సంగారెడ్డి సభల్లో సీఎం చెప్పారు. పోటీ చేస్తున్న అభ్యర్థుల గుణగణాలతోపాటు ఆయా పార్టీల చరిత్రను కూడా చూడాలన్నారు. రైతు బంధు దుబారా ఖర్చు అని చెబుతున్న కాంగ్రెసోళ్లు ఈసీకి ఫిర్యాదు చేసి రైతులకు డబ్బులేయకుండా చేశారన్నారు. న్యాయ పోరాటం చేసి ఈసీ అనుమతి తెచ్చుకుంటే మళ్లీ వాళ్లే ఫిర్యాదు చేసి డబ్బులివ్వకుండా అడ్డుకున్నారన్నారు. ఇట్ల ఎన్ని రోజులని రైతుబంధును ఆపుతారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ గెల్వంగనే డిసెంబర్ 6న టింగ్ టింగ్‌మని రైతుల ఖాతాల్లో డబ్బులు పడతాయన్నారు. ఇందిరమ్మ రాజ్యం సక్కగుంటే ఎన్టీఆర్ పార్టీ ఎందుకు పెట్టేవారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో రాష్ట్రమంతా ప్రశాంతంగా ఉందన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో సాగిన రక్తపాతం మళ్లీ కావాల్నా అని ప్రశ్నించారు. దేశంలో 158 మెడికల్ కళాశాలు ఇచ్చిన బీజేపీ.. తెలంగాణకు ఒక్కటి కూడా ఇవ్వలేదన్నారు. అలాంటి బీజేపీకి ఓటు ఎందుకు వేయాలన్నారు. బీజేపీకి వేసే ఓటు మోరీలో వేసినట్లే అవుతుందన్నారు. సంగారెడ్డి జిల్లాలో తలాపున సింగూరున్నా కాంగ్రెస్ ప్రభుత్వంలో అందోల్, సంగారెడ్డికి తాగు, సాగునీరు ఇచ్చిన పాపాన పోలేదన్నారు. అందోల్ బీఆర్ఎస్ అభ్యర్థి క్రాంతిని గెలిపిస్తే నియోజకవర్గంలో పైలెట్ ప్రాజెక్టు కింద దళితులందరికీ ఒకేసారి దళితబంధు అమలు చేస్తామన్నారు. సంగారెడ్డిలో పోలింగ్ బూతుల్ని ఆక్రమించి రిగ్గింగ్ చేసే ఎమ్మెల్యే కావాల్నా ఓడిపోయినా ప్రజల మధ్య ఉండి సేవ చేస్తున్న చింత ప్రభాకర్ కావాల్నా ఆలోచించుకుని ఓటు వేయాలని కోరారు. సేవాలాల్ జయంతి రోజును సెలవు దినంగా ప్రకటిస్తామన్నారు.

అసైన్డ్ భూముల పట్టాలకు తొలి క్యాబినెట్‌లోనే ఆమోదం

అసైన్డ్ భూముల పట్టాలను రాబోయే బీఆర్ఎస్ ప్రభుత్వం తొలి క్యాబినెట్ భేటీలోనే ఆమోదిస్తామని షాద్‌నగర్, చేవెళ్ల సభల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేశారు. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలకు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ద్వారా సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ కోసమే పుట్టిన పార్టీ బీఆర్ఎస్ అని, అన్ని వర్గాల సంక్షేమాన్ని కాంక్షించే బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఆదరించి గెలిపించాలని కోరారు.

షాద్‌నగర్ వరకు మెట్రో విస్తరిస్తామన్నారు. చేవెళ్ల నియోజకవర్గంలోని షాబాద్‌లో అనేక పరిశ్రమలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. 111జీఓ రద్దు చేశామని, హైదరాబాద్ చుట్టూ మాస్టర్ ప్లాన్ చేయాల్సి ఉందని, అది కూడా త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. 'నేను అందరికీ ఆర్డర్ వేస్తే.. ఎమ్మెల్యే కాలే యాదయ్య మాత్రం నాకు ఆర్డర్ వేస్తాడు. నా దగ్గరికి రాగానే ఏం ఆర్డరో చెప్పు అని అంటా' అని సీఎం వ్యాఖ్యానించారు.

ఓపీఎస్ కోసం ఉద్యమం తీవ్రం

- అసోంలో ప్రభుత్వ ఉద్యోగుల ఉమ్మడి ఫోరం నిర్ణయం

గౌహతి : ఓల్డ్ పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్) పునరుద్ధరించాలనే డిమాండ్ సాధన కోసం ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలని అసోంలోని ప్రభుత్వ ఉద్యోగుల ఉమ్మడి ఫోరం నిర్ణయించింది. ఇక్కడ సోమవారం జరిగిన ఆల్ అస్సాం ప్రభుత్వ ఎన్‌పీఎస్ ఉద్యోగుల సంఘం (ఎఎజిఎన్‌పిఎస్‌ఇఎ) సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఒక ప్రకటనలో తెలిపారు. ఓపీఎస్ అసోం జాయింట్ కోఆర్డినేషన్ కమిటీ, ఓపీఎస్ అసోం జాయింట్ ఫోరం కూడా దీనికి మద్దతు తెలిపింది. నేషనల్ పెన్షన్ స్కీమ్ (ఎన్‌పిఎస్)ను రద్దు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఒపిఎస్ అమలు చేయాలనే డిమాండ్లతో తీర్మానాన్ని ఆమోదించారు. పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ యాక్ట్ (పిఎఫ్ఆర్‌డిఎ) చట్టం 2013ను కేంద్రం తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ చట్టంలో ఎన్‌పిఎస్ క్లాజ్‌లను పొందుపరిచారని, చట్టాన్ని రద్దు చేయకుంటే ఓపీఎస్‌లోకి మారినప్పటికీ ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటారని సమావేశం తెలిపింది.

రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సానుకూలంగా స్పందించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలని సమావేశం నిర్ణయించినట్లు ప్రకటనలో తెలిపారు.

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదును పెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణమండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	- 62,560	▲ 270
22 క్యారెట్లు	- 57,350	▲ 250
కిలో వెండి	- 81,500	▲ 1300



చికెన్ ధరలు
హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ. 84
రిటైల్ (లైవ్)	రూ. 106
స్కిన్‌తో	రూ. 154
స్కిన్‌లెస్	రూ. 175

వ్యవసాయ సంక్షోభమే ప్రధాన రాజకీయ సమస్య

రెండో రోజు మహాపడావ్‌లో లక్షల మంది కార్మికులు, కర్షకులు

- నయా ఉదారవాద విధానాలే సంక్షోభానికి మూలం
- నేడు రాజ్ భవన్‌లకు రైతులు, కార్మికుల మార్చ్

న్యూఢిల్లీ : దేశంలో వ్యవసాయ సంక్షోభం జాతీయ స్థాయిలో ప్రధాన రాజకీయ సమస్యగా మారిందని మహాపడవ్ స్పష్టం చేసింది. కేంద్రంలోని మోడీ సర్కార్ కార్మిక, కర్షక, ప్రజా, దేశ వ్యతిరేక విధానాలపై సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం), కేంద్ర కార్మిక సంఘాలు, ఫెడరేషన్ల సంయుక్త వేదిక ఆధ్వర్యంలో దేశంలోని అన్ని రాష్ట్ర రాజధానుల్లో రాజ్ భవన్ (గవర్నర్ కార్యాలయాల)ల ఎదుట రెండో రోజు సోమవారం మహాపడవ్ కొనసాగింది. ఇందులో లక్షల మంది కార్మికులు, కర్షకులు పాల్గొన్నారు. వివిధ ప్రజా సంఘాలు సంఘీభావంగా నిలిచాయి. కార్మికులు, రైతు ఐక్యత మోడీ సర్కార్ కార్పొరేట్, మతపరమైన బంధాన్ని సవాలు చేసింది. డిమాండ్ల చార్టర్‌ను గవర్నర్‌కు సమర్పించేందుకు నేడు (మంగళవారం) రైతులు, కార్మికులు రాజ్‌భవన్‌లకు మార్చ్ చేయనున్నారు.

దేశ చరిత్రలో మొదటిసారి

వేలాది మంది రైతులు, కార్మికులు ఆందోళన చేసే దగ్గరే వంటావార్పు చేశారు. మహాపడవ్ సైట్‌లో ట్రాక్టర్ ట్రాలీలు, తాత్కాలిక టెంట్‌లలో రాత్రి బస చేశారు. మోడీ ప్రభుత్వ హయాంలో కార్మికులు, రైతుల ఐక్యతకు రాజకీయ ప్రాధాన్యతనిస్తూ ఎన్నికలకు వెళ్లే రాష్ట్రాలు మినహా అన్ని రాష్ట్ర రాజధానుల్లో మహాపడవ్ కొనసాగింది. నిర్దిష్ట డిమాండ్ చార్టర్, కార్యాచరణ ప్రణాళికతో కార్మికులు, రైతుల వేదికల కలయిక స్వతంత్ర భారతదేశ చరిత్రలో మొదటిసారిగా జరుగుతోంది.



వ్యవసాయ సంక్షోభాన్ని పరిష్కరించాలి

కార్మికులు, రైతుల వేదికల అఖిల భారత నాయకులు ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. దీర్ఘకాలిక వ్యవసాయ సంక్షోభాన్ని పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. పేద రైతాంగం, గ్రామీణ శ్రామిక ప్రజానీకం, గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ వలసలను పరిష్కరించాల్సిన అవసరంపై దృష్టి పెట్టాలన్నారు. నయా ఉదారవాద విధానాలు వ్యవసాయ సంక్షోభానికి మూలమని విమర్శించారు. వ్యవసాయ సంక్షోభం, సంబంధిత వ్యవసాయ కార్పొరేటీకరణ విధానం అఖిల భారత స్థాయిలో ప్రధాన రాజకీయ సమస్యగా మారాయన్నారు. అందువల్ల, రాబోయే రోజుల్లో ప్రతి కార్మికుడు, రైతు అన్ని గ్రామాలు, పట్టణాల్లో ఇంటింటికి ప్రచారం, పోరాటాలు మరింత విస్తరించాలని పిలుపునిచ్చారు.



రైతుబంధు విషయంలో.. కాంగ్రెస్‌పై దుష్ప్రచారం సరికాదు

- రైతుల పక్షాన నిలబడే పార్టీ కాంగ్రెస్
- అబద్దాల కోర్ ముఖ్యమంత్రి కేసీఆర్
- ఉమ్మడి మెదక్ జిల్లాకు పరిశ్రమలను తెచ్చింది ఇందిరాగాంధీ
- విజయభేరి సభలో ఏఐసీసీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే

నవ తెలంగాణ- నర్సాపూర్

రైతుబంధు విషయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ కాంగ్రెస్‌పై చేస్తున్న అసత్య ప్రచారాలని ప్రజలు నమ్మొద్దు. మంత్రి హరీశ్‌రావు ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి మాట్లాడటంతోనే ఎన్నికల కమిషన్ రైతుబంధును నిలిపివేసింది. దాన్ని కప్పిపుచ్చుకోవడానికి కాంగ్రెస్‌పై ఆరోపణలు చేస్తున్నారు. ఈ విషయాన్ని ప్రజలు గ్రహించాలి. రైతుల పక్షాన నిలబడే పార్టీ కాంగ్రెస్' అని ఏఐసీసీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. సోమవారం మెదక్ జిల్లా శివంపేట మండల పరిధిలోని చిన్న గొట్టిముక్కుల గ్రామ సమీపంలో కాంగ్రెస్ విజయభేరి బహిరంగ సభలో మల్లికార్జున్ ఖర్గే ప్రసంగించారు.సీఎం కేసీఆర్ అబద్దాల కోర్ అని, ఎన్నికల సమయంలో ప్రజలకు 20 హామీలు ఇచ్చి ఒక్కటీ సక్రమంగా అమలు చేయలేదన్నారు. సంక్షేమ పథకాల పేరుతో సీఎం కేసీఆర్ లక్షల కోట్ల రూపాయలను దోపిడీ చేశారన్నారు. ఇందిరాగాంధీని ఈ ప్రాంతం ప్రజలు మెదక్ ఎంపీగా గెలిపిస్తే ప్రధానమంత్రి అయి ఉమ్మడి మెదక్ జిల్లాలో బీహెచ్ఈఎల్, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఎంతోమందికి ఉపాధి అవకాశాలు కల్పించి నిరుపేదల బతుకుల్లో వెలుగులు నింపారన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ 9 సంవత్సరాల పాలనల పరిశ్రమలు ఏర్పాటు చేయకుండా.. ఇంటికో ఉద్యోగం అన్న ముఖ్యమంత్రి కేసీఆర్ మాటలు ఎక్కడ అని ప్రశ్నించారు. కేసీఆర్ ఇందిరాగాంధీని విమర్శించడం సరికాదని, ఆమె కుటుంబానికి చెందిన సోనియాగాంధీ తెలంగాణ ఇవ్వడంతోనే.. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యారన్నది గుర్తుంచుకోవాలన్నారు.

రాహుల్ గాంధీ కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు చేసిన జోడోయాత్రలో ప్రజలను, కార్మికులను, నిరుద్యోగులను ఉద్యోగులతో పాటు అన్ని రంగాల కార్మికులను కలిశారని చెప్పారు. భూమాఫియాని, ఇసుక మాఫియాని, మైనింగ్ మాఫియాను, లిక్కర్ మాఫియాలను, బడా బాబులను కలుస్తారు తప్ప పేదలను మాత్రం కలవడానికి కేసీఆర్ సమయం ఇవ్వరని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కేసీఆర్ అవినీతిని వెలికి తీస్తామని, కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డిని ప్రజలు గెలిపించాలని కోరారు.

మూఢనమ్మకాలతో సచివాలయాన్ని కూల్చారు

- కాంగ్రెస్, బీఆర్ఎస్ రహస్య ఒప్పందం
- మద్యం కుంభకోణం కేసు విచారణలో ఉంది
- ఎన్నికల ప్రచార సభల్లో ప్రధాని నరేంద్రమోడీ



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి/ మహబూబాబాద్


తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రహస్య ఒప్పందంతో ఉన్నాయి. అందులో ఏ పార్టీకి ఓటు వేసినా ఒకే గూటికి వేసినట్టు అవుతుంది. ఒక రోగాన్ని వదిలించుకునేందుకు మరో రోగాన్ని తెచ్చుకోవద్దు. తెలంగాణలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే.. కేసీఆర్ మూఢనమ్మకాల వల్ల సచివాలయాన్ని కూల్చారు' అని ప్రధాని మోడీ అన్నారు. కరీంనగర్, మహబూబాబాద్ జిల్లా కేంద్రాల్లో సోమవారం నిర్వహించిన సకల జనుల విజయ సంకల్ప సభల్లో మోడీ ప్రసంగించారు. హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో ఫాంహౌస్ సీఎం కేసీఆర్‌కు ట్రైలర్ చూపించామన్నారు. ఈ ఎన్నికలతో కేసీఆర్ పాలన ఖేల్ ఖతమవుతుందని చెప్పారు. నీళ్లు, నిధులు, నియామకాల నినాదాలతో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ పాలనలో కన్నీళ్లు, మోసాలు, నిరుద్యోగులు పెరిగారని చెప్పారు. బీజేపీ ప్రభుత్వంలో తొలి సీఎం బీసీ సామాజిక తరగతి నుంచే ఉంటారన్నారు. ఇక్కడి ప్రజల్లో పరివర్తన కనిపిస్తుందని, మార్పునూ నిశ్చయించుకున్నారని, తమ ప్రభుత్వ రాకను ఆహ్వానిస్తున్నారని అన్నారు. పలుమార్లు తెలుగులో మాట్లాడేందుకు ప్రయత్నించిన ప్రధాని మధ్యలో కరీంనగర్ ఫిలిగ్రీ కళను ప్రస్తావించారు. మన్‌కీ బాత్‌లోనూ తాను దీని గురించి మాట్లాడానని, కళాకారుల కోసం పీఎం విశ్వకర్మయోజనను ప్రవేశపెట్టానని చెప్పారు. దీని ద్వారా ఇక్కడి ఫిలిగ్రీ కళాకారులకు ఆధునిక శిక్షణ, రూ.లక్షల్లో రుణం లభిస్తుందని తెలిపారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో పెట్రో, డీజిల్ ధరలు తక్కువగా ఉన్నాయని, ఇక్కడా తమ ప్రభుత్వం వచ్చిన తొలి రోజుల్లోనే పెట్రోల్ బంక్‌లో ఫలితాన్ని చూస్తారని అన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేయడం అంటే మళ్లీ కేసీఆర్‌ను గద్దె ఎక్కించడమే అవుతుందన్నారు.

తెలంగాణలో అన్ని స్కాములపై విచారణ

తెలంగాణలో జరిగిన అన్ని స్కాములపై విచారణ చేపట్టే సత్తా బీజేపీకే ఉందని మహబూబాబాద్ సభలో ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. తెలంగాణను బీఆర్ఎస్, కాంగ్రెస్ భ్రష్టుపట్టించాయని విమర్శించారు. ఓడిపోతానని తెలుసుకున్న కేసీఆర్ ఢిల్లీకి వచ్చి తనతో దోస్తీకి ప్రాధేయపడ్డారని చెప్పారు. తాను తిరస్కరించడం వల్లే విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజల డబ్బుతో కట్టిన సచివాలయాన్ని ఆయన మూఢనమ్మకాల కోసం కూల్చివేశారన్నారు. తెలంగాణలో కేసీఆర్ స్కాములపై బీజేపీ దర్యాప్తు చేస్తుందని చెప్పారు. బీఆర్ఎస్ అవినీతిపరులందరినీ జైలుకి పంపిస్తామన్నారు.

కారును గ్యారేజ్‌కి పంపే సమయం

- కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కయ్యాయి
- సింగరేణి కార్మికులపై పన్ను రద్దు చేస్తాం..
- మంచిర్యాల రోడ్ షోలో అమిత్ షా



నవతెలంగాణ - హాజీపూర్

కేసీఆర్ సర్కార్‌ను మార్చి కారును గ్యారేజ్‌కు పంపే సమయం వచ్చిందని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా అన్నారు. సోమవారం మంచిర్యాల నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఎర్రబెల్లి రఘునాథ్‌ను గెలిపించాలని అభ్యర్థిస్తూ అమిత్‌షా రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 2014, 2018లో కాంగ్రెస్ తరపున గెలిచిన ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి కేసీఆర్ సీఎం అయ్యారని, కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య ఒప్పందం ఉందని తెలిపారు. కాంగ్రెస్ పేరుతో గెలిచిన ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లోకి వెళ్తారన్నారు. తెలంగాణలో కాంగ్రెస్‌కు ఓటు వేస్తే కేసీఆర్‌ను సీఎం చేస్తారని, ఢిల్లీలో రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేస్తారని చెప్పారు. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో కేసీఆర్ సీఎం, రాహుల్ ప్రధాన మంత్రి అయ్యే అవకాశాలు లేవన్నారు. మళ్లీ మోడీనే ప్రధాన మంత్రి అవుతారని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం ముస్లిములకు 4శాతం రిజర్వేషన్ ఇచ్చిందని, బీజేపీ అధికారంలోకి వస్తే బీసీలకు 4శాతం రిజర్వేషన్ ఇస్తామని చెప్పారు. ఎస్సీ వర్గీకరణ, బీసీ అభ్యర్థిని ముఖ్యమంత్రి చేసి తీరుతామన్నారు. సింగరేణి కార్మికులకు ఇన్‌కమ్ టాక్స్ రద్దు చేస్తామన్నారు. మంచిర్యాల బరిలో ఉన్న ఎర్రబెల్లి రఘునాథ్‌ను ఎమ్మెల్యేగా గెలిపించి బీజేపీని అధికారంలోకి తీసుకురావాలని ప్రజలను కోరారు.

నేడు సీఎం సభలో కోడి కత్తి రిపీట్ కాబోతుంది

- ప్రజల సానుభూతి కోసం కేసీఆర్ డ్రామా
- గజ్వేల్ కాంగ్రెస్ అభ్యర్థి నర్సారెడ్డి కీలక వ్యాఖ్యలు

నవ తెలంగాణ- గజ్వేల్

ఈ నెల 28న గజ్వేల్‌లో జరిగే ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రచార సభలో కోడి కత్తి డ్రామా రిపీట్ చేయాలని ప్రయత్నం చేస్తున్నారని గజ్వేల్ కాంగ్రెస్ అభ్యర్థి తూముకుంట నర్సారెడ్డి అన్నారు. తన ఇంటికి భద్రత కల్పించాలని ఈ సందర్భంగా పోలీసులను కోరారు. సోమవారం సిద్దిపేట జిల్లా మండల కేంద్రమైన గజ్వేల్‌లో ఆయన తన ఇంటిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంగళవారం గజ్వేల్‌లో జరిగే సీఎం సభలో వారే అల్లర్లు సృష్టించుకొని కాంగ్రెస్‌పై నెట్టే అవకాశం ఉందని అన్నారు. దుబ్బాకలో ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డిపై జరిగిన కత్తిపోట్ల దాడి కాంగ్రెస్ పని అని సీఎం కేసీఆర్ ఇప్పటికే ప్రకటించారన్నారు. పోలీస్ శాఖ మాత్రం కాంగ్రెస్ చేసింది కాదని తేల్చిందని చెప్పారు. కాంగ్రెస్‌కు రక్త చరిత్ర ఉన్నదని కేసీఆర్ చెప్పడం సిగ్గుచేటన్నారు. 1200 మంది అమరవీరుల కుటుంబాల పుణ్యమా అని సీఎం కుర్చీలో కూర్చున్న కేసీఆర్‌కు కాంగ్రెస్ రక్త చరిత్ర గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. గజ్వేల్‌తో పాటు కామారెడ్డిలో ముఖ్యమంత్రికి ఓటమి తప్పదని చెప్పారు.

డిసెంబర్ 3న కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని సమాచారం తెలుసుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజల సానుభూతి పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. కేసీఆర్‌కు ప్రజల సానుభూతి కాదు కదా ఆయనను సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ప్రచార రథాలను 40 గ్రామాల్లో ప్రజలు రానివ్వలేదని చెప్పారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లారెడ్డి, సర్దార్ ఖాన్, నాగరాజు, అంజా గౌడ్ తదితరులు ఉన్నారు.



ఇమ్రాన్‌ఖాన్‌కు 14 రోజుల రిమాండ్

- అవినీతి కేసులో...

ఇస్లామాబాద్ : అవినీతి కేసులో ఇమ్రాన్‌ఖాన్‌కి సోమవారం పాకిస్థాన్ అకౌంటిబిలిటీ కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది.ఆయన పోలీస్ కస్టడీని పొడిగించాలన్న నేషనల్ అకౌంట్‌బిలిటీ బ్యూరో (ఎన్ఎబి) చేసిన అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. పాకిస్థాన్ అకౌంటిబిలిటీ కోర్టు జడ్జి ముహమ్మద్ బషీర్ నేతృత్వంలో రావల్పిండిలోని అడియాలా జైలులో అల్ ఖాదిర్ ట్రస్ట్ అవినీతి కేసు విచారణ జరిగింది. వేర్వేరు కేసులలో సెప్టెంబర్ 26 నుంచి పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ ప్రస్తుతం అదే జైలులో శిక్ష అనుభవిస్తున్న సంగతి తెలిసిందే. ఈ కేసులో ప్రధాన నిందితుడు ఇమ్రాన్‌ఖాన్ సోదరీ మణులు అలీమా ఖానుమ్, నోరీన్ ఖానుమ్‌లతోపాటు ఆయన భార్య బుష్రా బీబిలు కూడా విచారణకు హాజరైనట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. అవినీతి కేసులో నవంబర్ 15 నుండి అడియాలా జైలులో ఇమ్రాన్‌ఖాన్‌ను ఎన్ఎబి విచారిస్తోంది.

పండుగ పూట విషాదం

- మర్కుక్‌లో ప్రమాదవశాత్తు ప్రాజెక్టు కాల్వలో పడి ఇద్దరు విద్యార్థుల మృతి

నవతెలంగాణ-మర్కుక్

ప్రమాదవశాత్తు కొండపోచమ్మ ప్రాజెక్టు కాల్వలో పడి ఇద్దరు విద్యార్థులు మృతి చెందిన సంఘటన సిద్దిపేట జిల్లా మర్కుక్‌లో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. మర్కుక్ ఎస్ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం పాఠశాలకు సెలవు దినం కావడంతో మర్కుక్ గ్రామానికి చెందిన చల్లా సంపత్(13), మైసిగారి వినయ్(12), అచ్చంగారి రాజు.. ముగ్గురూ కలిసి ఉదయం కొండపోచమ్మ ప్రాజెక్టు వైపు వాకింగ్‌కు వెళ్లారు. అనంతరం ప్రాజెక్టు సంపుహౌజ్ కాల్వ వద్ద కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లగా.. సంపత్, వినయ్ కాలు జారి కాల్వలో పడిపోయారు. కాల్వ గట్టు మీద ఉన్న రాజు ఇది గమనించి కాపాడటానికి ప్రయత్నం చేయగా.. అప్పటికే ఇద్దరూ నీట మునిగిపోయారు. దాంతో పరుగుగెత్తుకుంటూ గ్రామానికి చేరుకొని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వగా.. గజ్వేల్ ఏసీపీ రమేష్, మర్కుక్ ఎస్ఐ సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. గ్రామస్తులు, గజ ఈతగాళ్ల సహాయంతో మృతదేహాలను బయటకు తీసి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మర్కుక్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



(ఫైల్)

అకాల వర్షంతో తడిసిన ధాన్యం



నవతెలంగాణ-దిలావర్‌పూర్, ముధోల్

ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యం సోమవారం ఉదయం కురిసిన అకాల వర్షానికి తడిసి ముద్దయింది. దిలావర్‌పూర్, ముధోల్ మండలాల్లో ఎండబెట్టిన ధాన్యంపై టార్పలిన్లు కప్పినా.. ఈదురు గాలులతో కూడిన వర్షం రావడంతో గాలులకు అవి లేచి పోవడంతో ధాన్యం తడిపోయింది. ధాన్యం కుప్పల్లోకి నీరు చేరి పూర్తిగా తడిసి ముద్దయ్యాయి. తడిసిన ధాన్యాన్ని రైతులు ఎండబెట్టేందుకు మళ్లీ అష్టకష్టాలు పడ్డారు. తాము పడ్డ శ్రమ రెండితలయ్యిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

మత గ్రంథంపై ప్రమాణం చేయించి

ఓటర్లకు డబ్బు పంపిణీ

పీర్జాదిగూడలో బీఆర్ఎస్ నేతల ఎత్తుగడ

- మల్లారెడ్డి కాలేజ్ సిబ్బందిని పట్టుకున్న ఎన్నికల అధికారులు
- డబ్బు తరలిస్తూ పట్టుబడిన పోలీసు అధికారి
- ఓటమి భయంతోనే ప్రలోభాలు : కాంగ్రెస్ పార్టీ నేతలు



నవతెలంగాణ- బోడుప్పల్

ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడానికి బీఆర్ఎస్ నేతలు కొత్త ఎత్తుగడలను అవలంబిస్తున్నారు. బీఆర్ఎస్ నాయకులు ఓటర్లకు ఒక చేతితో డబ్బు పంపిణీ చేస్తూ మరో చేతితో ఓ మత గ్రంథంపై ప్రమాణం చేయిస్తూ.. పట్టుబడ్డారు. ఈ సంఘటన మేడ్చల్ నియోజకవర్గం పీర్జాదిగూడ కార్పొరేషన్‌లో సోమవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలోని 9వ డివిజన్‌లో బీఆర్ఎస్ నేతలు, మల్లారెడ్డి కాలేజ్ సిబ్బంది ఓటర్ లిస్టు ఆధారంగా ఓటర్లకు డబ్బు పంపిణీ చేశారు. దాంతోపాటు వారితో బీఆర్ఎస్‌కే ఓటు వేస్తామని ఓ మత గ్రంథంపై ప్రమాణం చేయిస్తున్నారని కాంగ్రెస్ నాయకులకు తెలియడంతో ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అక్కడికి చేరుకున్న ఎన్నికల అధికారులు, పోలీసులు బీఆర్ఎస్ నేతలు, మల్లారెడ్డి కళాశాల సిబ్బంది నుంచి రూ.1.50 లక్షలు, మత గ్రంథం, ఓటర్ల లిస్ట్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఓటర్ల వివరాలతో కూడిన మరో లిస్ట్‌ను స్వాధీనం చేసుకున్నట్టు ఎఫ్ఎస్టీ రాధిక తెలిపారు. అనంతరం పట్టుబడిన నగదు, మల్లారెడ్డి కాలేజ్ సిబ్బందిని అదుపులోకి తీసుకుని మేడిపల్లి పీఎస్‌కు తరలించారు.

రూ.6.50లక్షలు తరలిస్తూ పట్టుబడిన పోలీసు అధికారి

మేడిపల్లి ఎస్వీఎం హోటల్ నుంచి ఓటర్లకు డబ్బు పంపిణీ చేసేందుకు రూ.6.50 లక్షలు కారులో తరలిస్తున్న పోలీసు అధికారిని కాంగ్రెస్ నేతలు అడ్డుకుని మేడిపల్లి చౌరస్తాలోని పోలీసులకు అప్పగించారు. ఆ కారులో పట్టుబడిన నగదును ఎన్నికల అధికారులు, పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

మల్లారెడ్డిపై చర్యలు తీసుకోవాలి

ఎన్నికల్లో అక్రమ పద్ధతిలో గెలిచేందుకు మల్లారెడ్డి ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్నాడని, ఆయనపై ఎన్నికల అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో పీర్జాదిగూడ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఓటమి తప్పదని తెలిసిన మల్లారెడ్డి ప్రలోభాలకు తెరదీశారని చెప్పారు. ఇప్పటికైనా మల్లారెడ్డిపై, కాలేజ్ సిబ్బందిపై చర్యలు తీసుకుని ఎన్నికలు సజావుగా సాగేలా చూడాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దర్గా సుధాకర్ రెడ్డి, వంగేటి ప్రభాకర్ రెడ్డి, కవిడే కుమార్, భాస్కర్ బండిరాళ్ల, రంజిత్ రెడ్డి, చింత నరసింహారెడ్డి ఉన్నారు.

మార్పు అంటే

6 గంటల కరెంటు ఇవ్వడమా..?

- రైతు బంధును కాటగలిపిన కాంగ్రెస్
- కాంగ్రెస్ హస్తం దరిద్రాలకు నేస్తం..
- తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తుకే ఓటు వేయాలి
- రోడ్ షోల్లో కేటీఆర్





నవతెలంగాణ-చెన్నూర్ /హుజూరాబాద్/ ములుగు/ ఏటూరు నాగారం

మార్పు కావాలనే నినాదంతో ప్రజల వద్దకు వస్తున్న కాంగ్రెస్ నాయకులు అధికారం వచ్చాక ఆరు గంటల కరెంటు ఇవ్వడమేనా మార్పు అని మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. అధికారంలోకి రాకముందే రైతు బంధును కాటగలిపి రైతుల నోట్లో మట్టిగొట్టారని కాంగ్రెస్‌పై ధ్వజమెత్తారు. పొరపాటున వారు అధికారంలోకి వస్తే రైతుబంధును పూర్తిగా ఎత్తేస్తారని ఆరోపించారు. సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా చెన్నూర్, ములుగు, పెద్దపల్లి నియోజకవర్గాల్లో సోమవారం నిర్వహించిన రోడ్ షోల్లో కేటీఆర్ మాట్లాడారు. మార్పు అంటే నిండు కుండాలా మారిన చెరువులను ఎండిపోయేలా చేటమేనా.. రైతులకు పెట్టుబడి సాయం కింద అందుతున్న రైతుబంధును ఎగ్గొట్టడమేనా అని ప్రశ్నించారు. 55 ఏండ్లలో 11 సార్లు అధికారం చేపట్టిన కాంగ్రెస్ నాయకులు పదవులు అనుభవించారే కాని ఎక్కడా అభివృద్ధి జరగలేదన్నారు. గతంలో రూ.400 ఉన్న గ్యాస్ సిలెండర్ ధరను రూ.1200కు పెంచిన మోడీ సర్కార్ పేదోడి పొట్టగొట్టిందని విమర్శించారు. ప్రజలను మోసం చేసే పార్టీలను నమ్మొదని, అధికారం వచ్చాక ఎమ్మెల్యేను కలవాలంటే హైదరాబాద్‌కు బస్సు వేసుకొని పోయే పరిస్థితి వస్తుందని అన్నారు.

ములుగు జిల్లాకు బంగారు భవిష్యత్తు

ములుగు నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి బడే నాగజ్యోతిని ఎమ్మెల్యేగా గెలిపిస్తేనే ములుగు జిల్లాకు బంగారు భవిష్యత్తు ఉంటుందని కేటీఆర్ తెలిపారు. ఎక్కడ సమావేశం జరిగినా పార్టీ అభిమానులు, ప్రజలు కిక్కిరిసిపోతున్నారని ఇదే ఉత్సాహాన్ని ఈనెల 30న జరిగే ఎన్నికల్లో కూడా చూపించాలని కోరారు. అధికారంలోకి రాగానే ఏటూరు నాగారంకు బస్సు డిపో, మారుమూల గ్రామాల్లోనూ మోడల్ కాలనీలు, మంగపేట మండలం నుంచి ముల్లకట్ట బ్రిడ్జి వరకు కరకట్ట నిర్మాణం, కొండయి బ్రిడ్జి నిర్మాణం.. తదితర అభివృద్ధి పనులను బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే అమలు చేస్తామన్నారు. కేసీఆర్ సీఎం అయ్యాక ములుగులో రెండు రోజులు ఉండి సమస్యలపై దృష్టి పెడతానని హామీ ఇచ్చారు. జనవరి నుంచి కొత్త పింఛన్లు, అర్హులకు రేషన్ కార్డులు ఇవ్వనున్నట్టు తెలిపారు. పేద కూలీలకు తెల్ల రేషన్ కార్డుపై ఐదు లక్షల జీవిత బీమా ఎల్ఐసీ ద్వారా అందించనున్నట్టు తెలిపారు. పదేండ్ల పాలనలో ఏ ప్రభుత్వమూ ఇన్ని సంక్షేమ పథకాలు ప్రజలకు ఇవ్వలేదని, కేవలం బీఆర్ఎస్ ప్రభుత్వమే అమలు చేసిందన్నారు.

రాష్ట్ర భవిష్యత్తుకే ఓటు వేయాలి

ఇప్పుడు జరిగే ఎన్నికలు వ్యక్తుల మధ్య కాదని రాజకీయ పార్టీల మధ్యనే.. మీరు వేసే ఓటు తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తు కోసం మంచి మార్పు కోసం వేయాలని కేటీఆర్ అన్నారు. మార్చి పోతే సెప్టెంబర్ అన్నట్టుగా మళ్లీ రాసే పరీక్షలు ఇవి కావని రాష్ట్ర భవిష్యత్తు నిర్ణయించే ఎన్నికలని అన్నారు. సోషల్ మీడియా, ఇతర పద్ధతుల్లో అసత్యప్రచారాలు చేస్తున్న కాంగ్రెస్, బీజేపీ మాటలు నమ్మి మోసపోతే రాష్ట్రంలో కరెంట్ కష్టాలు వస్తాయని, కాంగ్రెస్ హస్తం దరిద్రాలకు నేస్తం లాంటిదని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని రైతుబంధు పథకాన్ని సీఎం కేసీఆర్ ప్రవేశపెడితే.. ఇప్పుడు రావాల్సిన డబ్బులను కాంగ్రెస్ కుట్రల వల్ల ఎన్నికల కమిషన్ ఆపేసిందని ఆరోపించారు. రాష్ట్రంలో అసైన్డ్ భూములు ఉన్నవారికి త్వరలోనే పట్టాలు ఇవ్వనున్నట్టు సీఎం కేసీఆర్ ప్రకటించారని అన్నారు. రుణమాఫీ కాని కొంతమందికి ఎన్నికల అయిన తర్వాత వడ్డీతో సహా ప్రభుత్వమే చెల్లిస్తుందని అన్నారు.

గుజరాత్‌లో పిడుగులు పడి 24 మంది మృతి

అహ్మదాబాద్ : గుజరాత్‌లో పిడుగులు, అకాల వర్షాలు బీభత్సం సృష్టించాయి. గడచిన 24 గంటల్లో పిడుగుపాటుకు గురై 24 మంది చనిపోయారు. మరో 25 మంది గాయపడ్డారు. పిడుగుపాటుతో మరణించిన వారిలో దాహెూద్ జిల్లాలో నలుగురు, బరూచ్‌లో ముగ్గురు, తాపీలో ఇద్దరు ఉన్నట్టు అధికారులు తెలిపారు. భారీ వర్షాలతో దక్షిణ గుజరాత్ ప్రాంతంలోని పంటలకు ఎక్కువగా నష్టం వాటిల్లినట్టు అధికారులు తెలిపారు. గుజరాత్‌లోని 251 తాలూకాలకు గాను 230 తాలూకాల్లో ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు కురిశాయి. రాష్ట్ర అత్యయిక పరిస్థితుల నిర్వహణ కేంద్రం తెలిపిన వివరాల ప్రకారం పిడుగుపాటుకు 70కి పైగా మూగజీవాలు చనిపోయాయి. పిడుగుపాటుకు దాహెూద్ జిల్లాలో అత్యధికంగా నల్గురు చనిపోయారు. బనస్కాంత, భరూచ్‌లలో ముగ్గురేసి చొప్పున, తాపీ జిల్లాలో ఇద్దరు మరణించారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలోనూ పిడుగులు పడి అయిదుగురు చనిపోయారు. అండమాన్ సమీపంలో అల్పపీడనం తుపానుగా మారే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది.

బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎంను ఓడించండి

- సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పిలుపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఈనెల 30న అసెంబ్లీ ఎన్నికల్లో మతోన్మాద, ఫాసిస్టు బీజేపీ, దానికి తోడుగా ఉన్న బీఆర్ఎస్, ఎంఐఎంలను ఓడించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఫాసిస్టు వ్యతిరేక శక్తులను గెలిపించాలని కోరింది. ఈ మేరకు ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. హిట్లర్ తరహాలో జాతి విద్వేషాన్ని రెచ్చగొడుతూ మతోన్మాద రాజ్య స్థాపనకు, బడా కార్పొరేట్ శక్తుల ఏకపక్ష ఆధిపత్యానికి బీజేపీ పూనుకుంటున్నదని విమర్శించారు. ఆ పార్టీ ఫాసిస్టు పోకడలను బీఆర్ఎస్ బలపరుస్తూ లోక్‌సభలో అండగా ఉంటున్నదని తెలిపారు. బీజేపీతో బీఆర్ఎస్, ఎంఐఎం రహస్య ఒప్పందం చేసుకుని క్విడ్‌ప్రోకో పద్ధతిని అనుసరిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కూటమి దేశానికి ప్రమాదకరమని తెలిపారు. నయా హిట్లరిస్ట్, అభినవ రజాకారు నిజాం కూటమి అని విమర్శించారు. ఈ ఎన్నికల్లో ప్రజలు ప్రజాస్వామ్యయుతంగా ఆలోచించి లౌకిక, ప్రజాస్వామిక, పౌరహక్కులను కాపాడ్డానికి, ఫాసిజం రాకుండా అడ్డుకోవడానికి ఆలోచించాలని కోరారు. ప్రలోభాలు, ప్రభావాలు, విద్వేషాలకు లోనుకాకుండా ఓటేయాలని పిలుపునిచ్చారు. కొత్తగూడెంలో సీపీఐకి మద్దతునిస్తున్నామని తెలిపారు.

హలాల్ ముద్రిత వస్తువులను తొలగించండి : యోగి అల్టిమేటం



లక్నో : హలాల్ ముద్రిత ఆహార పదార్థాలను తమ స్టోర్స్ నుండి 15 రోజుల్లోగా తొలగించాలని యుపి ప్రభుత్వం సోమవారం అల్టిమేటం జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మార్ట్స్, రిటైలర్స్, డిపార్ట్‌మెంట్ స్టోర్స్ నుండి వాటిని తొలగించాలని ఆదేశించింది. అలాగే ధ్రువీకరణ లేని సంస్థల నుండి హలాల్ ధ్రువీకరణ పొందుతున్న 92 ప్రభుత్వ ఉత్పత్తి సంస్థలకు తమ ఉత్పతులను యుపిలో వెనక్కు తీసుకోవాలని లేదా తిరిగి ప్యాకేజ్ చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. హలాల్ ముద్రిత ఆహార పదార్థాల ఉత్పత్తి, నిల్వ, పంపిణీ, అమ్మకంపై ఈ నెల 18న యోగి ప్రభుత్వం ఏకపక్షంగా నిషేధం విధించిన సంగతి తెలిసిందే. దీంతో వివిధ జిల్లాల్లోని 500 సంస్థలు మరియు రాష్ట్రంలోని 97 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించడంతో పాటు ఇప్పటివరకు సుమారు 2,500 కిలోల హలాల్ ఉత్పత్తులను స్వాధీనం చేసుకుంది. హలాల్ సర్టిఫికేషన్‌లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ నాలుగు సంస్థలపై హజ్రత్‌గంజ్ పోలీస్ స్టేషన్‌లో ఓ కేసు నమోదైంది. ఈ కేసును ప్రభుత్వం స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టిఎఫ్)కి బదిలీ చేసింది.

కొన్ని కంపెనీలు లాభాల కోసం నిర్దిష్ట కమ్యూనిటీలో అమ్మకాలను పెంచేందుకు కొన్ని ఉత్పత్తులను హలాల్ ఉత్పత్తులుగా ముద్రిస్తున్నాయని భారతీయ జనతా యువ మోర్చా (బిజెవైఎం) ఆఫీస్ బేరర్ ఫిర్యాదు చేసింది. ఇది అతి పెద్ద ఫోర్జరీ, మోసం అని ఆరోపించింది. బిజెవైఎం ఫిర్యాదుతో ఐపిసిలోని 120బి (నేరపూరిత కుట్ర), 384 (దోపిడీ), 420 (మోసం), 467 (ఫోర్జరీ), 468 (మోసం చేసే ఉద్దేశంతో ఫోర్జరీకి పాల్పడటం), 471 (నకిలీ పత్రాన్ని నిజమైనదిగా చూపడం), 153ఎ (రెండు వర్గాల మధ్య శతృత్వాన్ని రెచ్చగొట్టడం) మరియు 298 (ఉద్దేశపూర్వకంగా మత విశ్వాసాలను గాయపరచడం) సెక్షన్స్ కింద కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది.

కాంగ్రెస్‌కు వికలాంగుల మద్దతు

- తెలంగాణ వికలాంగుల జేఏసీ కన్వీనర్ నాగేశ్వరరావు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో తెలంగాణ వికలాంగుల జేఏసీ కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నదని ఆ సంఘాల జేఏసీ కన్వీనర్ నార నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఆయన విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో వికలాంగుల జనాభా సుమారు 20 లక్షలుగా ఉందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వికలాంగుల సంక్షేమం, అభివృద్ధి, ఆత్మ గౌరవం, సాధికారతకోసం పనిచేస్తున్నట్టు హామీ ప్రకటించిందని చెప్పారు. తమ సమస్యల పరిష్కారానికి భరోసానిస్తూ మ్యానిఫెస్టోలో ఆయా అంశాలు చేర్చారని గుర్తు చేశారు. సమావేశంలో ఫ్రెండ్లీ ఎన్విరాన్‌మెంట్ చైర్మెన్, యం. గంగారామ్, ఆదర్శ వికలాంగుల సంఘం అధ్యక్షులు ఎస్. మల్లారెడ్డి, బధిరుల అభివద్ధి సంఘం అధ్యక్షులు ప్రసాద్, భారతి, మహిళాసాధికారత సంఘం అధ్యక్షులు కె. రాజ్యలక్ష్మి, వికలాంగుల సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు ఘంటా సత్యనారాయణ రెడ్డి వికలాంగుల రాష్ట్ర సాంస్కృతిక సంఘం అధ్యక్షులు జి. వెంకట్, నిరుద్యోగుల వికలాంగుల సంఘ సభ్యులు వెంకటేశ్, బక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

మంచి కథను ప్రేక్షకులేప్పుడూ ఆదరిస్తారు - అమోల్ పరాశర్

నవతెలంగాణ-హైదరాబాద్ : పాంచి ఐసే ఆతే హై లో చాలా విస్తృతమైన సందేశం ఉంది. దీనిని దక్షిణ భారత ప్రేక్షకులు ఆదరిస్తారని నటుడు అమోల్ పరాశర్ అన్నారు. నటుడు విజయ్ టెండూల్కర్ టెలిప్లే పాంచి ఐసే ఆతే హైలో నటించారు. ఇది ఇప్పుడు కన్నడ, తెలుగులో కూడా అందుబాటులో ఉంది. టీవీఎఫ్ ట్రిప్లింగ్, డాలీ కిట్టి ఔర్ వో చమక్తే సితారే వంటి ఓటీటీ ఆఫర్లలో, షఉజిత్ సిర్కార్ చిత్రం సర్దార్ ఉదమ్ లో దిగ్గజ విప్లవకారుడు భగత్ సింగ్ వంటి చిరస్మరణీయమైన పాత్రలను పోషించిన అమోల్ పరాశర్ అత్యంత ఆసక్తి కరమైన పాత్రలను చేయటం కోసం ఎప్పుడూ ఆసక్తిగా చూస్తుంటారు. వివాహం విషయంలో మహిళలు అర్హత గురించి కొన్ని సామాజిక భావనలకు కట్టుబడి ఉండాలని ఆశించినప్పటికీ, పురుషులు కూడా పితృస్వామ్య వ్యవస్థకు కట్టుబడి ఉంటారన్నారు. ప్రేమ, వివాహం విషయానికి వస్తే, ప్రతి మనిషికి స్వేచ్ఛ ఉండాలని ఈ కథ తెలియజేస్తుందన్నారు. ఈ టెలిప్లే కు ఇషాన్ త్రివేది దర్శకత్వం వహించి, చిత్రీకరించారు. రతన్ రాజ్పుత్, దీపక్ ఖాజీర్, విభా చిబ్బర్, సందీప్ ధబాలే, వినయ్ విశ్వాకూడా దీనిలో నటించారు. దీన్ని డిసెంబర్ 2న ఎయిర్ టెల్ థియేటర్, డిష్ టివి రంగ్మంచ్ యాక్టివ్, డీ2హెచ్ రంగ్మాంచ్ యాక్టివ్లో చూడవచ్చు అని తెలిపారు.

కేసీఆర్ ఇందిరమ్మ అనుచరుడే



మన్మోహన్ సర్కార్‌లో మంత్రి కూడా

- తొమ్మిదేండ్లలో ఏమి చేశారో చెప్పాలి?
- ఐదు నెలల కర్నాటక ముచ్చటెందుకు? : జైరాం రమేశ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇందిరమ్మ పరిపాలించిన కాలంలో ఆమె అనుచరుల్లో కేసీఆర్ కూడా ఒకరని కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు, కేంద్ర మాజీ మంత్రి జైరాం రమేశ్ గుర్తుచేశారు. అదే విధంగా యూపీఏ ప్రభుత్వం ప్రధాని మన్మోహన్ మంత్రివర్గంలో కేసీఆర్ మంత్రిగా పని చేశారని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు అవన్నీ మరిచిపోయి ఇందిరమ్మ రాజ్యమంటే... కాంగ్రెస్ ప్రభుత్వమంటే అంటూ విమర్శలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. సోమవారం హైదరాబాద్ సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తొమ్మిదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఏమి చేశారో చెప్పాలని అడిగితే, ఐదు నెలల కర్నాటక కాంగ్రెస్ పాలనపై చెప్పాలని కోరడం ఏంటని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడంలో విఫలమయినందునే దృష్టి మళ్లించే ప్రయత్నాలు చేస్తూ, సెంటిమెంట్ మళ్లీ మళ్లీ రగిల్చే ప్రయత్నం చేస్తున్నదని ఆయన విమర్శించారు. అభివద్ధి, ఉపాధి కల్పన, సామాజిక న్యాయం చేయని బీఆర్ఎస్ ఎన్నికల ఎజెండా అంశాన్ని మారుస్తున్నదని తెలిపారు. ఇలాంటి దృష్టి మళ్లించే విద్యలో సీఎం కేసీఆర్, పీఎం నరేంద్రమోడీ ఇద్దరూ ఒక్కటేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలను విమర్శించే కేసీఆర్ ఆ రాష్ట్రాలకు వెళ్లి చూడాలని సూచించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన గ్యారంటీలన్నింటినీ అమలు చేస్తున్నట్టు తెలిపారు.

తెలంగాణ ఏర్పాటు సమయంలో యూపీఏ వేసిన మంత్రుల కమిటీకి బీఆర్ఎస్ (నాటి టీఆర్ఎస్) ఎలాంటి సూచనలు చేయలేదని తెలిపారు. పార్లమెంటు బిల్లు ఆమోదం పొందే సమయంలో ఆ పార్టీ ఎంపీలు హాజరు కాలేదన్నారు. విభజన హామీల కోసం ఏనాడూ బీఆర్ఎస్... బీజేపీని నిలదీయలేదనీ, పట్టుపట్టలేదని తెలిపారు. విభజన హామీల్లో ఇబ్బందులుంటే వాటి సవరణల కోసం పార్లమెంటులో ప్రయత్నం చేయలేదని విమర్శించారు. హైదరాబాద్‌తో కూడిన తెలంగాణను ధనిక రాష్ట్రంగా ఇస్తే అభివృద్ధిని అన్ని జిల్లాలకు, సంక్షేమాన్ని అన్ని వర్గాలకు అందించడంలో బీఆర్ఎస్ ఘోరంగా విఫలమైందని తెలిపారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన మెజారిటీ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి అభ్యర్థిని ఎన్నికల ముందు ప్రకటించే సంస్కృతి కాంగ్రెస్ కు లేదని స్పష్టం చేశారు. 10 మంది సీఎం అభ్యర్థులుండటం తమ పార్టీ బలాన్ని సూచిస్తున్నదని తెలిపారు.

ఉద్దేశపూర్వకంగానే హరీశ్ వ్యాఖ్యలు

రైతుబంధుకు సంబంధించి సీఎం కేసీఆర్ డైరెక్షన్‌లో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు వ్యాఖ్యలు చేశారని తెలిపారు. ఈ ఎన్నికల్లో గెలిచేందుకు బీజేపీ, బీఆర్ఎస్ కలిసి ఆడిన డ్రామా అని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రజలను నమ్మకద్రోహం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కోవిడ్ సమయంలో మరణించిన డాక్టర్ల కుటుంబాలలో

29 శాతం మందికే పరిహారం

ఆర్టీఐ సమాచారంతో వెలుగులోకి



న్యూఢిల్లీ : కోవిడ్-19 మొదటి, రెండో వేవ్ సమయంలో మరణించిన వైద్యుల కుటుంబాలలో 29 శాతం మందికి మాత్రమే ప్రభుత్వం ఇప్పటివరకు పరిహారం అందించింది. సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద ఈ విషయం వెల్లడైంది. మహమ్మారి సమయంలో మరణించిన మొత్తం వైద్యుల సంఖ్యపై తమ వద్ద డేటా లేదని ప్రభుత్వం చెప్పినప్పటికీ.. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) వైద్యుల మరణాల సంఖ్య 1,500కి పైగా ఉన్నదని తెలిపింది.

ఆర్టీఐ సమాచారం ప్రకారం.. ఇప్పటివరకు 475 వైద్యుల కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం చెల్లించింది. ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ ప్యాకేజీ (పీఎంజీకేపీ) కింద కోవిడ్-19 సంక్రమణ ప్రమాదంలో ఉన్న కమ్యూనిటీ, ప్రయివేటు ఆరోగ్య కార్యకర్తలతో సహా ఆరోగ్య సంరక్షణ ప్రదాతలకు ప్రభుత్వం రూ. 50 లక్షల బీమా కవరేజీని ప్రకటించింది.

అక్టోబర్ 23న దాఖలు చేసిన ఆర్టీఐలో కన్నూర్‌కు చెందిన నేత్ర వైద్య నిపుణుడు కె.వి.బాబు ఈ పథకం కింద పరిహారం పొందిన మొత్తం లబ్ధిదారుల సంఖ్యపై సమాచారాన్ని కోరారు. అంతకుముందు మహమ్మారి సమయంలో కోవిడ్ యోధులుగా పిలువబడిన వైద్యుల సంఖ్యను సైతం ఆయన అడిగారు.

పరిహారం పొందిన మొత్తం ఆరోగ్య కార్యకర్తల సంఖ్య, మహమ్మారి సమయంలో మరణించిన వైద్యులు, ఆరోగ్య కార్యకర్తలపై రాష్ట్రాల వారీ డేటాను కూడా ఆయన కోరారు.

ఈనెల 21న ఆర్టీఐ ఇచ్చిన సమాధానం ప్రకారం.. 2,244 కుటుంబాలకు రూ.1122 కోట్లు, 475 వైద్యుల కుటుంబాలకు రూ. 237.5 కోట్లు, 1,769 ఆరోగ్య కార్యకర్తల కుటుంబాలకు రూ. 884.5 కోట్లు పరిహారంగా అందాయి. ఆర్టీఐ కార్యకర్త మాట్లాడుతూ.. ఆరోగ్య సంరక్షణ నిపుణులకు చేసిన మొత్తం పరిహారంలో పరిహారం పొందిన వైద్యుల శాతం 21.16 శాతం మాత్రమే అని అన్నారు.

3.5 లక్షల మంది వైద్యులకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఐఎంఏ మహమ్మారి సమయంలో విధులు నిర్వహిస్తూ మరణించిన వైద్యుల వివరాల జాబితాను రాష్ట్రాల వారీగా సిద్ధం చేసింది. కరోనా మొదటి వేవ్ సమయంలో మరణించిన 757 మంది వైద్యులలో 90 మంది తమిళనాడుకు చెందినవారు ఉన్నారు. ఆ తర్వాత స్థానంలో పశ్చిమ బెంగాల్ (80), మహారాష్ట్ర (74), ఆంధ్రప్రదేశ్ (70), కర్ణాటక (68), ఉత్తరప్రదేశ్ (66), గుజరాత్ (62), బీహార్ (40)లు ఉన్నాయి.

రెండో వేవ్‌లో అత్యధిక మరణాలు ఢిల్లీ నుంచి నమోదయ్యాయి. 839 మంది వైద్యుల మరణాల్లో 128 మంది ఢిల్లీ నుంచే ఉన్నాయి. ఆ తర్వాతి స్థానాల్లో బీహార్ (115), ఉత్తరప్రదేశ్ (79), పశ్చిమ బెంగాల్ (65), తమిళనాడు (64), ఆంధ్రప్రదేశ్ (48), ఒడిశా (46), తెలంగాణ (43), గుజరాత్ (30), జార్ఖండ్ (30)లు ఉన్నాయి.

ఆ ఆదేశాలను వెనక్కి తీసుకోండి..

రైతుబంధుపై ఈసీకి బీఆర్ఎస్ విజ్ఞప్తి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రైతుబంధు డబ్బులను రైతుల ఖాతాల్లో వేయొద్దంటూ ఎన్నికల సంఘం ఆదేశించిన నేపథ్యంలో ఆ ఆర్డర్‌ను వెనక్కి తీసుకోవాలని అధికార బీఆర్ఎస్ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆ పార్టీ సెక్రటరీ జనరల్ కె.కేశవరావు, జనరల్ సెక్రటరీ సోమా భరత్ కుమార్ రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి వికాస్‌రాజ్‌ను సోమవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. తద్వారా రైతుల ఖాతాల్లో డబ్బులను వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి అనుమతినివ్వాలని కోరారు.

ఉత్తరకాశీ టన్నెల్‌లో కొనసాగుతున్న వెర్టికల్ డ్రిల్లింగ్

మాన్యువల్ డ్రిల్లింగ్ ప్రారంభం



డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీ టన్నెల్‌లో కార్మికులు బతుకు జీవుడా అని ఆందోళనగా ఉన్నారు. సోమవారం కూడా కార్మికులను వెలికితీయడం సాధ్యం కాలేదు. దీంతో వరసగా 16వ రోజూ 41 మంది కార్మికులు టెన్నెల్‌లో చిక్కుకుని ఉన్నారు. కార్మికులను రక్షించడం కోసం ప్రారంభించిన వెర్టికల్ డ్రిల్లింగ్‌లో భాగంగా సోమవారం సాయంత్రం 7 గంటల సమయానికి 36 మీటర్లు దూరం డ్రిల్లింగ్ పూర్తి చేశారు. ఈ వెర్టికల్ డ్రిల్లింగ్‌ను ఆదివారం ప్రారంభించిన సంగతి తెలిసిందే. మొత్తం 86 మీటర్ల డ్రిల్లింగ్‌ను ఈ నెల 30 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. వెర్టికల్ డ్రిల్లింగ్ పనులు సాగుతున్నా.. వచ్చే రెండో రోజులు వర్షాలు, హిమపాతం కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేయడం ఆందోళన కలిగిస్తుంది. వర్షాలు, హిమపాతం కార్మికుల వెలికితీతకు అంతరాయం కలిగిస్తాయని నిపుణులు భావిస్తున్నారు.

మాన్యువల్ డ్రిల్లింగ్‌ను కూడా సోమవారం సాయంత్రం నుంచి ప్రారంభించారు. ఇందుకోసం ర్యాట్-హోల్ మైనర్లు కూడా తీసుకునివచ్చారు. వీరు సాయంత్రం సమయానికి 1 మీటరు దూరం డ్రిల్లింగ్ పూర్తి చేశారు. ఒక మీటరు పైపుని లోనికి నెట్టారు. ఈ మాన్యువల్ డ్రిల్లింగ్‌కు సమయం ఎక్కువ పట్టినా ఇదే కార్మికులను బయటకు తీసుకుని రావడానికి సహాయం పడుతుందని కొంత మంది నిపుణులు అంచనా వేస్తున్నారు. ఉత్తరకాశీలోని నిర్మాణంలో ఉన్న సిల్క్యారా టన్నెల్ ఈ నెల 12న కూలిపోయిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి 41 మంది కార్మికులు అందులో చిక్కుకుని ఉండిపోయారు. వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.

ఎస్టీయూటీఎస్ అధ్యక్షులుగా ఎం పర్వత్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రోపాధ్యాయ సంఘం తెలంగాణ రాష్ట్రం (ఎస్టీయూటీఎస్) అధ్యక్షులుగా ఎం పర్వత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జి సదానందంగౌడ్ ఎన్నికయ్యారు. సోమవారం హైదరాబాద్‌లోని ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించిన 77వ వార్షిక కౌన్సిల్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆర్థిక కార్యదర్శిగా ఆట సదయ్య అసోసియేట్ అధ్యక్షులు పది మంది, ఉపాధ్యక్షులు 24 మంది, అదనపు ప్రధాన కార్యదర్శులు పది మంది, కార్యదర్శులు 24 మంది, ఆర్థిక కమిటీ సభ్యులు ఎనిమిది మందిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎస్టీయూటీఎస్ అధ్యక్షులు పర్వత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్ మాట్లాడుతూ ఎఫ్ఎల్ఎన్ ఉన్నతి, లక్ష్య వంటి వినూత్న ప్రక్రియల పేరుతో విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. ఉపాధ్యాయులు తరగతి గదిలో బోధించడానికి ఈ ప్రక్రియలు అడ్డంకిగా మారాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వివిధ యాప్‌ల అమలు పేరుతో బోధనేతర కార్యక్రమాలు, డేటా సేకరణకు అధిక సమయం వెచ్చించాల్సి వస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రయోజనం లేని ఇటువంటి కార్యక్రమాలను రూపొందించి కొందరు ఉపాధ్యాయులు డిప్యూటేషన్ల పేరుతో ఎస్సీఈఆర్టీలో పబ్బం గడుపుతున్నారని విమర్శించారు. ఆ ఉపాధ్యాయులను వెంటనే పాఠశాలలకు పంపించాలని డిమాండ్ చేశారు. కొన్ని ఎన్జీవో సంస్థలు, ఎస్సీఈఆర్టీలో చొరబడి ఉపాధ్యాయులకు సలహాలు, సూచనలివ్వడం అధికారుల అలసత్వానికి నిదర్శనమని తెలిపారు. ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలనీ, బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను విడుదల చేయాలని కోరారు.

డిసెంబర్ 2 వరకు పోస్టల్ బ్యాలెట్ అవకాశమివ్వాలి

ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులకు వచ్చేనెల రెండో తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించాలని ఎస్టీయూటీఎస్ ప్రధాన కార్యదర్శి జి సదానందంగౌడ్, పీఆర్టీయూ తెలంగాణ అధ్యక్షులు ఎం చెన్నయ్య డిమాండ్ చేశారు.

ఈ మేరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్‌ను సోమవారం హైదరాబాద్‌లో వారు కలిసి వినతిపత్రం సమర్పించారు. పోలింగ్ మరుసటి రోజు వచ్చేనెల ఒకటిన ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సిబ్బందికి సెలవు ప్రకటించాలని కోరారు. ఆయన సానుకూలంగా స్పందిస్తూ రిటర్నింగ్ అధికారులతో మాట్లాడామనీ, ప్రతి ఒక్క ఉద్యోగి ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించామన్నారని తెలిపారు. పోలింగ్ మరుసటి రోజు సెలవు ఇవ్వనున్నట్టు ఆయన స్పష్టం చేశారని పేర్కొన్నారు.

రైతులంటేే కండ్ల మంట ఎందుకు..?

కాంగ్రెస్‌పై తెలంగాణ ఫుడ్స్ చైర్మెన్ రాజీవ్ సాగర్ విమర్శ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రైతులంటే కాంగ్రెస్‌కు అంత కండ్ల మంట ఎందుకంటూ తెలంగాణ ఫుడ్స్ చైర్మెన్ మేడే రాజీవ్ సాగర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుబంధును అడ్డుకున్న ఆ పార్టీని ప్రజలు క్షమించబోరని ఆయన ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఇప్పుడే అన్నదాతల పొట్టగొడుతున్న కాంగ్రెస్..అధికారంలోకి వస్తే అసలు వారిని పట్టించుకుంటుదా..? అని ప్రశ్నించారు. ఈ క్రమంలో కాంగ్రెస్ కావాలో..? కరెంటు కావాలో..? తేల్చుకోవాలంటూ ప్రజలకు సూచించారు. రైతు బంధు డబ్బులను ఆపాలంటూ ఈసీని ఆ పార్టీ నేతలు కోరటంతో అది రైతు వ్యతిరేక పార్టీ అని మరోసారి రుజువైందని విమర్శించారు.

దుర్మార్గం : దాసోజు శ్రావణ్

రైతుబంధు డబ్బులను ఆపేయాలంటూ ఈసీని కోరటం ద్వారా పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి... అత్యంత దుర్మార్గానికి పాల్పడ్డారని బీఆర్ఎస్ సీనియర్ నేత డాక్టర్ దాసోజు శ్రావణ్ విమర్శించారు. ఆయన రైతుల పాలిట రాబందుల రెడ్డి అంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. కాంగ్రెస్... బీజేపీతో కుమ్మక్కై, ఎన్నికల కమిషన్‌పై ఒత్తిడి తేవటం ద్వారా రైతు బంధును అడ్డుకుంటుందంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

వీసా లేకుండా మలేసియాకు భారతీయులు, చైనీయులకు అవకాశం

కౌలాలంపూర్ : డిసెంబరు 1 నుండి వీసా లేకుండా మలేసియాలో ప్రవేశించేందుకు భారతీయులకు, చైనీయులకు వీలు కల్పించనున్నట్లు మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం తెలిపారు. ఇటీవలి వారాల్లో థాయిలాండ్, శ్రీలంకలు కూడా ఇదే చర్యను తీసుకున్నాయి. తాజాగా మలేసియా కూడా ఆ జాబితాలో చేరింది. పర్యాటక రంగాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో విదేశీయులకు ఈ సదుపాయాన్ని కల్పిస్తున్నారు. ఈ సౌకర్యం 30 రోజుల పాటు అమల్లో వుంటుంది. గల్ఫ్ దేశాలు, ఇతర పశ్చిమాసియా దేశాలు పొందుతున్న ప్రస్తుత వీసా మినహాయింపులకు ఈ చర్య అదనమని ఇబ్రహీం తెలిపారు. మలేసియాకు రావాలనుకునే పర్యాటకులందరికీ తొలుత పరీక్షలు నిర్వహిస్తామని, ఇక్కడ భద్రత అనేది అత్యంత ముఖ్యమైన అంశమని చెప్పారు. క్రిమినల్ రికార్డు వున్నా, తీవ్రవాదం ముప్పు వున్నా వారినే మాత్రం అనుమతించేది లేదన్నారు. భద్రతా బలగాలు, ఇమ్మిగ్రేషన్ అధికారుల పరిధిలోనే ఈ అంశం వుంటుందని చెప్పారు.

బిజినెస్

త్వరలో మారుతి కార్లు ప్రియం

ఆడి కార్లు మరింత ఖరీదు

ముడి సరుకుల వ్యయాల ఎఫెక్ట్



న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి తమ వాహనాలను ధరలను పెంచుతున్నట్టు ప్రకటించింది. మరోవైపు లగ్జరీ కార్ల కంపెనీ ఆడి కూడా ధరలను హెచ్చించనుంది. వచ్చే కొత్త ఏడాది జనవరి నుంచి ధరల పెంపు అమల్లోకి వస్తుందని ఇరు కంపెనీలు వేరు వేరు ప్రకటనల్లో తెలిపాయి. ద్రవ్యోల్బణం, ముడి సరకు ధరలు పెరగడంతో ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని మారుతి సుజుకి పేర్కొంది. జనవరి నుంచి ఈ ధరల పెంపు వర్తిస్తుందని సోమవారం ఆ కంపెనీ రెగ్యూలేటరీ వెల్లడించింది. మారుతి విక్రయిస్తున్న ఆల్టో నుంచి ఇన్‌విక్టో వరకు ధరల శ్రేణీ రూ.3.54 లక్షల నుంచి రూ.28.42 లక్షలుగా ఉన్నాయి. నిర్వహణ వ్యయాలు పెరిగిన నేపథ్యంలో తమ వాహన ధరలను 2 శాతం పెంచుతున్నట్లు ఆడి వెల్లడించింది. ఈ నిర్ణయం జనవరి 1 నుంచి అమల్లోకి వస్తుందని తెలిపింది. ముడి సరుకుల ధరల పెరుగుదలకు తోడు డీలర్ల మనుగడ కోసం ధరలను పెంచాల్సి వచ్చిందని ఆడి ఇండియా హెడ్ బల్బీర్ సింగ్ ధిల్లాన్ తెలిపారు. ఆడి కార్ల ధరలు రూ.42.77 లక్షల నుంచి రూ.2.22 కోట్ల మధ్య ఉన్నాయి.

ఈ ఏడాది 6.4 శాతం వృద్ధి

ఎస్అండ్‌పీ అంచనా



న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత వృద్ధి రేటు 6.4 శాతంగా ఉండొచ్చని ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ అంచనా వేసింది. ఇంతక్రితం 6 శాతం అంచనాతో పోల్చితే 40 బేసిస్ పాయింట్లు పెంచింది. కాగా.. 2024-25 జీడీపీ అంచనాలకు 50 బేసిస్ పాయింట్లు కోత పెట్టి.. 6.4 శాతంగా అంచనా వేసింది. అధిక ద్రవ్యోల్బణం, బలహీన ఎగుమతులు చోటు చేసుకున్నప్పటికీ దేశీయ డిమాండ్ పెరుగుదలతో ఈ ఏడాది జీడీపీకి మద్దతు లభించనుందని పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో ప్రపంచ వృద్ధిలో రేటులో మందగమనం చోటు చేసుకోవచ్చని పేర్కొంది. ఇందుకు అధిక వడ్డీ రేట్లు, భౌగోళిక ఆందోళనలు కారణమని పేర్కొంది. కాగా 2025-26లో భారత జీడీపీ 6.9 శాతం పెరుగొచ్చని పేర్కొంది.

జాక్ మా కొత్త కంపెనీ 'మా కిచెన్ ఫుడ్'



బీజింగ్ : చైనాకు చెందిన వ్యాపారవేత్త జాక్ వ్యవసాయ ఉత్పత్తులను ప్రాసెస్ చేసి విక్రయించే కొత్త కంపెనీని ప్రారంభించారు. 'హాంగ్జౌ మా కిచెన్ ఫుడ్' పేరుతో దీన్ని ఏర్పాటు చేశారు. 1.4 మిలియన్ డాలర్ల మూలధనంతో దీన్ని రిజిస్టర్ చేయించారని రిపోర్టులు వస్తున్నాయి. ప్యాకేజ్డ్ వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించనున్నారు. ప్రధానంగా రెడీ టు ఈట్ మీల్స్ విభాగంలో ప్రవేశిస్తున్నారని సమాచారం.

టీసీఎస్‌కు అమెరికన్ కోర్టు భారీ జరిమానా



న్యూయార్క్ : దిగ్గజ టెక్ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్)కు అమెరికన్ కోర్టులు వరుస షాక్‌లు ఇస్తున్నాయి. అక్కడి చట్టాలను అతిక్రమించడంతో తాజాగా అమెరికా డల్లాస్ కోర్టు 210 మిలియన్లను స్థానిక సంస్థ డిఎక్స్‌సి టెక్నాలజీకి వెంటనే చెల్లించాలని ఆదేశించింది. వారం క్రితం మరో కేసులో ఎపిక్ సిస్టమ్‌కు 140 మిలియన్ డాలర్ల జరిమానా చెల్లించాలని అమెరికా సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. వారం వ్యవధిలోనే ఈ రెండు తీర్పులు టిసిఎస్‌ను ఆందోళనకు గురి చేస్తున్నాయి. టిసిఎస్ అమెరికా చట్టాలను అతిక్రమించి వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తుందని.. మేధో సంపత్తిని తస్కరించడం, చేసుకున్న ఒప్పందాలను మధ్యలోనే రద్దు చేసుకోవడం తదితర నిబంధనలు అతిక్రమిస్తుందని టిసిఎస్‌తో ఒప్పందం చేసుకున్న అక్కడి సంస్థల ప్రధాన అరోపణ.

విద్యుత్ బస్ అమ్మకాలు పెరగొచ్చు : ఇక్రా

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో దేశంలోని మొత్తం బస్సుల అమ్మకాల్లో విద్యుత్ బస్సుల వాటా 11-13 శాతానికి చేరొచ్చుని రేటింగ్ ఎజెన్సీ ఇక్రా అంచనా వేసింది. అనేక రాష్ట్ర ప్రభుత్వాలు ఇవి బస్సులకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటుగా కొన్ని సంస్థలకు గడువు లక్ష్యాలను నిర్దేశించడంతో వీటి అమ్మకాలు పెరగనున్నాయని పేర్కొంది. గడిచిన 2022-23లో ఇవి బస్‌ల వాటా 7 శాతంగా ఉందని వెల్లడించింది. ఇ-బస్‌ల తయారీకి ప్రభుత్వాలు సబ్సీడీలు ఇవ్వడం, టెక్నాలజీ, పెట్టుబడుల వ్యయం తగ్గడంతో ఈ రంగానికి మద్దతు లభిస్తుందని ఇక్రా పేర్కొంది.

ఎడెల్విస్ టోక్యో లైఫ్‌కు ప్రతిష్ఠాత్మక గోల్డెన్ పీకాక్ అవార్డ్

నవతెలంగాణ హైదరాబాద్: వ్యాపార నాణ్యతను బలోపేతం చేయాలనే నిరంతర దృష్టితో, ఎడెల్విస్ టోక్యో లైఫ్ మోసపూరిత పద్ధతులను ముందుగానే తెలుసుకుని నివారించటానికి సంస్థలో ప్రమాద-చేతన సంస్కృతిని నడిపించడముతో సహా నూతన రిస్క్ మేనేజ్మెంట్ పద్ధతులను ప్రవేశపెట్టింది. ఎడెల్విస్ టోక్యో లైఫ్ ఇన్సూరెన్స్ , ఎక్సిక్యూటివ్ డైరెక్టర్ సుబ్రజీత్ ముఖోపాధ్యాయ్ మాట్లాడుతూ మోసపూరిత సంఘటనలు ఇటు వ్యాపారులకు ఎంత హానికరమో, వినియోగదారుడికి కూడా అంతే హానికరమే అని తెలిపారు. ఇవి ఉత్పత్తి ధరలు, బోనస్ పేఅవుట్స్, క్లెయిమ్ సెటిల్మెంట్ వంటి మరెన్నో అంశాలపై ప్రభావం చూపుతాయాన్నారు. మోసాలను ఎదుర్కొనేందుకు ఒక ఆటోమేషన్ లేదా రిస్క్ చేతన సంస్కృతి ద్వారా వినియోగదారులకు నూతన ఉత్తమమైన ఉత్పత్తులను, సేవలను కూడా అందించుటకు చాలా చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. ఈ ఏడాది లైఫ్ ఇన్సూరెన్స్ కు గోల్డెన్ పీకాక్ అవార్డ్ ఫర్ రిస్క్ మేనేజ్మెంట్ అందించబడింది. ఫోరం కార్పొరేట్ పరిపాలన, సుస్థిరత, ఈఎస్‌జి, రిస్క్ మేనేజ్మెంట్ పద్ధతుల కొరకు 370 స్పందనలు అందుకుంది.



కెప్టెన్ హార్దిక్ పాండ్య!

- త్వరలోనే ముంబయి ఇండియన్స్ పగ్గాలు
- అందుకే మళ్లీ పాత ఫ్రాంచైజీ గూటికి

ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత ఖరీదైన బదిలీ

హార్దిక్ పాండ్య.. భారత క్రికెట్‌లోనే కాదు ఐపీఎల్‌లోనూ ఇప్పడీ పేరు పెను సంచలనం. ఆటగాళ్ల బదిలీ కోసం ఫుట్‌బాల్ క్లబ్‌లు వందల కోట్లు కుమ్మరించటం చూశాం, కానీ ఐపీఎల్‌లో తొలిసారి ఆ సంప్రదాయానికి తెరతీశాడు హార్దిక్ పాండ్య. గుజరాత్ టైటాన్స్ కెప్టెన్‌గా అద్భుతాలు చేసిన హార్దిక్ పాండ్య.. ఐపీఎల్‌లో మాతృ ఫ్రాంచైజీ ముంబయి ఇండియన్స్‌కు వెళ్లిపోయాడు. రూ.15 కోట్ల వార్షిక వేతనంతో పాటు మరో రూ.15-20 కోట్ల ట్రాన్స్‌ఫర్ ఫీజు సైతం ముంబయి ఇండియన్స్ చెల్లించింది!. ఇటు గుజరాత్ టైటాన్స్‌లో, అటు ముంబయి ఇండియన్స్‌లో అంతా సవ్యంగా సాగుతుండగా అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తూ ఎందుకీ ఖరీదైన బదిలీ?!. ఇదే ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

శ్రీనివాస్ దాస్ మంతటి

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఐదుసార్లు చాంపియన్. లీగ్‌లో అత్యంత విజయవంతమైన సారథి రోహిత్ శర్మ ఆ జట్టు సొంతం. అత్యుత్తమ టీ20 బ్యాట్స్‌మన్ సూర్యకుమార్ యాదవ్, అత్యుత్తమ టీ20 బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా సహా ప్రపంచ శ్రేణి బ్యాటింగ్ లైనప్, ఆల్‌రౌండర్లు, బౌలింగ్ బృందం ముంబయి ఇండియన్స్ శిబిరంలో ఉన్నారు. బ్యాట్‌తో, బంతితో పాటు నాయకత్వం అంశంలోనూ ముంబయి ఇండియన్స్‌కు ఎటువంటి సమస్య లేదు. అయినా, రూ. 15 కోట్లు వార్షిక వేతనంతో పాటు రూ.15-20 కోట్ల వరకు బదిలీ ఫీజు చెల్లించి మరీ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యను ముంబయి ఇండియన్స్ తిరిగి తెచ్చుకుంది. అందుకు కనిపిస్తున్న ఏకైక కారణం, రోహిత్ శర్మ నాయకత్వ వారసుడి అన్వేషణ. ముంబయి ఇండియన్స్ ఫ్రాంచైజీ సన్నిహిత వర్గాలు సైతం ఇదే విషయాన్ని బలపరుస్తున్నాయి. హార్దిక్ పాండ్యను ఆహ్వానిస్తూ ముంబయి ఇండియన్స్ యాజమానులు నీతా అంబాని, ఆకాశ్ అంబాని సోషల్ మీడియా వేదికగా పోస్ట్‌లు పెట్టారు.


రోహిత్ వారసుడిగా

భారత క్రికెట్ జట్టు పగ్గాలను విరాట్ కోహ్లి త్యజించిన తర్వాత.. వైట్ బాల్ ఫార్మాట్‌లో ఇద్దరు కెప్టెన్లు వచ్చారు. వన్డేలకు రోహిత్ శర్మ, టీ20లకు హార్దిక్ పాండ్య రెగ్యులర్‌గా నాయకత్వం వహిస్తున్నారు. ఐపీఎల్ 2022, 2023 సీజన్లలో గుజరాత్ టైటాన్స్ నాయకుడిగా అద్భుత ఫలితాలు సాధించిన హార్దిక్ పాండ్య.. జాతీయ జట్టు నాయకుడిగా ప్రమోషన్ దక్కించుకున్నాడు. చెన్నై సూపర్‌కింగ్స్ నాయకుడిగా ఎం.ఎస్ ధోని నుంచి పగ్గాలు అందుకున్న రవీంద్ర జడేజా సైతం జాతీయ జట్టు నాయకత్వ రేసులో నిలిచాడు. కానీ సూపర్‌కింగ్స్‌ను నడిపించటంలో వైఫల్యం అతడిని నాయకత్వ గ్రూప్‌కు దూరం చేసింది. ఓవరాల్ కెరీర్‌లో ఏ స్థాయి క్రికెట్‌లోనూ కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టని హార్దిక్ పాండ్య ఏకంగా ఐపీఎల్‌లో అరంగేట్ర ఫ్రాంచైజీకి సారథ్యం వహించాడు. తొలి సీజన్‌లోనే టైటిల్ అందించాడు. రెండో సీజన్‌లో రన్నరప్‌గా నిలబెట్టాడు. టైటాన్స్ ఆడిన రెండు సీజన్లలో గ్రూప్ దశలో అగ్రస్థానంలోనే నిలిచింది. టైటాన్స్ సారథిగా ట్రాక్ రికార్డు హార్దిక్ పాండ్యకు భారత జట్టు కెప్టెన్సీ తెచ్చిపెట్టింది. ఇక ముంబయి ఇండియన్స్ కెప్టెన్ రోహిత్ శర్మ వచ్చే సీజన్ నాటికి 37 వసంతాలు పూర్తి కానున్నాయి. అతి త్వరలోనే ముంబయి ఇండియన్స్ నాయకుడి అన్వేషణ మొదలుపెట్టాలి. ఐపీఎల్ ఆరంభంలో ఎంతో మంది కెప్టెన్లను ప్రయోగించిన ముంబయి ఇండియన్స్ విజయవంతం కాలేదు. రోహిత్ శర్మ తర్వాత అదే పరిస్థితి తలెత్తితే ముంబయి ఇండియన్స్ మళ్లీ సమస్యల్లో చిక్కుకునే ప్రమాదం ఉంది. దీంతో ఫ్రాంచైజీ యాజమాన్యం హార్దిక్ పాండ్యపై కన్నేసింది. 2015 నుంచి ముంబయి ఇండియన్స్ డ్రెస్సింగ్‌రూమ్‌లో ఉన్న హార్దిక్ పాండ్య.. రోహిత్ శర్మ తర్వాత జట్టును నడిపేందుకు సమర్థ నాయకుడని విశ్వసించింది. ఈ సీజన్లో రోహిత్ శర్మ కెప్టెన్‌గా కొనసాగినా.. 2025 నుంచైనా పాండ్యకు పగ్గాలు అప్పగించనున్నారు. లేదంటే, రోహిత్ ఉండగానే హార్దిక్ పాండ్యకు నేరుగా పగ్గాలు అప్పగించినా అందులో ఎటువంటి ఆశ్చర్యం లేదు. 30 ఏండ్ల హార్దిక్ పాండ్య దీర్ఘకాలం ముంబయి ఇండియన్స్‌ను ముందుండి నడిపిస్తాడని ముంబయి ఇండియన్స్ గట్టిగా నమ్ముతోంది.

ఇక, గుజరాత్ టైటాన్స్ తరఫున హార్దిక్ పాండ్య ఆకట్టుకునే ప్రదర్శన చేశాడు. రెండు సీజన్లలో కలిపి 30 ఇన్నింగ్స్‌ల్లో 833 పరుగులు చేశాడు. సగటు 41.65 కాగా, స్ట్రయిక్‌రేట్ 13.49. బంతితోనూ 8.1 ఎకానమీతో 11 వికెట్లు పడగొట్టాడు. 2015లో ముంబయి ఇండియన్స్ రూ.10 లక్షల కనీస ధరకు హార్దిక్ పాండ్యను తొలిసారి ఎంచుకుంది. 2015, 2017, 2019, 2020 సీజన్లలో ఐపీఎల్ విజేతగా నిలిచిన ముంబయి ఇండియన్స్‌లో హార్దిక్ పాండ్య కీలక సభ్యుడు. 2021 వరకు ప్రతి సీజన్ వేలానికి ముందు హార్దిక్ పాండ్యను ముంబయి ఇండియన్స్ నిలబెట్టుకుంది. కానీ 2021 మెగా వేలం ముంగిట నలుగురు ఆటగాళ్లను మాత్రమే అట్టిపెట్టుకునే అవకాశం ఉండటంతో రోహిత్, బుమ్రా, సూర్య, పొలార్డ్‌లను నిలుపుకుంది. హార్దిక్, ఇషాన్ కిషన్‌ను తిరిగి వేలంలో తీసుకుంటామని భరోసా ఇచ్చింది. వేలానికి ముందే పాండ్య గుజరాత్ టైటాన్స్ గూటికి చేరగా.. వేలంలో ఇషాన్ కిషన్ కోసం ముంబయి రూ.15.25 కోట్లు వెచ్చించిన సంగతి తెలిసిందే.

బదిలీ హైడ్రామా

హార్దిక్ పాండ్య ట్రాన్స్‌ఫర్ నాటకీయంగా సాగింది. ఆదివారం సాయంత్రం గుజరాత్ టైటాన్స్ అట్టిపెట్టుకున్న జాబితాలో పాండ్య నిలిచాడు. బదిలీ కాంట్రాక్టు కుదిరినా సాంకేతిక కారణాలతోనే రిటెన్షన్ లిస్ట్‌లో పాండ్యను చేర్చినట్టు తెలిసింది. హార్దిక్ పాండ్య కోసం ముంబయి రూ.15 కోట్లు చెల్లించాలి. 11 మంది ఆటగాళ్లను వదిలేసిన ముంబయి రూ.15.25 కోట్లు జమ చేసింది. కానీ వేలంలో పోటీపడేందుకు మరేం డబ్బు ఉండదు. అందుకోసం కామెరూన్ గ్రీన్‌ను రాయల్ చాలెంజర్స్ బెంగళూర్‌కు బదిలీ చేసింది. పలు ఫ్రాంచైజీలతో ప్లేయర్ ట్రాన్స్‌ఫర్ కోసం ప్రయత్నాలు చేయగా.. చివరకు బెంగళూర్ ముందుకొచ్చింది. రూ.17.50 కోట్లకు కామెరూన్ గ్రీన్‌ను బెంగళూర్ దక్కించుకుంది. దీంతో ఈ సొమ్ముతో ముంబయి మినీ వేలానికి సిద్ధం కానుంది. హార్దిక్ పాండ్య, కామెరూన్ గ్రీన్ ట్రాన్స్‌ఫర్ అంశాన్ని బీసీసీఐ సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించింది.



హార్దిక్ నిర్ణయమే!

స్టార్ ఆల్‌రౌండర్, తెలివైన సారథి హార్దిక్ పాండ్యను ముంబయి ఇండియన్స్ కోరుకోవటంలో ఆశ్చర్యం లేదు. కానీ టైటిల్ తెచ్చిపెట్టిన కెప్టెన్‌ను గుజరాత్ టైటాన్స్ ఎందుకు వదులుకుందనే ప్రశ్న అభిమానుల్లో మెదులుతోంది. అందుకు సమాధానం గుజరాత్ టైటాన్స్ క్రికెట్ డైరెక్టర్ విక్రమ్ సోలంకి చెప్పాడు. 'ఫ్రాంచైజీ తొలి కెప్టెన్‌గా గుజరాత్ టైటాన్స్ రెండు సీజన్లలో విజయవంతం కావడానికి హార్దిక్ పాండ్య కృషి చేశాడు. ఇప్పుడే అతడే ముంబయి ఇండియన్స్‌కు వెళ్తానని కోరాడు. పాండ్య నిర్ణయాన్ని ఫ్రాంచైజీ యాజమాన్యం గౌరవించింది. భవిష్యత్‌లో అతడు మరింత విజయాలు సాధించాలని కోరుకుంటున్నాం' అని విక్రమ్ తెలిపాడు. ముంబయి ఇండియన్స్‌కు వెళ్లేందుకు హార్దిక్ పాండ్య నిర్ణయమే కీలకమని తెలుస్తోంది.

ఇక్కడే ముగిస్తారా?

- సిరీస్ విజయంపై సూర్యసేన గురి
- భారత్, ఆసీస్ మూడో టీ20 నేడు



గుహవటి : టీ20 సిరీస్‌లో హ్యాట్రిక్ విజయంపై కన్నేసిన టీమ్ ఇండియా.. గువహటిలోనే సిరీస్ సొంతం చేసుకోవాలని భావిస్తోంది. తొలి రెండు మ్యాచుల్లో ఆసీస్‌ను చిత్తు చేసిన భారత్ అన్ని రంగాల్లోనూ జోరు మీదుంది. మరోవైపు వరల్డ్‌కప్ హీరోలు వచ్చినా.. కంగారూల ప్రదర్శనలో పెద్ద మార్పు లేదు. ఈ మ్యాచ్‌లో ఓడితే.. సిరీస్ ఆశలు ఆవిరి కానుండగా ఆసీస్ చావోరేవో తేల్చుకునేందుకు తయారవుతోంది. భారత్, ఆసీస్ మూడో టీ20 నేడు రాత్రి 7 గంటలకు ఆరంభం కానుంది.

సిరీస్ పట్టేస్తారా?

యశస్వి జైస్వాల్, రుతురాజ్ గైక్వాడ్, ఇషాన్ కిషన్, సూర్య కుమార్, రింకూ సింగ్ అందరూ భీకర ఫామ్‌లో ఉన్నారు. వికెట్లకు ప్రాధాన్యత ఇవ్వని నయా ప్రణాళిక బాగా పని చేస్తోంది. భారత బ్యాటర్లకు కళ్లెం వేసేందుకు ఆసీస్ బౌలర్ల దగ్గర ప్రణాళికలు లేకుండా పోతున్నాయి. బంతితోనూ రెండో మ్యాచ్‌లో మనోళ్లు మెరిశారు. అక్షర్ పటేల్, ముకేశ్ కుమార్‌లు గొప్పగా రాణిస్తున్నారు. అర్షదీప్ సింగ్ సైతం మెరిస్తే పవర్‌ప్లేలో మరింత దూకుడు చూపించవచ్చు. తెలుగు తేజం తిలక్ వర్మ తనదైన ఇన్నింగ్స్ బాదేందుకు ఎదురు చూస్తున్నాడు. మరోసారి భారత్‌కు ఆరంభంలో యశస్వి జైస్వాల్, చివర్లో రింకూ సింగ్ కీలకం కానున్నారు.

టైటాన్స్ సారథిగా గిల్



ముంబయి : గుజరాత్ టైటాన్స్ కొత్త కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ (24) ఎంపికయ్యాడు. ఈ మేరకు టైటాన్స్ సోమవారం ప్రకటించింది. రూ.7 కోట్లకు టైటాన్స్‌కు సొంతమైన శుభ్‌మన్ గిల్ ఆ జట్టు బ్యాటింగ్ లైనప్‌ను నడిపిస్తున్నాడు. టైటాన్స్‌కు తొలి సీజన్లో 16 మ్యాచుల్లో 483 పరుగులు, రెండో సీజన్లో 17 ఇన్నింగ్స్‌ల్లో 890 పరుగులు చేశాడు గిల్. గత సీజన్లో మూడు సెంచరీలు బాదిన గిల్.. టైటాన్స్ విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. పాండ్య ముంబయికి వెళ్లటంతో యువ క్రికెటర్ గిల్‌ను కెప్టెన్సీ పగ్గాలు అందుకోనున్నాడు. కేన్ విలియమ్సన్, రషీద్ ఖాన్, డెవిడ్ మిల్లర్, మాథ్యూ వేడ్, వృద్ధిమాన్ సాహా వంటి సీనియర్ క్రికెటర్లకు యువ గిల్ నాయకుడిగా వ్యవహరించనున్నాడు.

మార్చి 2 నుంచి ఐఎస్‌పీఎల్

ముంబయి : గల్లీ క్రికెట్ మజాను ఫ్లడ్‌లైట్ల వెలుతురులో స్టేడియంలోకి తీసుకొచ్చేందుకు ఐఎస్‌పీఎల్ ముందుకొచ్చింది. మార్చి 2 నుంచి ఇండియన్ స్ట్రీట్ ప్రీమియర్ లీగ్ ముంబయిలో జరుగనుంది. టీ10 ఫార్మాట్‌లో టెన్నిస్ బాల్‌తో ఆడనున్న ఈ లీగ్‌లో హైదరాబాద్, ముంబయి, బెంగళూర్, చెన్నై, కోల్‌కత, శ్రీనగర్ ఫ్రాంచైజీలు పోటీపడనున్నాయి. లీగ్‌లో పోటీపడాలనుకునే ఔత్సాహిక క్రికెటర్లు డిసెంబర్ 20 నుంచి ఐఎస్‌పీఎల్ టీ10 వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ మేరకు నిర్వాహకులతో కలిసి భారత మాజీ చీఫ్ కోచ్ రవిశాస్త్రి సోమవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఐఎస్‌పీఎల్ లోగో, ట్రోఫీని ఆవిష్కరించారు.

ఏ రేంజ్ అనేది ప్రేక్షకులు డిసైడ్ చేస్తారు..



రణ్‌బీర్ కపూర్ హీరోగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న వైల్డ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'యానిమల్'. ఇందులో రణ్‌బీర్ కపూర్‌కు జోడిగా రష్మిక మందన్న కథానాయికగా నటించింది. అనిల్ కపూర్, బాబీ డియోల్ ఇతరకీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని భూషణ్ కుమార్, క్రిషన్ కుమార్ టి-సిరీస్, ప్రణయ్ రెడ్డి వంగా భద్రకాళి పిక్చర్స్ ప్రతిష్టాత్మకంగా నిర్మించాయి. ఈ చిత్రం డిసెంబర్ 1న హిందీ, తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం 5 భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ హైదరాబాద్‌లో గ్రాండ్‌గా ప్రెస్‌మీట్ నిర్వహించింది.

రణ్‌బీర్ కపూర్ మాట్లాడుతూ,'తెలుగు చిత్ర పరిశ్రమ నాకు ఎంతో ప్రత్యేకం. ఇక్కడ ప్రేక్షకులు సినిమాల పట్ల చూపించే ప్రేమ, ఆదరణ అద్భుతంగా ఉంటుంది. ఈ చిత్రంలో చాలా విలక్షణమైన పాత్ర చేశాను. నా పాత్ర చాలా ఇంటెన్స్‌గా ఉంటుంది. తన తండ్రి పట్ల విపరీతమైన ప్రేమ ఉన్న కొడుకు పాత్రలో కనిపిస్తాను. అలాగే ఈ చిత్రంలో నా భార్య గీతాంజలి పాత్రతో కూడా చాలా ఘాడమైన ప్రేమలో ఉంటాను. యానిమల్స్ అన్ ప్రెడిక్టబుల్‌గా ఉంటాయి. ఇందులో నా పాత్ర ఆ స్వభావంతో ఉంటుంది. యానిమల్ కథ, పాత్రలు అందరికీ కనెక్ట్ అవుతాయి' అని తెలిపారు. 'నా మొదటి చిత్రం 'వంశవృక్షం' ది గ్రేట్ బాపు దర్శకత్వంలో చేశాను. నా ఫౌండేషన్ సౌత్ పరిశ్రమలోనే పడింది. ఇప్పుడు నా రెండో తెలుగు సినిమాగా ఈ సినిమా విడుదల కావడం ఆనందంగా ఉంది. సందీప్ ఈ కథ చెప్పగానే మరో ఆలోచన లేకుండా ఒప్పుకున్నాను. ఈ కథని ఆయన అద్భుతంగా రాసుకున్నాడు. అందరూ ఇందులో ఎమోషన్స్‌కు కనెక్ట్ అవుతారు' అని అనిల్ కపూర్ అన్నారు.

రష్మిక మాట్లాడుతూ,'ఇది నాకు చాలా స్పెషల్ మూవీ. సందీప్ ఈ కథను, పాత్రలను అద్భుతంగా మలిచారు. ఈ సినిమా కోసం చాలా ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను' అని అన్నారు.

దర్శకుడు సందీప్ రెడ్డి మాట్లాడుతూ, 'తండ్రి కోసం కొడుకు ఎంత దూరం వెళ్ళగలడు అనేది ఈ కథ ప్రధాన సారాంశం. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. సినిమా హిట్ అవుతుంది. అయితే అది ఏ స్థాయిలో అనేది ఆడియన్స్ డిసైడ్ చేస్తారు. ఖచ్చితంగా సినిమా బాక్సాఫీస్ వద్ద వండర్స్ క్రియేట్ చేస్తుంది' అని చెప్పారు.

ప్రీ క్లైమాక్స్, క్లైమాక్స్‌ని ఎవ్వరూ ఊహించలేరు



మహేష్ రెడ్డి

క్రైమ్ సస్పెన్స్ థ్రిల్లర్‌లో క్లూస్ టీమ్ ప్రాముఖ్యతను చూపించేలా తెరకెక్కించిన చిత్రం 'అథర్వ'. నూతలపాటి నరసింహం, అనసూయమ్మ సమర్పణలో పెగ్గో ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిర్మించిన ఈ చిత్రంలో కార్తీక్ రాజు, సిమ్రాన్ చౌదరి, ఐరా హీరో,హీరోయిన్లుగా నటించారు. మహేష్ రెడ్డి దర్శకత్వం వహించగా, సుభాష్ నూతలపాటి నిర్మించారు. విజయ, ఝాన్సీ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్‌గా వ్యవహరించారు. డిసెంబర్ 1న ఈ చిత్రం థియేటర్లోకి రాబోతోంది.

ఈ సందర్భంగా మూవీ డైరెక్టర్ మహేష్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, 'ఈ కథ పుట్టడానికి మూలం క్లూస్ టీమ్ హెడ్ వెంకన్న ఇంటర్వ్యూని చూశాను. మామూలుగా ఓ క్రైమ్ జరిగినప్పుడు క్లూస్ టీమ్ చేసే పనే అధికంగా ఉంటుంది. వారు సేకరించేవే కోర్టులో సాక్ష్యాలుగా నిలబడతాయి. క్రైమ్ కేసుని 70 శాతం వరకు క్లూస్ టీమ్ పరిష్కరిస్తుం టుంది. అయితే క్లూస్ టీమ్ గురించి ఇంత వరకు ఎవ్వరూ చెప్పలేదు. వాళ్ల గురించి చెప్పాలని ఈ కథ రాసుకున్నాను. మర్డర్, రాబరీ సీన్లతో సినిమాను అల్లుకున్నాను. చాలా వరకు రియలిస్టిక్‌గా ఉంటుంది. యదార్థ సంఘటనలకు కూడా కొంచెం ఫిక్షన్ యాడ్ చేసి తీశాను. కార్తీక్ రాజు ఆల్రెడీ మూవీస్ చేశారు. సీనియర్ ఆర్టిస్టులు కూడా పని చేశారు. ఈ మూవీకి వారి అనుభవం బాగా కలిసి వచ్చింది. ఈ సినిమా సెకండ్ హాఫ్‌లో ప్రతీ పది నిమిషాలకు ఓ ట్విస్ట్ ఉంటుంది. ప్రీ క్లైమాక్స్, క్లైమాక్స్‌ను ఎవ్వరూ ఊహించరు. ఆ సీన్లకు ప్రేక్షుడికి ఫుల్ హై వస్తుంది. శ్రీచరణ్ పాకాల ప్రస్తుతం ఫుల్ ఫాంలో ఉన్నారు. ఆర్ఆర్ అద్భుతంగా ఇచ్చారు. పోలీస్ సైరన్ నుంచి కూడా ఓ మ్యూజిక్ క్రియేట్ చేశారు. ఆర్ఆర్‌తో పాటు మాకు మంచి మాస్, రొమాంటిక్, ఫోక్ సాంగ్స్ కూడా ఇచ్చారు. సీటు అంచున కూర్చోబెట్టేలా ఎంతో గ్రిప్పింగ్‌గా సినిమా ఉంటుంది. సస్పెన్స్ థ్రిల్లర్‌ను ఇష్టపడే ప్రేక్షకులే కాకుండా ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుంది. అన్ని కమర్షియల్ అంశాలతో తెరకెక్కించిన చిత్రమిది' అని తెలిపారు.

క్లూస్ టీమ్‌లో హీరో పని చేస్తుంటాడు. హీరోయిన్ క్రైమ్ రిపోర్టర్. కథలో భాగంగానే రెండు పాత్రలుంటాయే తప్ప కావాలని హీరో, హీరోయిన్ ట్రాక్ పెట్టలేదు. నిర్మాతలు ఫస్ట్ ఈ కథ విన్నప్పుడు హీరో, హీరోయిన్ల గురించి, టీమ్ గురించి చెప్పలేదు. వారికి ఈ కథ బాగా నచ్చడంతో ఎంతైనా పెట్టేందుకు ముందుకు వచ్చారు. సినిమా బాగా రావాలని ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మించారు.

నవచిత్రం

దొంగ, దేవుడు, దెయ్యం..



కె.హర్షవర్దన్, డి.వి.వి.దానయ్య

వరలక్ష్మీ శరత్ కుమార్ ప్రధాన పాత్రలో కె హర్షవర్దన్ దర్శకత్వంలో రూపొందనున్న యూనిక్ సోషియో ఫాంటసీ ఎంటర్టైనర్ 'కూర్మ నాయకి'. రోహన్ ప్రొడక్షన్స్, ఎంఎం క్రియేషన్స్, కాలభైరవ ప్రొడక్షన్ బ్యానర్స్ పై కె విజిత రావు నిర్మిస్తున్న ఈ సినిమా సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత డి వి వి దానయ్య క్లాప్ ఇచ్చారు. లౌక్య సాయి కెమెరా స్విచ్ ఆన్ చేయగా, బెక్కం వేణుగోపాల్ తొలి సన్నివేశానికి గౌరవ దర్శకత్వం వహించారు. హీరో తిరువీర్, శ్రీను గవి రెడ్డి మేకర్స్‌కు స్క్రిప్ట్ అందజేశారు. దర్శకుడు కె హర్షవర్దన్ మాట్లాడుతూ,'చాలా కొత్త కాన్సెప్ట్‌తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాం. ఒక దొంగ, దేవుడు, దెయ్యం నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది' అని అన్నారు. మణికాంత్ మాట్లాడుతూ,'ఇది మా మొదటి ప్రొడక్షన్. హర్ష వర్దన్ కథ చెప్పగానే చాలా నచ్చింది. అవుట్ పుట్ ఒక భారీ బడ్జెట్ సినిమాలానే ఉంటుంది' అని చెప్పారు. నిర్మాతలు మాట్లాడుతూ,'మంచి టెక్నికల్ టీంతో సినిమాని ఎక్కడా రాజీపడకుండా నిర్మిస్తున్నాం' అని తెలిపారు.

సరికొత్త లవ్‌స్టోరీ



పంఖురి గిద్వానీ, నవదీప్

నవదీప్ హీరోగా నటించిన 'లవ్ మౌళి'. అవనీంద్ర దర్శకుడు. నైరా క్రియేషన్స్, శ్రీకర స్టూడియోస్ బ్యానర్స్ నిర్మిస్తున్న ఈ చిత్ర టీజర్ సోమవారం విడుదలైంది.

ఈ సందర్భంగా నవదీప్ మాట్లాడుతూ,'నా ఆలోచన విధానానికి, నేను చేయాలనుకుంటున్న సినిమాలకు ఈ సినిమా దగ్గరగా అనిపించింది. అందుకే మీ ముందుకు సరికొత్త చిత్రంతో రాబోతున్నాను' అని చెప్పారు.

'నా లైఫ్‌లో జరిగిన ప్రేమకథలకు ఫలితమే ఈ సినిమా కథ. నా స్వీయ అనుభవాలే ఈ సినిమా కథ' అని దర్శకుడు అవనీంద్ర అన్నారు.

'నేను ఛాలెంజింగ్‌గా చేసిన సినిమా ఇది. నా లైఫ్‌లో నేను చేయలేను అనుకున్న సాహసాలు అన్నీ ఈ సినిమా షూటింగ్ టైమ్‌లో చేశాను. ప్రేమ గురించి ఎంతో నిజాయితీగా బ్యూటీఫుల్‌గా చెప్పిన లవ్‌స్టోరీ ఇది' అని కథానాయిక పంఖురి గిద్వానీ చెప్పారు. భావన సాగి, మిర్చి హేమంత్, మిర్చి కిరణ్ తదితరులు నటిస్తున్న ఈచిత్రానికి రచన -దర్శకత్వం, సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్ : అవనీంద్ర, సంగీత దర్శకులు: గోవింద్ వసంత.

వాటిల్లో ఇదే నెంబర్ వన్ సినిమా : నితిన్



వక్కంతం వంశీ, నితిన్

నితిన్ కథానాయకుడిగా వక్కంతం దర్శకత్వంలో శ్రేష్ఠ్ మూవీస్, ఆదిత్య మూవీస్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్స్, రుచిర ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్స్‌పై సుధాకర్ రెడ్డి, నికితా రెడ్డి నిర్మిస్తున్న అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్ 'ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్'. డిసెంబర్ 8న రిలీజ్ అవుతున్న ఈ సినిమా ట్రైలర్‌ను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగిన ప్రెస్‌మీట్‌లో నిర్మాత ఎన్.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ, 'మా సినిమా ట్రైలర్ రిలీజ్ ఈవెంట్‌కి మమ్మల్ని సపోర్ట్ చేయటానికి వచ్చిన అభిమానులు, ప్రేక్షకులకు థ్యాంక్స్. ఇప్పుడు సినిమా గురించి ఏం మాట్లాడను. రిలీజ్ తర్వాత మాట్లాడుతాను' అని అన్నారు.

'ట్రైలర్ అందరికీ నచ్చే ఉంటుంది. ఈ అవుట్‌పుట్ ఇవ్వటానికి నేను, నితిన్ రెండేళ్లు కష్టపడ్డాం. నిజానికి కష్టపడ్డామని చెప్పకూడదు. ఎందుకంటే అది మా బాధ్యత. అందరినీ ఎంటర్‌టైన్ చేయాలనేది మా లక్ష్యం. అందరి సపోర్ట్ కావాలి. ట్రైలర్ కంటే పదిమింతలు మించి సినిమా ఉంటుంది' అని డైరెక్టర్ వక్కంతం వంశీ చెప్పారు.

హీరో నితిన్ మాట్లాడుతూ, 'నటుడిగా నా 21 ఏళ్ల కెరీర్‌లో ఇది నా 32వ సినిమా. నేను చేసిన బెస్ట్ క్యారెక్టరైజేషన్ మూవీస్‌లో ఇది నెంబర్ వన్ అవుతుంది. వక్కంతం వంశీ రాసిన 'కిక్, రేసుగుర్రం, టెంపర్' సినిమాలన్నీ బావుంటాయి. వాటిన్నంటికీ తగ్గకుండా ఈ మూవీ ఉంటుంది. డిసెంబర్ 8న మూవీ రిలీజ్ అవుతుంది. ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయటమే ఈ మూవీ గోల్. నాన్ స్టాప్‌గా అందరినీ నవ్విస్తాం. స్క్రీన్ ప్లే కూడా కొత్తగా ఉంటుంది. మంచి కథ, పాటలు కూడా ఉంటాయి. అలాగే మంచి డాన్స్ కూడా ఉంటుంది. బాగా డాన్స్ చేసి చాలా కాలమవుతుంది. ఈ మూవీలో లాస్ట్ సాంగ్ మీ అందరినీ అలరిస్తుందని నమ్ముతున్నాను. డిసెంబర్ 8న హిట్ కొట్టబోతున్నాం. ఇది కన్‌ఫర్మ్.. రాసి పెట్టుకోండి' అని తెలిపారు.

ప్రతీ ఒక్కరికీ నచ్చేలా తెరకెక్కించా..



అరుణ్ విక్కిరాలా

సుడిగాలి సుధీర్ నటించిన తాజా చిత్రం 'కాలింగ్ సహస్ర'. షాడో మీడియా ప్రొడక్షన్స్, రాధా ఆర్ట్స్ పతాకాలపై అరుణ్ విక్కిరాలా దర్శకత్వంలో విజేష్ తయాల్, చిరంజీవి పమిడి, వెంకటేశ్వర్లు కాటూరి ఈ సినిమాను నిర్మిస్తు న్నారు. సుధీర్ సరసన డాలీషా హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రాన్ని డిసెంబర్ 1న గ్రాండ్ రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు అరుణ్ విక్కిరాలా మీడియాతో ముచ్చటించారు.

సుధీర్ క్యారెక్టర్‌కి కనెక్ట్ అవుతారు

కాలింగ్ అనేది కంపెనీ పేరు. సహస్ర అనేది హీరోయిన్ పాత్ర పేరు. కాలింగ్ సహస్ర అనేది కథలోంచి పుట్టిందే. సినిమాకు సరిపోయే టైటిల్ అనే పెట్టాం. సుధీర్‌ను ఇంత వరకు కమెడియన్‌గా చూశాం. అయితే ఈ సినిమా స్టార్ట్ అయిన తరువాత పది నిమిషాలకు సుధీర్ అనే వ్యక్తిని మీరు మరిచిపోతారు. ఆయన పోషించే పాత్రలోకి వెళ్తారు. పాత్రతో కనెక్ట్ అవుతారు. ఇది ఓ ప్రయోగమే. మీ అందరికీ నచ్చుతుందని భావిస్తున్నాను.

ఫైట్ మాస్టర్ క్లాప్స్ కొట్టారు

ఈ చిత్రంలో సుధీర్‌తో పాటు శివ బాలాజీ పాత్ర, డాలీషా క్యారెక్టర్‌లకు మంచి పేరు వస్తుంది. డాలీషా ఓ ఫైట్ సీక్వెన్స్ కూడా చేసింది. ఆమె చేసిన తీరు చూసి ఫైట్ మాస్టర్ క్లాప్స్ కొట్టారు.

అడివిశేష్ చేయాలి..

'గూఢచారి' టైంలో అడివి శేష్‌కి ఈ కథ చెప్పాను. ఆయన చేయాల్సిన ఈ సినిమా మిస్ అయింది. నేను ఎన్నో యాడ్స్ చేశాను. కరోనా టైంలో పోలీసులకు ఎన్నో డాక్యుమెంటరీస్ చేశాను. త్రీ మంకీస్ సినిమాకు రైటర్‌గా పని చేశాను. త్రీ మంకీస్ కంటే ముందే ఈ కథ సుధీర్‌కి చెప్పాను. నాకు ఎందుకు ఈ కథ చెబుతున్నారు.. నేను సెట్ అవుతానా? అని సుధీర్ చాలా ఆలోచించారు. త్రీ మంకీస్ టైంలో మేం ఇంకా క్లోజ్ అయ్యాం. ఆ తరువాత ఈ కథ స్టార్ట్ చేశాం.

నిర్మాతల సపోర్ట్‌కి హ్యాట్సాఫ్

నిర్మాతలు ఎంతో సహకరించారు. వారు లేకపోతే ఈ సినిమా ఇక్కడి వరకు వచ్చేది కాదు. డిసెంబర్ 1న వస్తున్నామంటే దానికి కారణం కూడా వారే. వారికి హ్యాట్సాఫ్ చెప్పాల్సిందే. ఈ చిత్రంలో చాలా ట్విస్టులుంటాయి. ఆ ట్విస్టులు అందరికీ తెలిసినా కూడా థియేటర్‌కు వచ్చి చూస్తారు. ఇందులో మంచి ప్రేమ కథ కూడా ఉంటుంది. అయితే దీనిలో నేరుగా సందేశం ఇవ్వం. కానీ అంతర్లీనంగా ఓ మెసెజ్ ఉంటుంది.

ఆర్ఆర్ వెంటాడుతుంది

అద్భుతమైన పాటలు మోహిత్ ఇచ్చారు. ఆర్ఆర్ రాబిన్ ఇచ్చారు. ప్రేక్షకుల్ని ఆర్ఆర్ వెంటాడుతూ ఉంటుంది. ఈ సినిమాను ప్రతీ ఒక్కరూ చూడొచ్చు.

ఆరోగ్యంగా ఉండాలంటే..?

ఈ రోజుల్లో ఆరోగ్యంగా జీవించడం ఓ పెద్ద సవాల్. మన చుట్టూ ఉన్న ఎన్నో అంశాలు మన ఆరోగ్యంపై చెడు ప్రభావం చూపిస్తున్నాయి. అందువల్ల ఆరోగ్యంగా ఉండేందుకు ఏం చెయ్యాలో తెలుసుకుందాం.

○ ఈ రోజుల్లో పిజ్జాలు, బర్గర్ల వంటివి తినడం సర్వసాధారణమైపోయింది. ఇంట్లో వండుకునే వీలు లేక చాలా మంది ఇలాంటి ఫుడ్‌కి అలవాటుపడిపోతున్నారు. కానీ ఆరోగ్యం కంటే ఏదీ ముఖ్యం కాదు. జంక్ ఫుడ్ బదులు పండ్లు, క్యారెట్ల వంటి కూరగాయలు తింటే ఎంతో మంచిది.

○ టైముకి తినడం, టైముకి పడుకోవడం ఎంత ముఖ్యమో... శరీరాన్ని ఫిట్‌గా ఉంచుకోవడమూ అంతే ముఖ్యం. వ్యాయామం చేస్తే శరీరంలో వృథాగా ఉన్న కొవ్వు కరుగుతుంది. శరీరంలోని వివిధ భాగాలు ఎంత సైజులో ఉండాలో అంత సైజుకి వచ్చేస్తాయి. అదే వ్యాయామం చెయ్యకపోతే... కొన్ని శరీర భాగాల్లో కొవ్వు అదనంగా పెరిగి... అనారోగ్యాలకు కారణమవుతాయి. నడక, పరుగు, స్విమ్మింగ్ ఇవన్నీ ఒత్తిడి పోగొట్టి ఫిట్ నెస్ పెంచుతాయి.



○ మనందరం బాగా కష్టపడతాం. కానీ సరిగా నిద్రపోం. నిజానికి రాత్రి 8 గంటలకే పడుకొని ఉదయం 4 గంటలకు లేవడం సరైన పద్ధతి. కానీ ఈ రోజుల్లో చాలా మంది రాత్రి 12కి పడుకొని తెల్లారి ఆరుకే లేచిపోతున్నారు. రోజూ అదే సమయం కాకుండా వేర్వేరు టైమ్స్‌లో పడుకుంటున్నారు. ఇవన్నీ ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. రోజుకు కనీసం 7 గంటలు పడుకోవాలి. 8 గంటలు పడుకుంటే ఇంకా బెటర్. నిద్ర సరిగా లేకపోతే బుర్ర హీటెక్కిపోతుంది. మతిమరపు మొదలవుతుంది. చిరాకు వస్తుంది. శరీరంలో ఇన్సులిన్ ఉత్పత్తి తగ్గిపోయి, షుగర్ వ్యాధి వస్తుంది. హార్మోన్లు దెబ్బతిని అడ్డమైన రోగాలూ వస్తాయి. అన్నింటికీ చెక్ పెట్టాలంటే చక్కగా నిద్రపోవాలి.

○ ప్రాసెస్ చేసిన ఫుడ్ పక్కన పెట్టి ఫైబర్, ప్రోటీన్, విటమిన్స్ బాగా ఉండేవి తినాలి. అంటే చేపలు, గుడ్లు తినవచ్చు. శాఖాహారులైతే అవకాడో, క్యారెట్లు, పాలకూర వంటివి తినవచ్చు. బెర్రీస్, కమలాలు, దానిమ్మకాయలు లాంటి పండ్లు తింటే ఆరోగ్యమే ఆరోగ్యం.

○ మనకు సుగంధ ద్రవ్యాలు చాలా ఎక్కువ. వీటిలో మంచి రుచి మాత్రమే కాదు ఆరోగ్యాన్ని కాపాడే చాలా యాంటీ ఆక్సిడెంట్స్, యాంటీ ఇన్ఫమేటరీ గుణాలున్నాయి. సూక్ష్మక్రిములతో అవి పోరాడతాయి. అందువల్ల మనం వంటల్లో తప్పనిసరిగా పసుపు, అల్లం, వెల్లుల్లి, చింతపండు, లవంగాలు, దాల్చిన చెక్క, ఆవాలు, ధనియాలు... లాంటివి తప్పనిసరిగా వాడాలి.



○ శరీరానికి రాత్రంతా రెస్ట్ ఇస్తాం కాబట్టి తెల్లారే మన శరీర భాగాలన్నీ ఉత్తేజంతో ఉంటాయి. ఆ టైంలో వాటికి ఆహారం ఇస్తే బాగా పనిచేస్తాయి. అందుకే ఉదయం లేచిన రెండు, మూడు గంటల్లో బ్రేక్ ఫాస్ట్ కాస్త ఎక్కువ తినాలి. మధ్యాహ్నం కాస్త తక్కువ తినాలి. రాత్రికి ఇంకా తక్కువ తినాలి.

○ డ్రై ఫ్రూట్స్ రేటు ఎక్కువ కాబట్టి గింజలు, పప్పులు వంటివి తినాలి. అలాగే పల్లీలు, బఠాణీలు, శనగలు, బీన్స్, మొక్కజొన్న లాంటివి కాస్త ఎక్కువే తినవచ్చు. ఇవన్నీ మనల్ని ముసలితనం రాకుండా కాపాడేస్తాయి.

○ మన బాడీలో మంచికొవ్వు, చెడ్డ కొవ్వూ రెండూ ఉంటాయి. మంచి ఆహారం తింటే మంచి కొవ్వు తయారవుతుంది. అది మనకు ఎంతో మేలు చేస్తుంది. అదే ఎక్కువగా నూనెలో వేయించిన ఫ్రైలు తింటే... చెడ్డ కొవ్వు గూడు కడుతుంది. అది చాలా ప్రమాదం. దాని వల్ల సర్వ రోగాలూ వస్తాయి. చర్మం పాడవుతుంది. జుట్టు రాలిపోతుంది. జీర్ణక్రియ దెబ్బతింటుంది. షుగర్, బీపీ, హార్ట్ ఎటాక్ ఇలా ఎన్నో రోగాలు వస్తాయి. అందుకే మంచి ఆహారం తినాలి. ఎక్కువగా ఉడికించినవి తినాలి.



○ కొంతమంది పని రాక్షసుల్లా పనిచేస్తారు. పని తప్ప మరో లోకం వాళ్లకు తెలియదు. అలా ఉండకూడదు. పని టైంలో పని చెయ్యాలి. రోజులో మూడు నాలుగు గంటలు రిలాక్స్ అయ్యేందుకు కూడా వీలు కల్పించుకోవాలి. మరీ ఎక్కువ టెన్షన్లు పెట్టుకోకూడదు. మాటిమాటికీ టెన్షన్ వద్దు. కూల్ కూల్ అనుకుంటూ మనసును తేలిక చేసుకోవాలి. టీవీల్లో మొబైళ్లలో కామెడీ సీన్ల వంటివి చూడాలి. దాంతో టెన్షన్లు కాస్త తగ్గుతాయి.

○ ఇళ్లలో, ఆఫీసుల్లో డోర్లన్నీ మూసేసుకొని ఏసీల్లో జీవిస్తే అంతా నష్టమే. బయటి నుంచీ వచ్చే గాలిలో ఆక్సిజన్ ఎక్కువ. అది మన మెదడుకి చాలా అవసరం. అది అందేలా చెయ్యాలి. మొక్కలు, చెట్ల మధ్య నడవాలి. వీలైనంతవరకూ ప్రకృతిలో జీవించేందుకు ప్రయత్నించాలి. అప్పుడు ఆరోగ్యమే ఆరోగ్యం.



న్యాయవ్యవస్థలో

చెరగని ముద్ర

ఉన్నత స్థానానికి ఎన్నికైన తొలి ముస్లిం మహిళగా అరుదైన ఘనత సాధించారు. సుప్రీంకోర్టులో తొలి మహిళా జడ్జిగా చరిత్ర సృష్టించారు. రిటైరైన తర్వాత జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలిగా పనిచేశారు. అంతేకాదు తమిళనాడు గవర్నర్‌గానూ సేవలందించారు. బార్ కౌన్సిల్ పరీక్షల్లోనూ అగ్రస్థానంలో నిలిచి బార్ కౌన్సిల్ గోల్డ్ మెడల్ గెలుచుకున్న తొలి మహిళగా నిలిచారు. ఆమే జస్టిస్ ఫాతిమా బీవీ. ఆడపిల్లలు అడుగుబయట పెట్టని కాలంలోనే ఓ ముస్లిం కుటుంబంలో పుట్టి అంచెలంచలుగా ఎదుగుతూ ఎంతో మంది మహిళలకు స్ఫూర్తిగా నిలిచిన ఆమె తన 96 ఏండ్ల వయసులో ఈ నెల 23న తుదిశ్వాస విడిచారు.



1927 ఏప్రిల్ 30న కేరళలోని పతనంతిట్టలో జన్మించారు. తల్లి ఖదీజా బీబీ, తండ్రి మీరాన్ సాహిబ్. తన పాఠశాల విద్యను పాతనంతిట్టలోని కాథోలికెట్ హైస్కూల్లో పూర్తి చేశారు. త్రివేండ్రంలో బీఎస్సీ చదివారు. తండ్రి ప్రోత్సాహంతో త్రివేండ్రం లా కాలేజీ నుండి బ్యాచిలర్ ఆఫ్ లా పట్టా అందుకున్నారు. తన తరగతిలో న్యాయ విద్యను అభ్యసించిన ఐదుగురు విద్యార్థుల్లో అమ్మాయి ఫాతిమా ఒక్కరే. ఆనాటి కాలంలో పురుషాధిక్య వృత్తిని ఎంచుకున్న ఆమె అనేక సవాళ్లను ఎదుర్కోవలసి వచ్చింది. అలాగే తన ఏడుగురు తోబుట్టువల కోసం పెండ్లి చేసుకోకూడదని నిర్ణయించుకుని ఒంటరి జీవితాన్నే గడిపారు.

కొత్త తరాన్ని ప్రేరేపించాయి

సవాళ్లను ఎదుర్కొంటూ న్యాయవాద వృత్తిలో కొనసాగుతూ ఫాతిమా ఎన్నో విజయాలు సాధించారు. ఈ రంగంలో ఆమె ఎక్కిన మెట్లు ఔత్సాహిక మహిళలకు చట్టంలో ప్రవేశం సుగమం చేశాయి. న్యాయ రంగంలో వృత్తిని కొనసాగించడానికి కొత్త తరాన్ని ప్రేరేపించాయి. 1950న న్యాయవాదిగా పేరు నమోదు చేసుకున్న న్యాయమూర్తి ఫాతిమా న్యాయవ్యవస్థలో తనకంటూ చెదరని ముద్ర వేసుకున్నారు. 1950లో బార్ కౌన్సిల్ పరీక్షల్లో అగ్రస్థానంలో నిలిచారు. మే 1958లో ఆమె కేరళ సబ్-ఆర్డినేట్ జ్యుడీషియల్ సర్వీసెస్‌లో మున్సిఫ్‌గా నియమితులయ్యారు. బెంచ్‌పై ఆమె విశిష్ట సేవకు నాంది పలికారు. నిజాయితీతో కూడిన ఆమె పనితీరు వరుస పదోన్నతులకు దారితీసింది. 1968లో సబ్-ఆర్డినేట్ న్యాయమూర్తిగా, 1972లో చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌గా, 1974లో జిల్లా అండ్ సెషన్స్ జడ్జిగా నియమితులయ్యారు.

పదవీ విరమణ తర్వాత

1992న పదవీ విరమణ చేసిన తర్వాత జస్టిస్ ఫాతిమా 1997లో తమిళనాడు గవర్నర్‌గా నియమితులయ్యారు. రాజీవ్ గాంధీ హత్య కేసులో శిక్ష అనుభవిస్తున్న నలుగురు ఖైదీలు దాఖలు చేసిన క్షమాభిక్ష పిటిషన్లను రాష్ట్ర గవర్నర్‌గా ఆమె తిరస్కరించారు. అయితే విధిలేని సంఘటనతో ఫాతిమా బీవీ తన గవర్నర్ పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఆమె జాతీయ మానవ హక్కుల కమిషన్(1993) సభ్యురాలిగా, కేరళ వెనుకబడిన తరగతుల కమిషన్ (1993) ఛైర్మన్‌గా కూడా పనిచేశారు. 1990లో డి లిట్, మహిళా శిరోమణి అవార్డు, భారత్ జ్యోతి అవార్డు, యుఎస్-ఇండియా బిజినెస్ కౌన్సిల్ (USIBC) లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును అందుకున్నారు.

రాబోయే తరాలకు స్ఫూర్తి



అడ్డంకులను బద్దలు కొట్టడం, సమానత్వాన్ని సాధించడం కోసం అంకితమైన జీవితానికి ఆమె నిదర్శనం. న్యాయం, సమానత్వం కోసం ఆమె పడిన తపన ఎంతో స్ఫూర్తిదాయకం. మరో ముఖ్య విషయం ఏమిటంటే సుప్రీం కోర్టు 71 ఏండ్ల ప్రస్థానంలో 1989లో ఫాతిమా మొదలుకుని కేవలం ఎనిమిది మంది మహిళలే న్యాయమూర్తులుగా నియమితులయ్యారు. ఇటువంటి గొప్ప వ్యక్తి న్యాయ రంగానికి, మహిళల హక్కుల కోసం ఆమె చేసిన కృషి రాబోయే తరాలకు స్ఫూర్తినిస్తుంది.

మరో శిఖరాగ్రానికి...

న్యాయమూర్తిగా ఫాతిమా నైపుణ్యం, అంకితభావానికి మంచి గుర్తింపు వచ్చింది. జనవరి 1980లో ఆమె ఆదాయపు పన్ను అప్పిలేట్ ట్రిబ్యునల్‌లో న్యాయ సభ్యురాలుగా నియమితులయ్యారు. 1983లో హైకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందడంతో తన కెరీర్‌లో మరో శిఖరాగ్రానికి చేరుకున్నారు. 1984న హైకోర్టు శాశ్వత న్యాయమూర్తిగా ఆమె నియామకం తన న్యాయ జీవితంలో ఒక ముఖ్యమైన అధ్యాయంగా నిలిచింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తి అయిన మొట్టమొదటి మహిళగా మాత్రమే కాకుండా ఉన్నత న్యాయవ్యవస్థలో మొదటి ముస్లిం మహిళగా, ఆసియా దేశంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి అయిన మొదటి మహిళగా కూడా ఆమె నిలిచారు.

బీఆర్ఎస్, బీజేపీల ఛోటాభాయ్ ఎంఐఎం

(మొదటిపేజీ తరువాయి)

మహబూబ్‌నగర్ జిల్లాలోని గద్వాల, కోస్గి నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించిన కాంగ్రెస్ అభ్యర్థుల ఎన్నికల ప్రచార సభలు, రోడ్‌షోల్లో ప్రియాంకగాంధీ ప్రసంగించారు. భువనగిరి నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి గెలుపును కాంక్షిస్తూ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశి ప్రియాంక మాట్లాడుతూ.. రెండు సార్లు అధికారం ఇస్తే బీఆర్ఎస్ ఏం చేసిందని ప్రశ్నించారు. ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని, అవినీతి ఆకాశాన్నంటిందని చెప్పారు. మహిళలపై లైంగికదాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత చిరు, మధ్యతరగతి వ్యాపారులు అనేక అవస్థలు పడ్డారని తెలిపారు. యువజనుల ఆశలు నెరవేరలేదని, వారి కలలు సాకారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తే భూమాఫియా పెరిగిపోతుందని చెప్పారు. కాంగ్రెస్‌కు ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా, రింగ్ రోడ్డు వేలంపాట ద్వారా అవినీతికి శ్రీకారం చుట్టారని ప్రియాంకగాంధీ విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీపై ఎంఐఎం నేతలు తల తిక్క ఆరోపణలు చేస్తున్నారని, కానీ, రాహుల్ ప్రజల్లో ఒక శక్తిగా ఎదిగారని చెప్పారు. దేశ ప్రజల ఆశీస్సులు ఉన్నంత వరకు ఆయన్ని ఎవరూ ఏమీ చేయలేరన్నారు.

లౌకిక మార్గాన నడిచే కాంగ్రెస్‌ను గెలిపించండి..

కులమతాలకతీతంగా పరిపాలన అందించే కాంగ్రెస్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రియాంక గాంధీ పిలుపునిచ్చారు. గద్వాల, కోస్గి నియోజకవర్గ కేంద్రాల్లో ఎన్నికల ప్రచారంలో ఆమె ప్రసంగించారు. ప్రాజెక్టులలో అవినీతి, కమీషన్లు పరాకాష్టకు చేరడం వల్లే నాసిరకమైన పనులతో కాళేశ్వరం కుంగిపోయిందన్నారు. ప్రధాని మోడీ పేదల భూములను, డబ్బును అదానీ వంటి పారిశ్రామికవేత్తలకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. దేశ ప్రజలకు మోడీ పాలనలో ఉపాధి కరువైందన్నారు. ఎన్నికలకు ముందు మాయ మాటలు చెప్పే నాయకులను తిరస్కరించాలని ఆమె ఓటర్లను కోరారు. తెలంగాణలో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్‌కు ఎవరూ సాటిరారన్నారు. కార్యక్రమంలో రేవంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుబంధుకు ఈసీ బ్రేక్

(మొదటిపేజీ తరువాయి)

రైతుబంధు పంపిణీకి ఈసీ అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. ఈనెల 28వ తేదీ లోపు రైతులకు రైతుబంధు చెల్లించాలని షరతు విధించింది. దానితో పాటు రైతుబంధు సొమ్ము రైతుల ఖాతాల్లో పడే అంశాన్ని ఎన్నికల ప్రచారంలో ప్రస్తావించ వద్దనీ, ప్రచారం ముగిశాక, పోలింగ్ జరిగే 30వ తేదీ కూడా పంపిణీ చేయొద్దనీ, ఎలక్షన్ కోడ్ ఉల్లంఘించకుండా పంపిణీ జరగాలని షరతులు విధించింది. అయితే ఈనెల 25,26,27 తేదీల్లో బ్యాంకులకు వరుస సెలవులు ఉన్నాయి. దీనితో 28వతేదీ (మంగళవారం) ఉదయం రైతులు ఇండ్లలో టీ తాగడానికంటే ముందే వారి ఖాతాల్లో రైతుబంధు సొమ్ములు పడి, ఫోన్లు టింగ్, టింగ్ అని మోగుతాయంటూ ఆర్థిక, ఆరోగ్యశాఖ మంత్రి టీ హరీశ్‌రావు ఈనెల 25వ తేదీ నర్సంపేట నియోజకవర్గంలోని నెక్కొండలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో వ్యాఖ్యానించారు. దీన్ని ఈసీ సీరియస్‌గా తీసుకుంది. తాము విధించిన షరతులు ఉల్లంఘించి, ఎన్నికల ప్రచారంలో రైతుబంధు అంశాన్ని ప్రస్తావించినందున ఈనెల 24న ఇచ్చిన అనుమతిని రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది. దీనితో రాష్ట్రంలో మరోసారి రాజకీయ వేడి భగ్గుమంది. రైతుబంధు రద్దు అంశం తెలియగానే... మంత్రి హరీశ్‌రావు వల్లే రైతుబంధు ఆగిందనీ, ప్రభుత్వ ఆర్థిక సాయాన్ని ఓట్ల కోసం వాడుకునే కక్కుర్తికి పాల్పడ్డారంటూ పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి ట్విట్టర్ వేదికగా స్పందించారు. కాంగ్రెస్ ఫిర్యాదుల వల్లే రైతుబంధు ఆగిందంటూ ఆపద్ధర్మ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖరరావు, మంత్రులు టీ హరీశ్‌రావు, కే తారక రామారావు, ఎమ్మెల్సీ కవిత తదితరులు వేర్వేరు వేదికలపై ప్రకటనలు చేశారు. రైతుబంధు నిలిపివేతకు కాంగ్రెస్, బీఆర్ఎస్ కారణమని బీజేపీ వ్యాఖ్యలు చేసింది. అయితే రైతుబంధు నిలిపివేత ఉత్తర్వుల్లో కేంద్ర ఎన్నికల సంఘం మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యల్నే ప్రస్తావించింది తప్ప, ఎక్కడా కాంగ్రెస్ పేరు లేకపోవడం గమనార్హం.

చరిత్రను తిరగరాద్దాం

నవతెలంగాణ- మిర్యాలగూడ

ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని ధ్వంసం చేసి దేశాన్ని సర్వనాశనం చేసేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని, మోడీని గద్దె దించితేనే దేశానికి భవిష్యత్తు ఉందని సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. దాని కోసం అందరూ కంకణబద్ధులు కావాలని తెలిపారు. సోమవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో వేములపల్లి నుంచి వాడపల్లి వరకు వేలాది వాహనాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. హనుమాన్ పేట ఫ్లైఓవర్ బ్రిడ్జి నుండి రాజీవ్ చౌక్ వరకు రోడ్ షో సాగింది. రెడ్‌షర్టులు ధరించి అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు. మిర్యాలగూడ ఎరుపుమయమయింది. ఓపెన్‌టాప్ జీపులో ఏచూరి, జూలకంటి రంగారెడ్డి ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. అనంతరం రాజీవ్‌చౌక్‌లో జరిగిన కర్నార్ మీటింగ్‌లో ఏచూరి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం దేశ సంపదలను కార్పొరేట్ శక్తులకు అప్పనంగా అప్పజెప్పుతూ ప్రజాసంక్షేమాన్ని మరిచిందని విమర్శించారు. దేశంలో ధరలు పెరిగిపోయి సామాన్య ప్రజలు అల్లాడిపోతున్నారని, కొనుగోలు శక్తి రోజురోజుకూ పడిపోతుందని చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని రాజ్యాంగాన్ని, పౌర హక్కులను రద్దు చేసి తమ సొంత ఏజెండాను ప్రజలపై రుద్దేందుకు చూస్తోందని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. దీనికోసం ప్రజలందరూ ఏకమై భవిష్యత్తులో పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. పేదలకు ఆహార భద్రత అందకుండా పాలకులు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి ఎర్రజెండాతోనే సాధ్యమవుతుందని తెలిపారు. నేడు పాలకులు రాజకీయాన్ని వ్యాపారంగా మార్చారని, డబ్బు ఉన్న వారే పోటీ చేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. పదవుల కోసం పార్టీల ఫిరాయింపులు చేస్తున్నారని, అలాంటి వారిని ఎన్నికల్లో ఓడించి బుద్ధి చెప్పాలన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా ఏర్పడిన ఇండియా కూటమిలో తమ పార్టీ ఉందని, తెలంగాణలో కాంగ్రెస్‌తో పొత్తు కుదరకపోవడానికి కాంగ్రెస్సే కారణమని చెప్పారు. అనివార్య పరిస్థితుల్లోనే సీపీఐ(ఎం) ఒంటరిగా పోటీ చేయాల్సి వచ్చిందన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడటంలో ఎన్నికలు ఎంతో కీలకంగా ఉన్నాయని, రాష్ట్రవ్యాప్తంగా 19 చోట్ల పోటీ చేస్తున్న సీపీఐ(ఎం) నాయకులను గెలిపించి చట్టసభలకు పంపించాలని కోరారు. మీకోసం మీ రంగన్నను గెలిపించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు తీగల సాగర్, శ్రీరామ్ నాయక్, రమ, ఎంవీ రమణ, నారి ఐలయ్య, డబ్బికార్ మల్లేష్, జిల్లా నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవి నాయక్, డాక్టర్ మల్లు గౌతంరెడ్డి, భవాండ్ల పాండు, నూకల జగదీష్ చంద్ర, పరశురాములు, ఐలూ రాష్ట్ర కార్యదర్శి అనంతుల శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ తెరపైకి సీఏఏ

- **2024 మార్చి 30 నాటికి తుది ముసాయిదా సిద్ధం : కేంద్ర మంత్రి అజయ్ మిశ్రా**

న్యూఢిల్లీ : సార్వత్రిక ఎన్నికల్లో మతరాజకీయాలు చేయటానికి మళ్లీ తెరపైకి సీఏఏ అంశాన్ని తెరపైకి తేనున్నది. వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) తుది ముసాయిదా వచ్చే ఏడాది మార్చి 30 నాటికి సిద్ధమవుతుందని భావిస్తున్నట్టు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి అజయ్ మిశ్రా తెలిపారు. పశ్చిమబెంగాల్‌లోని నార్త్ 24 పరగణాస్ జిల్లాలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పశ్చిమ బెంగాల్‌లోని మతువా కమ్యూనిటీని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ వారి నుంచి పౌరసత్వ హక్కులను ఎవరూ లాక్కోలేరని నొక్కి చెప్పారు. "సీఏఏను అమలు చేసే ప్రక్రియ గత రెండేండ్లలో ఊపందుకున్నది. కొన్ని సమస్యలు పరిష్కారమవుతున్నాయి. మతువాల నుంచి పౌరసత్వ హక్కులను ఎవరూ లాక్కోలేరు. వచ్చే ఏడాది మార్చి నాటికి సీఏఏ తుది ముసాయిదా అమల్లోకి రావడానికి సిద్ధంగా ఉంటుందని భావిస్తున్నాం" అని తెలిపారు.

అంతా మోడీనే...

(మొదటిపేజీ తరువాయి)

కారణం.. తనను తాను 'అభివృద్ధి మనిషి(వికాస్‌పురుష్)'గా చూపించుకోవడమేనని చెప్తున్నారు. ఒకవేళ అవసరమనుకుంటే బీజేపీకి ఆయుధమైన మతం అనే సున్నితమైన అంశాన్ని ప్రధాని హోదాలో ప్రస్తావించి కాషాయపార్టీకి ఓట్లు తీసుకురావటమూ ఒక వ్యూహమని రాజకీయ విశ్లేషకులు వివరిస్తున్నారు. మోడీ.. కర్నాటక ఎన్నికల్లో 'భజరంగ్‌బలి' అంటూ భజరంగ్‌దళ్‌కు అనుకూలంగా నినాదాలు తీసుకు వచ్చాడనీ, అయినప్పటికీ ప్రజల్లో అనుకున్నంత స్పందన రాకపోగా.. ఆ ఎన్నికల్లో కాషాయపార్టీ చతికలపడిందని వారు గుర్తు చేస్తున్నారు.

'మోడీ మీద ఆధారపడితే బీజేపీకి నష్టమే'

మోడీ కేంద్రంగా సాగే ఈ తరహా ప్రచారం వల్ల .. భవిష్యత్తులో బీజేపీ రాజకీయంగా తీవ్ర నష్టాన్ని ఎదురు చూడక తప్పదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. బీజేపీలో మోడీకి ప్రత్యామ్నాయంగా ఎవరూ లేరనీ, అసెంబ్లీ, స్థానిక ఎన్నికలకు సైతం ఆయనే రావాల్సిన పరిస్థితులు ఆ పార్టీలో ఏర్పడ్డాయని చెప్తున్నారు. అయితే, ప్రధాని స్థాయిలో ఆయన తన శక్తినంతా వినియోగించినప్పటికీ.. కాషాయపార్టీకి చేదు ఫలితాలే ఎదురవుతున్నాయని రాజకీయ విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. మోడీ వేవ్ ఉన్నదని చెప్తున్న సమయంలో 2015లో ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ ఘోరంగా ఓడిపోయిందని చెప్తున్నారు. ఆ పార్టీ 31 సీట్ల నుంచి కేవలం మూడు స్థానాలకు పడిపోయిందని గుర్తు చేస్తున్నారు. ఆ తర్వాత వచ్చిన బీహార్ ఎన్నికల్లోనూ బీజేపీ అధికారాన్ని చేజిక్కించుకోలేకపోయిందని అంటున్నారు.

'ఆయన తిరుగులేని రాజకీయ శక్తి కాదు'

దేశ రాజకీయాల్లో తిరుగులేని శక్తి అంటూ బీజేపీ, దాని అనుకూల మీడియా చేస్తున్న ప్రచారాలు ఉట్టి మాటలేననీ, ఇందుకు పలు రాష్ట్రాల్లో మోడీ ప్రచారం చేస్తున్నప్పటికీ.. కాషాయ పార్టీ ఓటమిపాలవుతుండటమే నిదర్శనమని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లతో పాటు మణిపూర్, మేఘాలయా వంటి ఈశాన్య రాష్ట్రాలలో మోడీ ప్రధాన ప్రచారకర్తగా ఉన్నప్పటికీ బీజేపీ ఓడిపోయిందంటున్నారు.

'ఫిరాయింపులతో అధికారం'

ఆయా రాష్ట్రాల ఎన్నికలలో ఓడిపోయిన తర్వాత కూడా కేంద్రంలో ఉన్న తన అధికార బలాన్ని ఉపయోగించి ఫిరాయింపుల ద్వారా ప్రతిపక్ష పార్టీలను విచ్ఛిన్నం చేసిన బీజేపీ విధానాన్ని రాజకీయ విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. ముఖ్యంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని పడగొట్టడానికి అధికార పార్టీ శాసనసభ్యులను 'కొనుగోలు' చేయడం ద్వారా పలు రాష్ట్రాల్లో బీజేపీ అధికారాన్ని చేజిక్కిచ్చుకున్నదని అంటున్నారు. మణిపూర్, మధ్యప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్ర ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత కూడా కాంగ్రెస్ పార్టీ నుంచి బీజేపీ అధికారాన్ని లాక్కున్నదని వారు గుర్తు చేస్తున్నారు. బీజేపీ అనుసరిస్తున్న తీరు ప్రజలలో ఆ పార్టీ పట్ల ద్వేశాన్ని మరింత పెరిగేలా చేస్తుందని అంటున్నారు.

'మణిపూర్ ఎఫెక్ట్.. మిజోరాంకు మోడీ దూరం'

మోడీ తనకు ప్రతికూలంగా ఉన్న రాష్ట్రాల్లో, ప్రాంతాల్లో ప్రచారానికి వెళ్లడనీ, ఇందుకు ఈశాన్య రాష్ట్రం మిజోరామ్ ప్రత్యక్ష ఉదాహరణ అని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. మిజోరాంలో సైతం అసెంబ్లీ ఎన్నిలకు ఉన్నప్పటికీ.. మోడీ అక్కడ ప్రచారానికి వెనకడుగు వేశాడని అంటున్నారు. పొరుగున్న ఉన్న మణిపూర్‌లోని బీజేపీ పాలనలో జాతి ఘర్షణలు చోటు చేసుకోవటం, దానిని నియంత్రించటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం కావటంతో దాని ప్రభావం మిజోరాంలో సైతం పడిందని విశ్లేషకులు చెప్తున్నారు. ఈ కారణంతోనే మిజోరాం ప్రచారానికి వెళ్లకుండా మోడీ తప్పించుకుంటున్నారని అంటున్నారు. మిజోరాంలో బీజేపీకి మిత్రపక్షమైన మిజోరాం ముఖ్యమంత్రి సైతం ప్రధానితో వేదిక పంచుకోవటానికి ఇష్టపడలేదని రాజకీయ విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు.

ప్రజలే గెలవాలి...



(మొదటిపేజీ తరువాయి)

బీజేపీ చేస్తోందని, తెలంగాణలోనూ ఇదే పరిస్థితి ఉందన్నారు. రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్ శత్రువులని ప్రజలను నమ్మిస్తున్నప్పటికీ కేంద్రంలో దోస్తీ నడుస్తోందని చెప్పారు. తెలంగాణలో నిరుద్యోగ సమస్య, సాగునీరు, నిధులు, నియామకాల ఎజెండాతో తెలంగాణ ఉద్యమం మొదలైందని, కానీ ప్రత్యేక రాష్ట్రంలో ఆ సమస్యలు పరిష్కారం కాక ప్రజల ఆశలు నీరుగారాయన్నారు. ప్రధానంగా విద్యా వైద్య రంగంపై నిర్లక్ష్యం కనబడుతుందన్నారు. పూర్తిగా కార్పొరేట్‌మయం చేశారన్నారు. విద్యార్థులకు కేజీ నుంచి పీజీ ఉచిత విద్య, సామాన్యునికి వైద్యం అందనంత దూరంలో ఉన్నాయని తెలిపారు. మరోవైపు నిరుద్యోగ సమస్య జఠిలంగా ఉందన్నారు. వాటిని పరిష్కరించడంలో సీఎం కేసీఆర్ విఫలమయ్యారన్నారు. ఈ ప్రాంతంలో ఎర్రజెండా అభ్యర్థులు మూడు దఫాలుగా గెలిచిన చరిత్ర ఉందన్నారు. కమ్యూనిస్టులు ప్రాతినిథ్యం వహించిన సమయంలో చట్టసభల్లో, బయట పెద్దఎత్తున ఉద్యమాలు చేపట్టినట్టు తెలిపారు. ప్రజాప్రాతినిథ్యం లేకున్నా ప్రజా సమస్యలపై పోరాటం చేసే శక్తి సామర్థ్యాలున్న ఎర్రజెండాను గెలిపించుకోవడం రాష్ట్ర ప్రజల ముందున్న కర్తవ్యమన్నారు. త్రిపురలో ఇద్దరు ఎమ్మెల్యేలతో మొదలై 56 మంది ఎమ్మెల్యేను గెలుచుకున్న చరిత్ర సీపీఐ(ఎం)కి ఉందన్నారు. బీజేపీ కుట్రలో భాగంగా ప్రజల మధ్య విభేదాలు సృష్టించి కమ్యూనిస్టులను ఓడించిందన్నారు. అయినా అక్కడ ఉద్యమాలు ఆగలేదని, భవిష్యత్తు ఎర్రజెండాదేనని స్పష్టంచేశారు. తెలంగాణలోనూ కమ్యూనిస్టు అభ్యర్థులను ఆదరించి, ప్రజా సమస్యల పరిష్కారానికి నాంది పలికేలా అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ, రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్, జయలక్ష్మి, వెంకట్రాములు, జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్, రాష్ట్ర నాయకులు పి.జంగారెడ్డి, ఉడుత రవిందర్, స్కైలాబ్‌బాబు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సామెల్, జగదీశ్, కవిత జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

గ్రేటర్‌లో మోడీ రోడ్‌షో

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ అభ్యర్థుల గెలుపును కాంక్షిస్తూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ రోడ్‌షోను సోమవారం నిర్వహించారు. హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్ రోడ్డు నుంచి చిక్కడపల్లి, నారాయణగూడ, వైఎంసీఏ మీదుగా కాచిగూడ క్రాస్‌రోడ్డు వరకు రోడ్‌షో చేపట్టారు. ప్రధాన వాహనంలో ప్రధాని పక్కన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ ఉన్నారు. గ్రేటర్ పరిధిలో పోటీచేస్తున్న బీజేపీ అభ్యర్థులు కూడా ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. ఈ ర్యాలీలో జనసేన, ఎమ్మార్పీఎస్, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు. రోడ్‌షో పొడుగుతా మోడీకి ఆ పార్టీ కార్యకర్తలు స్వాగతం పలికారు. రోడ్‌షో ముషీరాబాద్, ఖైరతాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాలను టచ్‌చేసేలా సాగింది. కాచిగూడ చౌరస్తాలోని సావర్కర్ విగ్రహంపై ప్రధాని మోడీ పూలు చల్లి నివాళి అర్పించారు. గ్రేటర్ పరిధిలో పోటీచేస్తున్న బీజేపీ అభ్యర్థులు, బీజేపీ రాష్ట్ర నాయకులను పలుకరించారు. అనంతరం ఇందిరాపార్కులో నిర్వహిస్తున్న కోటిదీపోత్సవ పరిసమాప్తి కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేతల ప్రదర్శనలు..ప్రజల ఇక్కట్లు..

ముషీరాబాద్ నియోజకవర్గంలో ఒకే రోజు బీజేపీ బీఆర్ఎస్ పార్టీలు రోడ్‌షోలు, సభలు పెట్టడంతో ఆయా రూట్లలో పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ అయింది. ప్రధాని పర్యటన నేపథ్యంలో ఉదయం నుంచే హిందీమహా విద్యాలయ-ఇందిరాపార్కు రూట్, సికింద్రాబాద్ టూ కోఠి, సికింద్రాబాద్ టూ బషీర్‌బాగ్, బర్కత్‌పుర నుంచి నారాయణగూడ వెళ్లే రూట్లలో పోలీసులు ఆంక్షలు పెట్టడం, వాహనాలను వెళ్లనీయకపోవడంతో ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. ఉదయం నుంచి పహారాలో ఉన్న పోలీసులు వాహనదారుల ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. చేసేదేమి లేక తమ డ్యూటీకి సహకరించాలని కోరారు.







ప్రజలందరి సంక్షేమమే కమ్యూనిస్టుల లక్ష్యం

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య

- ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి గెలుపు కాంక్షిస్తూ నల్లగొండ పట్టణంలో భారీ బైక్ ర్యాలీ

నవతెలంగాణ -నల్లగొండకలెక్టరేట్

ప్రజలందరి సంక్షేమమే లక్ష్యంగా పోరాటాలు చేస్తున్నామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. ఎల్లవేళలా ప్రజల పక్షాన నిలిచే సీపీఐ(ఎం) అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సోమవారం నల్లగొండ నియోజకవర్గ సీపీఐ(ఎం) అభ్యర్థి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి గెలుపు కాంక్షిస్తూ నల్లగొండ పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ బస్టాండ్, రామగిరి, శివాజీనగర్, రవీంద్రనగర్, హైదరాబాద్ రోడ్డు, క్లాక్‌టవర్, ఆర్‌పీ రోడ్డు, పాతబస్తీ, దేవరకొండ రోడ్డు, ప్రకాశంబజార్ మీదుగా సాగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. పేదలకు అండగా నిచిలేది, పేదల సమస్యల పరిష్కారానికి కృషి చేసేది ఎర్ర జెండా మాత్రమేనని తెలిపారు. పేదలు, బడుగు బలహీన వర్గాలు, మహిళలు, గిరిజన, మైనార్టీల హక్కుల కోసం పోరాడుతున్నదని సీపీఐ(ఎం) మాత్రమే అన్నారు. కాబట్టి, శాసనసభలో ప్రజా సమస్యలపై గళమెత్తి రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీయాలంటే సీపీఐ(ఎం) అభ్యర్థులకు అసెంబ్లీకి పంపించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం కొట్లాడటానికి అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్ర శాసనసభల్లో కమ్యూనిస్టులు లేని లోటు కనిపిస్తుందని, కాంగ్రెస్, బీఆర్ఎస్ సభ్యులు స్వార్థప్రయోజనాలకు, కాంట్రాక్టుల కోసం కొట్లాడుతున్నారన్నారు. వారిని ఓడించి సీపీఐ(ఎం) నల్లగొండ నియోజకవర్గ అభ్యర్థి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

కార్యక్రమంలో సీపీఐ(ఎం) ఎమ్మెల్యే అభ్యర్థి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, జిల్లా నాయకులు సయ్యద్ హాషం, పాలడుగు నాగార్జున, ఎం.ప్రభావతి, ఎమ్‌డి.సలీం, నన్నూరి వెంకటరమణా రెడ్డి, పుచ్చకాయల నర్సిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజలను కంటికి రెప్పలా కాపాడుతుంది సీపీఐ(ఎం)

సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటు వేయండి : భద్రాచలంలో బృందా కరత్

నవతెలంగాణ-చర్ల

ప్రజా పోరాటాలు చేస్తూ పేద ప్రజలను కంటికి రెప్పలా కాపాడుతున్న సీపీఐ(ఎం)ని ఆదరించాలని ఆపార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ ఎంపీ బృందా కరత్ అన్నారు. భద్రాచలం నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి కారం పుల్లయ్య విజయాన్ని కాంక్షిస్తూ సోమవారం చర్ల మండల కేంద్రంలో మండల కార్యదర్శి కారం నరేష్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ఆమె మాట్లాడారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎర్రజెండాను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజల పక్షాన గళం వినిపించడానికి అసెంబ్లీలో సీపీఐ(ఎం) ప్రాతినిధ్యం ఉండాలన్నారు. తెలంగాణ జనాభా లెక్కల ప్రకారం.. 119 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్న అసెంబ్లీలో కనీసం 17 మంది గిరిజన ఎమ్మెల్యేలు ఉండాలన్నారు. రాష్ట్ర ఏర్పాటు అనంతరం నిరుద్యోగ సమస్య మరింత పెరిగిందని తెలిపారు.

పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేసి, పోరాటాలు చేసింది ఎర్రజెండానేనని గుర్తు చేశారు. మాజీ ఎంపీ డాక్టర్ మిడియం బాబురావు, తాను కలిసి అటవీ హక్కుల చట్టాన్ని 2006లో తీసుకువచ్చామని గుర్తుచేశారు. అటవీ ప్రాంతంలో ఆదివాసీల హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హరించి వేశాయని ఆరోపించారు. రాష్ట్రంలో ఆదివాసీల భూములపై ప్రభుత్వం హరితహారం పేరుతో ఆక్రమణకు పాల్పడుతుంటే, కేంద్ర ప్రభుత్వం అదానీ, అంబానీలకు ధారాదత్తం చేస్తోందని విమర్శించారు. ఆదివాసీలు సమాజంలో పౌరులు కారా అని ప్రశ్నించారు. 5వ షెడ్యూల్ ప్రాంతంలో పెసా చట్టం తుంగలో తొక్కి యథేచ్ఛగా దోపిడీకి పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వం వచ్చాక గ్రామ సభల తీర్మానంకు విలువ లేకుండా పోయిందన్నారు. పేదల పక్షాన నిలబడి వారి కోసం పోరాటం చేస్తున్న కారం పుల్లయ్యను గెలిపించి అసెంబ్లీకి పంపాలని కోరారు.

కమ్యూనిస్టులకు పట్టం కట్టండి

సబ్బండ వర్గాలకు ఎంతో జీవనోపాధి అందిస్తున్న ఉపాధి హామీ చట్టాన్ని తెచ్చిన సీపీఐ(ఎం)కి పట్టం కట్టాలని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్ పిలుపునిచ్చారు. పోడు భూముల చట్టాన్ని అమలు చేయడం కోసం కారం పుల్లయ్య నిర్విరామంగా కృషిచేసారన్నారు. కారం పుల్లయ్య గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా కష్టించి పని చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ మిడియం బాబురావు, రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు, బండారు రవికుమార్, ఎమ్మెల్యే అభ్యర్థి కారం పుల్లయ్య, నాయకులు ఎలమంచిలి రవి, సీఐటీయూ రాష్ట్ర నాయకులు మధు, జిల్లా కమిటీ సభ్యులు కే.బ్రహ్మాచారి, రేపాకుల శ్రీనివాస్, సీపీఐ(ఎం) సర్పంచులు సమ్మక్క, కృష్ణవేణి, సంధ్య, వెంకటేశ్వర్లు మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



రైతుబంధుపై కాంగ్రెస్ కుట్ర

మాది రైతులతో... పేగు బంధం

- కుట్రపూరితంగానే ఈసీ లేఖలు : మండిపడ్డ మంత్రి హరీశ్‌రావు
- వచ్చేనెల 3వ తేదీ తరువాత రైతుబంధు డబ్బులు పంపిణీ

నవతెలంగాణ-ఝరాసంగం

కాంగ్రెస్ పార్టీ రైతుబంధు పథకంపై కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నదని, పలుమార్లు ఈసీకి కావాలనే లేఖలు రాసి, రైతుబంధు పంపిణీకి అడ్డుపడిందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో మంత్రి హరీశ్‌రావు, జహీరాబాద్ ఎంపీ బి.బి పాటిల్ పాల్గొన్నారు. ముందుగా మండల కేంద్రంలోని దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సభలో మంత్రి మాట్లాడుతూ.. 'మాది రైతులపై ఓటు బంధం కాదని.. రైతులపై పేగు బంధం' అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్ని కుట్రలు చేసినా రాష్ట్రంలో రాబోయేది మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమేనని.. వచ్చేనెల 3 తేదీ తరువాత రైతుల ఖాతాలో రైతుబంధు డబ్బులు పడతాయని ధీమా వ్యక్తం చేశారు. పక్కనున్న కర్నాటకలో రైతులకు కరెంటు లేక.. స్కాలర్‌షిప్స్ రాక.. సరైన పెన్షన్లు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాంటి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే రిస్కులో పడతామని తెలిపారు. జహీరాబాద్ ప్రాంత రైతులకు లక్ష ఎకరాలకు గోదావరి నీళ్లు అందించే బాధ్యత తనదేనని చెప్పారు. మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల ఏర్పాటు, దేవాలయాలు, మసీదుల్లో పనిచేసే పూజరులు, ఇమాములకు జీతాలు పెంచుతామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ నరోత్తం, మాజీ రాష్ట్ర బేవరే జెస్ కార్పొరేషన్ చైర్మెన్ దేవి ప్రసాద్, సీడీసీ చైర్మెన్ పాటిల్, మండలాధ్యక్షులు వెంకటేశం, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు జగదీశ్వర్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నారు

కాంగ్రెస్‌ది బూటకపు సెక్యులరిజం ● బీజేపీ, బీఆర్ఎస్ మిలాఖత్ అయ్యాయి

సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ గఫూర్ విమర్శ



ఇబ్రహీంపట్నం నుంచి బి.బసవపున్నయ్య

విలువైన ప్రజాధనాన్ని కొల్లగొడుతున్న బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను ఎన్నికల్లో ఓడించాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఎన్నికల్లో కోట్లు ఖర్చుపెట్టి, అనంతరం వందల కోట్లు సంపాదిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.. బీజేపీ, బీఆర్ఎస్ అంతర్గతంగా కుమ్మక్కయి ప్రజలను మోసం చేస్తున్నాయన్నారు. కాంగ్రెస్ బూటకపు సెక్యులరిజంను అనుసరిస్తున్నని అన్నారు. రాజకీయాలు ప్రజాసేవ కోసం కాకుండా వ్యాపారమయంగా మార్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

సోమవారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రంలో సీపీఐ(ఎం) ఇబ్రహీంపట్నం అభ్యర్థి పగడాల యాదయ్య తరపున ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

అనంతరం ఇబ్రహీంపట్నం చౌరస్తాలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతూ గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలు పెంచిన మోడీని గద్దెదింపాల్సిన అవసరం ఉందన్నారు. ఆపార్టీ అభ్యర్థులను ఎన్నికల్లో తిరస్కరించాలని కోరారు. మోడీ హయాంలో పెట్టుబడిదారులకు రాయితీలు ఇచ్చి, పేద ప్రజలపై భారాలు మోపారని విమర్శించారు. ఎన్నికల్లో వచ్చే ప్రజల తీర్పులను గందరగోళపరిచి ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. ప్రజల అభివృద్ధి, సంక్షేమం కాకుండా అధికారమే పరమావధిగా మారిందన్నారు. దేశాన్ని అమ్మకానికి పెట్టారని అన్నారు. చాయ్ అమ్మిన మోడీ, ప్రభుత్వ రంగసంస్థలైన రైళ్లు, బొగ్గు, విమానాలు, ఒక్కటేమిటీ ఏదిబడితే అది అమ్ముకుంటూ వస్తున్నారన్నారు. ప్రాజెక్టుల పేర తెలంగాణ సీఎం కేసీఆర్ లక్షల కోట్లు కొల్లగొట్టారన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ కలయికతో రాష్ట్రాన్ని నాశనం చేస్తున్నారని విమర్శించారు. స్థానిక సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేశార న్నారు. ఈ కార్యక్రమానికి సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి. సామేల్ అధ్యక్షత వహించగా పార్టీ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ, రాష్ట్ర కమిటీ సభ్యులు పి.జయలక్ష్మి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు కవిత మండల కార్యదర్శి జంగయ్య, పట్టణ కార్యదర్శి ఎల్లేశ్, నాయకులు వెంకటేశ్ తదితరులతోపాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మూడు కోట్లు సీజ్

నవ తెలంగాణ-ఖమ్మంరూరల్

పాలేరు అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లకు పంచేందుకు సిద్ధంగా ఓ ఇంట్లో నిల్వ చేసిన రూ.3 కోట్లను ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్, పోలీసులు, ఐటీ అధికారులు కలిసి సీజ్ చేశారు. నగదు నిల్వ చేసిన వారిపై ఖమ్మం రూరల్ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు, అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ఇండియా ప్రయివేటు లిమిటెడ్ ప్రాజెక్టు మేనేజర్ జగ్గవరపు శ్రీకాంత్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ పొంగులేటి ప్రసాద్ రెడ్డి ఇద్దరు కలిసి గత నెల అక్టోబర్‌లో జగ్గవరపు శ్రీకాంత్ రెడ్డి బంధువయిన ఏదులాపురం పంచాయతీ వరంగల్ క్రాస్ రోడ్‌లోని శ్రీరామ్ నగర్ కాలనీలో నివాసం ఉంటున్న చండు కరుణ ఇంట్లో రూ.3 కోట్లు పెట్టారు. పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నియోజకవర్గంలో ఓటర్లకు పంపిణీ చేయడానికి ఉద్దేశించి ఈ నగదు నిల్వ చేసినట్టు తెలుస్తోంది. ఎన్నికలకు రెండు, మూడు రోజుల ముందుగా ఆ నగదు ఓటర్లకు పంచేందుకు నిర్ణయించారు. ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తమకు వచ్చిన సమాచారం మేరకు పోలీసులు, ఐటీ అధికారులతో కలిసి చుండు కరుణ ఇంట్లో ఆదివారం అర్ధరాత్రి తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో రూ.3 కోట్లు నగదు పట్టుబడింది. పట్టుబడిన నగదును ఐటీ అధికారులు సీజ్ చేశారు. సంఘటనపై ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి అజయ్ కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మధిరలో అభివృద్ధి ఆగింది

సీపీఐ(ఎం) ఎమ్మెల్యే లేకపోవడమే కారణం

నన్ను గెలిపిస్తే సమస్యల పరిష్కారంపైనే దృష్టి

సీపీఐ(ఎం) మధిర నియోజకవర్గ అభ్యర్థి పాలడుగు భాస్కర్



మధిర నియోజకవర్గం సమస్యలకు నిలయంగా ఉంది. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే శాసనసభలో ప్రభుత్వంపై పోరాడి నిధులు తీసుకువచ్చి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని సీపీఐ(ఎం) మధిర నియోజకవర్గ అభ్యర్థి పాలడుగు భాస్కర్ అన్నారు. 20 ఏండ్లుగా మధిరకు సీపీఐ(ఎం) ఎమ్మెల్యే లేకపోవటం వల్లే నియోజకవర్గ అభివృద్ధి ఆగిపోయిందన్నారు. 15 ఏండ్లు ఎమ్మెల్యేగా అందులో ఐదు సంవత్సరాలు ప్రభుత్వ చీఫ్ విప్ గా, డిప్యూటీ స్పీకర్ గా పనిచేసిన మల్లు భట్టి విక్రమార్క, నాలుగేండ్లుగా జిల్లా పరిషత్ చైర్మన్ గా ఉన్న లింగాల కమల్ రాజు చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పాలడుగు భాస్కర్ నవతెలంగాణతో మాట్లాడారు. ఆయన మాటల్లోనే..

నియోజకవర్గంలో ఉన్న సమస్యలు ఏమిటి?

నియోజకవర్గ వ్యాప్తంగా సాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. ఎత్తిపోతల పథకాలు పనిచేయకుండా నిరుపయోగంగా మారాయి. బోనకల్ - ఖమ్మం ప్రధాన రోడ్డు దారుణంగా ఉంది. బోనకల్ మండల కేంద్రంలో ఆర్‌ఓబి బ్రిడ్జి ప్రమాదకరంగా ఉంది. మధిర మున్సిపాలిటీలో డ్రైనేజీ, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు సమస్య తీవ్రంగా ఉంది. బోనకల్ మండల కేంద్రంలో ఆనాటి ప్రభుత్వ చీఫ్ విప్ మల్లు భట్టి విక్రమార్క బోనకల్ గ్రామానికి చెందిన దళిత, గిరిజన భూములను బలవంతంగా లాక్కొని ఇందిరమ్మ డైరీ నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. కాని దాని జాడ ఇంతవరకు అడ్రస్ లేదు. మధిర మండలం మడుపల్లిలో లెదర్ పార్కుకు నిర్మాణం చేయకుండా వదిలేశారు. బోనకల్ మండల కేంద్రంలో తోళ్ల పరిశ్రమ ఏర్పాటు వాగ్దానం లాగే ఉంది. ఎర్రుపాలెం మండలం రేమిడిచర్లలో పరిశ్రమల కోసం 60 ఎకరాలను సేకరించినా పరిశ్రమ లేదు. ఎర్రుపాలెం మండలంలో కట్టలేరు ప్రాజెక్టు సామర్థ్యం పెంచాలి. ఇంకా అనేక సమస్యలు నియోజకవర్గంలో విలయతాండం చేస్తున్నాయి.

వాటి పరిష్కారం మార్గం ఏమిటి?

తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఈ సమస్యల పరిష్కారం కోసం శాసనసభలో ప్రభుత్వంతో పోరాడి నిధులు తీసుకువచ్చి పరిష్కారం చేస్తాను. రైతుల పంటలకు మద్దతు ధర, రైతులు తమ పంటలను నిల్వ చేసుకునేందుకు గోడౌల నిర్మాణానికి కృషి చేస్తాను. పోరాటమే తన ఎజెండా తప్పా ప్రభుత్వంతో రహస్య ఒప్పందాలు, ప్రభుత్వానికి భయపడి లొంగిపోను. ఎమ్మెల్యే పదవిని అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారం కోసమే వినియోగిస్తాను.

సీపీటీయూ ఆధ్వర్యంలో తాను చేసిన పోరాటాల ఫలితంగా ప్రభుత్వం 5 జీవోలను విడుదల చేసింది. కార్మికులకు, సెక్యూరిటీ గార్డు, కెమికల్ ఇండస్ట్రీ కార్మికుల వేతనాలు పెరిగాయి. పెండింగులో ఉన్న ఉపాధి హామీ బిల్లులు విడుదల చేయించాం. వీఆర్ఏలను పర్మినెంట్ చేపించాం. తొలగించిన ఫీల్డ్ అసిస్టెంట్లను తిరిగి ఉద్యోగంలోకి తీసుకునే విధంగా పోరాటం చేసి విజయం సాధించాం. ఇవన్నీ సీపీఐ(ఎం) పోరాటాల ఫలితమే. సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ రంగాల కార్మికుల పోరాటాలకు తలవంచి.. ప్రభుత్వం జీవోలను విడుదల చేసింది.

అందుకే ఎన్నికల్లో గెలిపిస్తే శాసనసభలో పోరాడి నిధులు తీసుకువచ్చి మధిర నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తాను.

నవతెలంగాణ - బోనకల్



హరీశ్ రావు ఆగడాల వల్లే రైతుబంధు ఆగింది..

డోర్నకల్ ప్రచార సభలో టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి

నవతెలంగాణ-మరిపెడ

రైతు బంధును అడ్డుపెట్టుకొని ఎన్నికల్లో లబ్ధి పొందాలని మామ అల్లుడు చూస్తే.. ఎన్నికల కమిషన్ స్పందించి దాన్ని నిలిపివేసిందని, కాంగ్రెస్ ఫిర్యాదు వల్లే రైతుబంధు ఆగిపోయిందని హరీశ్‌రావు, కేసీఆర్ ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నియోజకవర్గంలోని మరిపెడ మండల కేంద్రంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచార సభలో రేవంత్ మాట్లాడారు. రైతుబంధు ఇవ్వాలనుకున్నప్పుడు.. ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే ఇవ్వొచ్చు కదా అని కేసీఆర్‌ను ప్రశ్నించారు. 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కి తెలంగాణ రైతులు ఓట్లు వేసి గెలిపిస్తే డిసెంబరు 9 తర్వాత ప్రతి రైతు ఎకౌంట్‌లో రైతుబంధు సాయం కింద రూ.15 వేలు అందిస్తామని తెలిపారు. ఉద్యోగ నోటిఫికేషన్లు వేయకుండా వేసినా వాటిలో లొసుగులతో రెండు లక్షల మంది నిరుద్యోగుల జీవితాలతో అడ్డుకుంటున్న అసలైన దొంగ కేసీఆర్ అని విమర్శించారు. ఈ రెండు రోజులు అప్రమత్తంగా ఉండాలని, మీ భవిష్యత్తును మీరే కాపాడుకోవాలని యువకులకు పిలుపు నిచ్చారు.

కేసీఆర్ కుటుంబ పాలన, డోర్నకల్‌లో రెడ్యా నాయక్ అవినీతి పాలనను అంతమొందించాలని, వచ్చే ఎన్నికల్లో డాక్టర్ రామచంద్రనాయక్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ డోర్నకల్, మహబూబాబాద్ అభ్యర్థులు డాక్టర్లు రామచంద్రనాయక్, మురళి నాయక్, మాజీ కేంద్రమంత్రి బలరాం నాయక్, మాజీ ఎంపీ సురేందర్ రెడ్డి, డీసీసీ జిల్లా అధ్యక్షులు జన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు ఒంటికొమ్ము యుగంధర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లూరి కృష్టారెడ్డి, జిల్లా నాయకులు వెన్నం శ్రీకాంత్ రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయ సారథి, నాయకులు నల్లు సుధాకర్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు రాధాబాయి, మహలోతు నెహ్రూ నాయక్ తదితరులు పాల్గొన్నారు. జరిగింది.

పార్టీలు మార్చేటోళ్లు నాపై పోటీ

ప్రజా సమస్యలపై వారు ఏనాడైనా పోరాడారా?

సీపీఐ(ఎం) అడ్డుపడకపోతే మార్కెట్ తరలించేవారే..!

ఖమ్మం నియోజకవర్గ సీపీఐ(ఎం) అభ్యర్థి యర్రా శ్రీకాంత్



"నాపై పోటీ చేసిన ప్రధాన పార్టీల అభ్యర్థులు ఇరువురూ పువ్వాడ అజయ్‌కుమార్, తుమ్మల నాగేశ్వరరావు ఇప్పటికీ మూడు, నాలుగు పార్టీలు మారారు. స్వీయలాభం కోసం పార్టీలు మారే వాళ్లు కావాలా..? ప్రజా సమస్యలపై నికరంగా పోరాడే సీపీఐ(ఎం) పార్టీ తరఫున పోటీ చేస్తున్న నేను కావాలా..?" ప్రజలు ఆలోచించాలి' అని ఖమ్మం నియోజకవర్గం సీపీఐ(ఎం) అభ్యర్థి యర్రా శ్రీకాంత్ తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన నవతెలంగాణతో మాట్లాడారు. శ్రీకాంత్ మాటల్లోనే...

గ్రెయిన్ మార్కెట్‌ను తరలకుండా అడ్డుకున్నా...

40 ఏండ్లుగా అనేక పోరాటాల్లో సీపీఐ(ఎం) తరఫున భాగస్వామిని అయ్యాను. ఖమ్మం త్రీటౌన్ ప్రాంతానికి మణిహారంగా ఉన్న గ్రెయిన్ మార్కెట్‌ను తరలించాలని బీఆర్ఎస్ తరఫున పోటీ చేసిన పువ్వాడ అజయ్‌కుమార్, కాంగ్రెస్ నుంచి బరిలో ఉన్న తుమ్మల నాగేశ్వరరావు ప్రయత్నించారు. దీన్ని అడ్డుకోవడానికి నాలుగేండ్ల పాటు పోరాటం చేశాను. పది రోజుల పాటు నిరాహారదీక్ష చేశాను. అనేక నిర్బంధాలను ఎదుర్కొన్నాను. ఖమ్మం బస్టాండ్ తరలింపుపైనా..కరెంట్ చార్జీలపైనా, ఇండ్లస్థలాల కోసం సీపీఐ(ఎం) తరఫున పోరాటం చేశాం. కేసులు పెట్టినా, జైలుకు పంపినా భయపడలేదు.

పేరుకుపోయిన సమస్యలు...

ఖమ్మంలో అనేక సమస్యలు పేరుకుపోయాయి. నా ప్రత్యర్థులిద్దరూ అభివృద్ధి కాముకులమని చెప్పుకుంటున్నారు. ఇండ్ల స్థలాల సమస్యను పట్టించుకోలేదు. అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ గురించి ఆలోచించడం లేదు. శివారు ప్రాంతాల అభివృద్ధి గురించి ధ్యాస లేదు. ఖమ్మంలో ఈఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటు, గ్రెయిన్ మార్కెట్లో హెల్త్‌సెంటర్ ఇవన్నీ అపరిష్కృతంగానే ఉన్నాయి. మున్నేరు వరదల నుంచి రక్షణకు ఆర్‌సీసీ వాల్ నిర్మాణానికి శంకుస్థాపన జరిగినా పూర్తి చేయడంపై అనుమానాలున్నాయి. హమాలీలు, శ్రామిక మహిళల కోసం సమగ్ర చట్టం చేయడం లేదు. గెలిపిస్తే ఈ సమస్యలపై ప్రజల డిమాండ్లను అసెంబ్లీలో వినిపించి పరిష్కారం అయ్యేలా సాధించి తీరుతా.

డబ్బులతో వాళ్లు...పోరాటాలతో నేను...

ప్రధాన పార్టీల అభ్యర్థులు ఇద్దరూ డబ్బులను నమ్ముకుని ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. నేను మాత్రం పోరాటాలనే నమ్ముకున్నాను. 3వ తారీఖు ఫలితాల్లో డబ్బులను నమ్ముకున్న వాళ్లను ఆదరిస్తారా? సమస్యలపై పోరాడే నన్ను అక్కున చేర్చుకుంటారో? ప్రజలదే తుది నిర్ణయం.

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.